# కథామంజరి

## పది కథల సమాహారం



ఫిబ్రవరి 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**ఫిబ్రవరి 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 2



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ /శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి



ఈ నెల సంచికకు చేయూతనిచ్చిన వారు,

**స్వర్గీయ చిర్రావూరి సర్వేశ్వరశర్మ, లలిత గార్ల**

జ్ఞాపకార్థం వారి కుమారుడు

**డా. చిర్రావూరి శ్యామ్ గారు, (యుఎస్ఏ),**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**






## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| కథాపుస్తక పరిచయం | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| దర్పణం | శింగరాజు శ్రీనివాసరావు | 1 |
| తొలి సంధ్య వేళలో..! | జాస్తి రమాదేవి | 7 |
| ప్రయత్నం | మద్దూరి నరసింహమూర్తి | 12 |
| ఋణానుబంధం ! | కొత్తపల్లి ఉదయబాబు | 18 |
| సంఘర్షణ | అనంతపట్నాయకుని కిశోర్ | 25 |
| అంతర్యుద్ధం | వారణాసి భానుమూర్తి రావు | 35 |
| అమ్మ చెప్పింది నిజమే! | సరస్వతి కరవది | 44 |
| మంచి చేస్తే మంచే జరుగుతుంది | సి. హెచ్. నాగార్జున శర్మ | 47 |
| హైదరాబాద్ హరిదాసు | కర్లపాలెం హనుమంతరావు | 49 |
| పొగడ పూలు | కీ. శే. శ్రీ పోరంకి దక్షిణామూర్తి | 57 |


Cover Page Credits : Matteo Badini, Placenza, italy

# కథాకీయం

"ఏ దేశానికైనా.. సంస్కృతి, సాహిత్యం అక్కడ మనుషులకు ఆక్సిజన్ వంటిది. సాహిత్యం ఆ మనుషుల ఉనికిని చెప్తుంది. యావత్తు మానవాళిని సక్రమమార్గంలో నడిపేది.. సంస్కృతి, సాహిత్యమే..." ఇలాంటి ఉపన్యాసాలు ఎప్పుడూ వింటూంటాం! నిజానికి ఓ రెండుమూడు దశాబ్దాల క్రిందట ఇలాంటి మాటలకు చేతలు కూడా జోడి అయి.. పాలకులే సాహిత్యానికి పెద్దపీట వేసేవారు. సంస్కృతిని గౌరవించేవారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత ఉన్న పరిస్థితులను ఒక్కసారి పరిశీలిస్తే.. భాషా సంస్కృతులతో పాటు సాహిత్యానికి కూడా ప్రత్యక్షంగానే ఆదరణ ఉండేది. ప్రభుత్వమే స్వయంగా పర్యవేక్షణ చేసేది. తగినరీతిలో చర్యలు తీసుకుంటూ, రాజపోషకుల పాత్ర నిర్వహించేది.

క్రీడా, సాహిత్య రంగాల విషయంలో.. గతమెంతో ఘనమైనదని చెప్పుకోడానికి చాలా తార్కాణాలున్నాయి! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలు కూడా ఈ రెండు రంగాలకి ప్రోత్సాహం ఇచ్చాయి. క్రీడల విషయంలో ఓ అడుగు ముందుకు వేసి, ఆయా సంస్థలలో కొన్ని క్రీడలకి సంబంధించి జాతీయస్థాయి క్రీడాకారులకు ఉద్యోగాలు కూడా ఇచ్చాయి! అయితే కవులు రచయితలకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు కాని, సంస్థల్లో ఉన్న రచయితలను, ఇతర కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చాయి. ప్రతీ కార్యాలయంలోనూ చిన్న గ్రంథాలయ నిర్వహణ ఉండేది. ఆయా సంస్థల్లో 'హౌస్ మాగజైన్స్' ఉండేవి. వాటిని నిర్వహించే బాధ్యత కూడా ఆయా సంస్థల్లో పనిచేసే ఔత్సాహికులైన రచయితలకే ఇచ్చేవారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతీ ఏటా నిర్వహించేవారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం.. ఆయా సంస్థలు బడ్జెట్ కేటాయింపులు కూడా చేసేవి. ఇవన్నీ మన భాషని, మన సంస్కృతిని.. అంతకు మించి మన సాహితీసంపదను నిలబెట్టాయి.

గ్లోబలైజేషన్ తర్వాత పూర్తిగా మార్పు వచ్చేసింది. ప్రాధాన్యతలు మారిపోయాయి. సంస్కృతి, సాహిత్యం.. అంటూ మాటలు వినబడుతున్నాయి గాని, చేతలు శూన్యం! అయితే... వాటిని నిలబెట్టి, నడిపించే బాధ్యతల్ని భాషాభిమానులు, సాంస్కృతిక సంస్థలు చేపట్టినా.. వీటి వెనుక పని చేస్తున్న ఔత్సాహికుల సగటు వయసు అరవై ఏళ్ళ పైమాటే! ఈ బాధ్యతలకు యువత దూరంగా ఉన్నారు. పాలకులకు చిత్తశుద్ధి లేదు.

వెరసి.. యావత్తు మానవాళి ఉనికికే ప్రమాదం అని ఎందుకు ఆలోచించడం లేదు??

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

## శ్రీ కర్లపాలెం హనుమంతరావు

ఓ అరవై, డెబ్బై సంవత్సరాల వెనుక.. పది పదిహేను సంవత్సరాల వయసులోనే సాహిత్యం మీద మక్కువ ఏర్పడేది. రచనలు చేయకపోయినా.. చదివే అలవాటు అలవోకగా అలవాటయ్యేది. ఇంటా, వంటా సాహిత్యపరమైన కుటుంబ నేపథ్యం లేకపోయినా.. రచనలు చేయడం, మాతృభాష వైపు ఎక్కువ దృష్టి సారించడం సాగేది. కనబడ్డ చిత్తుకాగితాన్ని కూడా వదలకుండా చదివి, తనకు తానే రచనారంగ జీవితంలోకి అడుగు పెట్టేవారు. అందుకే ఆ రోజుల్లో రచనారంగంలోకి అడుగుపెట్టిన రచయితలు స్థిరస్థాయిగా నిలిచిపోయారు. వారి రచనలు అజరామరంగా నిలిచిపోయి, ఈ రోజుకీ ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాయి. అలాంటి రచయితల్లో మరో ఆణిముత్యం శ్రీ కర్లపాలెం హనుమంతరావు గారు.

హనుమంతరావు గారు మధ్యతరగతి, గ్రామీణనేపథ్యంలో పుట్టి, పెరిగి, పది హేనేళ్ళ ప్రాయంలోనే కలం పట్టుకుని పత్రికల మీద దాడి మొదలెట్టి, ఇప్పటికీ అలుపెరగని అక్షరదాడి చేస్తూనే ఉన్నారు. చేస్తున్న బ్యాంకు ఉద్యోగాన్ని.. ఇంకా పదేళ్ళ సర్వీసు ఉండగానే, వదిలిపెట్టి 'రాతల' వేటలో పడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా తెలుగు గ్రంథాలనీ, పుస్తకాలనీ సేకరించి భద్రపరిచే వందేళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలయ నిలయమైన వేటపాలెం (ప్రకాశం జిల్లా) 'సారస్వత నికేతనం' నా రచనల తొలినాటి పాఠశాల" అని ఆనందం చెప్పుకునే హనుమంతరావు గారు, తనకి రోల్ మోడల్.. వారి పెద్దన్నయ్య, యల్.ఐ.సి. ఎంప్లాయిస్ యూనియన్‌కి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన, ప్రముఖ సి.పి.యం. నాయకులు కీ.శే. కర్లపాలెం మధుసూదనరావు అని కూడా ఆనందంగా చెప్తూంటారు. 1967లో రచనాప్రస్థానం మొదలెట్టి, చందమామలో నుంచి భారతి వరకు అన్ని పత్రికలలో తన రచనాప్రక్రియలతో అలరించారు. కథ, నవల, నాటిక, వ్యాసం, కవితా, కాలమ్స్, సంపాదకీయాలు.. ఒకటేమిటి అన్ని ప్రక్రియలలో 'కలం' చేసుకున్నారు. 'ఆటలు కూడా ఆడతాను గానీ, సంగీతమే కుదరలేదు' అంటూ కొసమెరుపు అందించారు. "సాహిత్యానికి ఓ ప్రయోజనం ఉంటుంది. ఆ ప్రయోజనం సామాజికపరంగా ఉంటుంది. రచయితలు ఈ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి. కథ సహజంగా ఉండాలి... అంటే కథలో రచయిత ఎన్నుకున్న ప్రధాన వస్తువు.. నిత్యం వర్తమాన జీవితంలో జరిగేదిగా ఉండాలి. కథ చదివిన పాఠకుడి మనసు రసవంతం చేయాలంటే శైలిని, శిల్పాన్ని అందంగా అందించడం అలవరచుకోవాలి! అవన్నీ సరిగ్గా ఉన్నా... సమాజాన్ని, మనిషిని, మనసుని వెనక్కి నడిపించి చీకటిలోకి నెట్టి, విలువలను దిగజార్చే కథలను ఎంత కష్టపడి, అందంగా వండి వార్చినా.. అవి చెడ్డకథలే అవుతాయి. అలాంటి చెడ్డకథ నేనూ రాసాను!" అంటూ 'నేను రాసిన చెడ్డకథ' అంటూ నేరుగా ఓ వ్యాసమే రాసారు. అది రచయిత అన్నవారు తప్పకుండా చదవాలి.

ఈనాడు దినపత్రికలో 14 ఏళ్లు ఫీచర్లు వ్రాయడం ఓ మంచి అనుభూతి ఇచ్చిందంటున్న హనుమంతరావు గారు కొంతకాలం సినీ రచయితగా కూడా పని చేసారు. ఎన్నో కథలకు బహుమతులు అందుకున్న వీరు... పోతన, గురజాడ, కొడవటిగంటి, రావిశాస్త్రి, శ్రీశ్రీ వంటి తెలుగుకవులను, రచయితలను ఇష్టపడతారు.

వేలల్లో కథలు చదివి, వందల్లో కథలు, ఒకే ఒక నవల వ్రాసిన హనుమంతరావు గారు.. చాలా కథలపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు! మొన్న కథామంజరి సంక్రాంతి కథల పోటీకి న్యాయనిర్ణేతగా మాక్కూడా సహకరించినందులకూ, ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకూ.. శ్రీ కర్లపాలెం హనుమంతరావు గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అజరామరంగా నిలిచిపోయే రచనలతో నిండు నూరేళ్ళు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలనీ కోరుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. పోరంకి దక్షిణామూర్తి**

'కథానిక' అనే ఓ గ్రంథం.. ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పి.హెచ్.డి. పట్టం పొందిన సిద్ధాంత గ్రంథం! కథానిక – స్వరూప స్వభావాలను సమగ్రంగా అందించిన ఈ గ్రంథం 1988 లో విడుదలైంది, కాని అప్పటికి పదేళ్ళ వెనుకే ఈ గ్రంథ రచన జరిగిందిట. "ఇప్పటి వరకు కథాప్రక్రియకు సంబంధించి సాహిత్యశాస్త్రం అంతగా రూపొందలేదు. సమీక్షాత్మక వ్యాసాలూ, సంగ్రహరచనలూ తప్ప, సమగ్రమైన పరిశీలనాత్మక గ్రంథం.. అంత వరకు రాలేదు! ఇది సర్వసమగ్ర గ్రంథమని చెప్పలేను, కాని కొంతలో కొంత, అందులోకి తొంగి చూసి, పరిశీలించడానికి అవకాశం నాకొచ్చింది." అంటూ ఆ గ్రంథ రచయితే స్వయంగా అన్నారు. కథాసాహిత్యం మీద పరిశోధన చేయడం అదే మొదటిసారి. అలాంటి అపూర్వగ్రంథాన్ని భావితరాలకు అందించడమే కాకుండా, కథా, నవలా రచయితగా కూడా బాగా గుర్తింపు పొందిన సాహిత్యవేత్త కీ.శే. పోరంకి దక్షిణామూర్తి గారు.

తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో 1934లో జన్మించిన దక్షిణామూర్తిగారి విద్యాభ్యాసం మండపేట, రాజమండ్రిలో జరిగింది. "ప్రముఖ హాస్యకథకులు భమిడిపాటి కామేశ్వరరావుగారు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గార్ల దగ్గర చదువుకునే భాగ్యం కలిగింది. వారి వలననే ఏం వ్రాసినా వాడుకభాషలోనే వ్రాయాలని అనిపించింది. కాకినాడలో ఇంటర్ చదువుతున్నప్పుడు.. కాలేజీలో ఓ సభలో పాల్గోడానికి శ్రీశ్రీ గారు వచ్చినపుడు, వారికి మా కాలేజీ యాజమాన్యం నా రూములోనే వసతి కల్పించారు. అప్పుడే దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి దిగ్గజాలు రావడంతో, వారితో పరిచయభాగ్యం కలిగింది. వారి కవిత్వం చదివిన తర్వాత సాహిత్యం వైపు అడుగులు వేసాను. 1953 సం.లో ఇంటర్ చదువుతున్నప్పుడే కథలు వ్రాయడం మొదలెట్టాను" అంటూ తన సాహితీప్రస్థానం గురించి చెప్తారు. "ఇటీవల కాలంలో కొన్ని పత్రికల్లో భాషను గురించి వ్రాస్తున్న విషయాల్లో అవగాహనా రాహిత్యం కనబడుతోంది. మాండలికం అనేది భాషలో అంతర్భాగమే కాని.. అదేం వేరు కాదు. మాండలికాలు.. ప్రాంతాలు, సంస్కృతి వంటి ఎన్నో విషయాల మీద ఆధారపడి, భాషలో నుంచే వచ్చాయి. వేటికి అవే సాటి, అంతే గాని ఇది గొప్పది, అది గొప్పది అనకూడదు" అంటూ నిక్కచ్చిగా, మన తెలుగుభాష మీద తన అభిప్రాయాలని చెప్పారు. ఆ ఆలోచనతోనే రచనలు చేస్తూ.. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర మాండలికాలలో ఒకే అంశం మీద, నవలను రచించిన రచయితగా కూడా గుర్తింపు పొందారు. ఇలాంటి ప్రక్రియ చేసినవారు లేరనే చెప్పాలి. దక్షిణామూర్తిగారు ఉస్మానియా యూనివర్శిటీలో పి.జీ. చేసి, అక్కడే తెలుగుశాఖ రీడర్‌గా పనిచేసారు. అదే యూనివర్సిటీలో తెలుగు కథానికపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. కోమలి నవ్వింది, చంద్రవంక, పలకరింపు, ప్రాణం పోసినవాడు, రేఖాచిత్రం, ఏడుపాయల దొరసాని, కదంబం వంటి ఎన్నో కథలు; వెలుగు వెన్నెల

గోదారి, ముత్యాలపందిరి, నీడలు జాడలూ వంటి నవలలే కాకుండా, మరెన్నో సాహిత్యవ్యాసాలు, అనువాదాలు కూడా వీరి కలం నుండి జాలువారాయి. ముఖ్యంగా.. నిఘంటువుల సంకలనాలను అందించారు. భాష కూడా కాలమాన పరిస్థితుల్లో మారుతుందనే ఆలోచనతో, ఈనాడు ఉన్న వ్యావహారికభాషలో ఆరో తరగతి విద్యార్థుల కోసం, ప్రత్యేకించి "తెలుగు వాచకం" వ్రాసి పాఠ్యాంశంగా అందించారు. ఇది ప్రభుత్వమే ప్రచురించింది. సుమారు నలభై పుస్తకాలు వెలువరించిన దక్షిణామూర్తిగారు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. చాలా కాలం కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కమిటీలో సభ్యుడిగా కూడా పనిచేసారు. "రచయిత చేసే కల్పన గాని, ఊహ గాని మనిషి ఉనికిని నిలబడుతుంది. అందుకే రచయిత. మిగతావారికి అతీతంగా ఉండాలి." అంటూ రచయితలకు హితవు పలికిన దక్షిణామూర్తిగారు, 2021 ఫిబ్రవరి నెలలో తన ఎనభయ్యారో ఏట కాలం చేసారు!

తెలుగుభాషకి, సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన కీ.శే. పోరంకి దక్షిణామూర్తి గారికి ఘనమైన నివాళి అర్పిస్తున్నాం.

**కథామంజరి బృందం**

# కథా పరిచయం

## డా. ఎం.వి. రమణారెడ్డి గారి కథ “ఇరుకు సందు”

కెవీఆర్ గా ప్రసిద్ధిచెందిన డా. కె.వి. రమణారెడ్డి గారు.. ఒక కవి, విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు. అంతకంటే వామ పక్ష భావాలు కలిగి అభ్యుదయ కవి సంఘంలో సభ్యునిగా, విరసం వ్యవస్థాపక కార్యదర్శిగా, తన వ్యాసాల ద్వారా, కవిత్వం ద్వారా, రాజకీయ కార్యాచరణ ద్వారా... ప్రభుత్వానికి ఒక శత్రువుగా మారి చాలా సార్లు జైళ్ళలో గడిపిన వ్యక్తిగా చాలా మందికి తెలుసు. ఆయన ఎన్నో వ్యాసాలు రాశారు. ఎన్నో కవితాసంపుటాలు వెలువరించారు. తన అరవై ఏళ్ళ వయసులో 1988లో జైల్లో ఉన్నప్పుడు ఆయన కలం నుండి వచ్చిన మొదటి కథ ‘ఇరుకు సందు’. ఈ కథతో పాటు ఇంకో ఎనిమిది కథలతో వెలువరించిన ఒక సంకలనం ‘పరిష్కారం’. అంతవరకూ ఆయన రాసినవి తొమ్మిదే కథలు.

ఈ సంపుటిలోని కథల గురించి రాస్తూ మధురాంతకం రాజారాం గారు ‘అవి ఇతరుల అభిప్రాయాలతో అగత్యం లేని కథలు, స్వయంగా ప్రకాశించేవి’ అంటారు. తను రాసే కథలకు ఒక ప్రయోజనం ఉండాలని, సామాన్య ప్రజల జీవితాలకు, వారి సమస్యలకు అద్దం పడుతూ, కొంచెం పరిష్కారం కూడా సూచించాలనే ఉద్దేశ్యంతో వెలువరించిన కథలుగా కనిపిస్తాయి.

‘ఇరుకు సందు’ కథ మన వీధుల్లోని ఇరుకుసందు గురించి మాత్రమే కాదు. మన ఆలోచనల్లోని ఇరుకు సందుల్ని కూడా తట్టి లేపుతుంది.

ఆఫీసు నుండి రాగానే శ్రీమతి ఎంతో ఆత్రంగా చెప్పదల్చుకున్న విషయం.. తమ ఇంటికెదురుగా ఉన్న ఇరుకు సందుకి అటువైపున్న ఖాళీ స్థలాన్ని ఎవరో కొన్నారని, ఇల్లు కట్టిస్తారని! ఆ విషయం ఎందుకంత ముఖ్యమయిందో ఆ ఇరుకుసందే చెప్తుంది. దాయాదుల ఆస్తి తగాదాల్లో భాగమై, కోర్టుపాలై, కొనే దిక్కులేక, ఈసురోమని నిలిచిపోయిన ఆ స్థలం ఇప్పుడమ్ముడుపోతోందంటే విశేషమే మరి! అదొక పెంటదిబ్బగా, మరుగుదొడ్డిగా, గోళీకాయల రంగస్థలంగా, అటుపక్క సందుకి వెళ్ళడానికి షార్ట్‌కట్‌గా, ఇలా ఎన్నో విధాలా ఉపయోగించబడేదింతవరకూ ఆ స్థలం. ఆ స్థలానికి ఒక మూల మొండుబారిన చింత చెట్టు కూడా ఉంది రాత్రిపూట భయాన్ని కలిగిస్తూ!

అంత విశేషమైన వార్త విన్న తరవాత కూడా ఆసక్తి చూపని మొగుడంటే విసుగుపుట్టని ఆడదుంటుందా? అతని భార్య సుశీలమ్మ కూడా అంతే.

అది జరిగిన ఓ శనివారం ఇంటికి రాగానే కనిపించిన దృశ్యం.. ‘తుంటలు తుంటలుగా పడిఉన్న చింత చెట్టు, దాన్ని గొడ్డళ్ళతో నరుకుతున్న నాలుగు నల్లటి ఆకారాలు. అదొక వినోదంలా చూస్తున్న చిన్నపిల్లలు, అందులో నాలుగేళ్ల నానిగాడు.’

సైకిలు పైన పెడుతూన్నప్పుడు వరండాలో కనిపించాడో అపరిచిత వ్యక్తి, తెల్లని, మడత నలగని చొక్కా, ధోవతీతో తన పడక్కుర్చీలోనే కూర్చుని చింతకొమ్మలు నరికే పనిని తీక్షణంగా చూస్తూ. శ్రీమతి ఆనందంగా కాఫీ తెచ్చి ఆయనకివ్వడం,

తన్ను పరిచయం చెయ్యడం, కొంచెమేమిటి బాగానే ఇబ్బందవుతోంది. పైగా కోర్ట్లను వదిలించుకొని ఇంటిని కొనడంలో ఆయనే ఏదో నష్టపోతున్నాడన్నట్లు మాట్లాడ్డం ఇంకా చికాకనిపించింది. ఆయన రోజూ వస్తూ శ్రీమతి ఇచ్చిన కాఫీని సేవిస్తూ, తన ఇల్లు కట్టించుకునే వ్యవహారం జరుగుతూనే ఉంది. కాఫీ ఖర్చు!

ఆయన పేరు సుబ్బరామయ్య.

ఇరుగు పొరుగు వాళ్ళు సమస్యలను తీసుకొస్తూనే ఉన్నారు. శాపనార్థాలు పెడుతూనే ఉన్నారు ఆ వ్యక్తికి. తన గోడపక్క అంతంత గోతులు తీస్తే తన గోడకి, ఇంటికి ఏమైపోతుందని పెద్ద గొంతుతో తిడుతున్న మంగమ్మకి ఆ వ్యక్తి కూసింత కూడా తొణకలేదు. "నీ అవిటి గోడ కోసం నా పునాదులు ఆపాలా? పో" అన్నాడా పెద్దమనిషి. తను చేసే పనిని గిట్టని వాళ్ళు చెప్పే మాటలేనని కొట్టేశాడు. అంటే ఆ వీధి మహిళామండలిలో ఆయన అంత పలుకుబడి పెంచుకున్నాడన్నమాట.

మరో పదిరోజుల తరువాత ఎదురింటి కనకమ్మ తన ఇంటి గుమ్మం ముందు మట్టి పోసాడని ఫిర్యాదు తన భార్య సుశీలతో. ఆవిడకు ఖాళీ జాగాలో తనే ఓ పెంటదిబ్బ చేయలేకపోతోందని బాధ. 'పునాదులు తీస్తుంటే మట్టి అటూ ఇటూ పడకుండా ఉంటుందా?' అన్నది తన శ్రీమతి ఆ పెద్దమనిషిని పరోక్షంగా సమర్థిస్తూ! మహిళామండలిలో ఆ వ్యక్తి పలుకుబడి ఎంత పేరుకుపోయిందో తెలుస్తోంది మరోసారి.

ఇదిలా ఉండగా మరో రభస మొదలైంది. సుబ్బరామయ్య పునాదులు తవ్విపోస్తున్న మట్టి, ఇళ్ళముందే కాక, ఆ ఇరుకుసందు రోడ్డు కూడా సగం పైగా ఆక్రమించింది. అటుపోయి ఇటువచ్చే రిక్షాలకు కూడా చోటులేకపోయింది, ఇక ఇతర బండిలు, లారీల మాటేమిటి? 'నువ్వు జరుగంటే.. నువ్వు' అంటూ ఆ రోడ్డంతా బళ్ళు ఆగిపోయి బూతులు, అరుపులతో ఒక రణరంగంలా మారిపోయింది.

మరో రోజు ఆఫీసులో పనిచేసుకుంటూంటే "నీ కొడుకు రాళ్ళ గుట్టమీద జారిపడి ఒళ్ళంతా హూనం చేసుకున్నాడు" అంటూ వచ్చాడు హరినారాయణ. పని ఆపేసి ఆఫీసుకు సెలవు పెట్టి ఇంటికి వెళితే, ఇల్లు తాళం వేసి ఉంది. సైకిలు మీద ఆసుపత్రికెడితే అప్పుడే బయటకొస్తోంది శ్రీమతి ఏడుపు ముఖంతో నానిగాడిని ఎత్తుకుని! కనబడుతూనే ఉంది, విరిగిన కాలు ప్లాస్టరుతో!! వాడు చేతుల్లో వాలిపోయాడు మత్తు వల్ల. రిక్షాలో వాణ్ణి కదలకుండా పట్టుకుని సుశీలతో ఇంటికి బయల్దేరాం. ఏమైందన్న ప్రశ్నకు ఆవిడ దగ్గరనుంచి సమాధానం లేదు. చూడ్డానికి వచ్చిన చుట్టుపక్కల వాళ్ళవల్ల తెలిసిందేమంటే, ఇల్లు కట్టడానికి సుబ్బరామయ్య రాళ్లు తోలుకున్నాడని, ఆ గుట్ట మీద గంతులేసి పిల్లలు ఆడుకున్నారని, ఆ ఆటల్లో నానిగాడికి దెబ్బ తగిలిందని. అందులో సుబ్బరామయ్య తప్పేమీ కనబడలేదు. అందరూ తలా విధంగా తిడుతున్నారు ఆయన్ని.

అప్పుడే వచ్చాడాయన "అమ్మాయ్ సుశీలా" అంటూ. సుశీల మాట్లాడలేదు. కట్లతో పడున్న నానీని చూశాడు. ప్రమాదం పసికట్టినవాడిలా గుటకలు మింగుతూ వెనక్కు తగ్గి, నెమ్మదిగా వీధిలోకి జారుకున్నాడు. జరిగిన సంఘటనకూ, ఆయనకూ సంబంధమేమీ లేకపోయినా, జాలి కలగలేదు. పైపెచ్చు సంతోషమేసింది – రేపటినుంచి ఆయనపై కాఫీ ఖర్చు తగ్గిపోయిందని.

అదీ కథ.

ఈ కథ దిగువ మధ్యతరగతి కుటుంబీకులకీ డబ్బు, దస్కం ఉన్న ధనవంతులకీ మధ్య సంఘర్షణకు అద్దం పడుతుంది. ఒక ప్రక్క ఆ డబ్బుకన్న వాళ్ళంటే ఆరాధన, ఇంకోపక్క వాళ్ళు చేసే పనులవల్ల మనకు హాని కలుగుతున్నా ఏమీ చేయలేని అశక్తత కథలో స్పష్టంగా కనబడుతుంది. కేవీఆర్‌గారు తొలి కథకు తీసుకున్న ఇతివృత్తం ఆయన ప్రవృత్తిలో ఒక భాగం.

తలనొప్పి తనదాకా వస్తేకాని తెలీదన్నట్లుగా, సుశీల తన కొడుకు కాలు విరిగితే కాని ఆ కొత్తిల్లు కట్టడంలో తమకు, తమ చుట్టుపక్కలవారికి కలిగే నష్టాలు తెలియలేదు. అంతవరకు, సుబ్బరామయ్యనే సమర్థించింది. అది మనిషిలోని బలహీనత. తనకు, తన కుటుంబానికి నష్టం జరిగితే అందరిలాగా తానూ బయటకు అనగలదా? రోజూ రెండు పూటలా కాఫీ ఇవ్వడంలో ఖర్చు తగ్గుతుందని చెప్పినా, ఆ మనిషిని రోజూ తనకు చూసే అవసరం రాకపోవడం, తన భార్యకు కనువిప్పు కలగడం కథలో చెప్పకుండా చెప్పినట్లు.

కథలో సులభశైలి వల్ల సగటు చదువరి ఆపకుండా చదువుకుపోగలడు. చిన్న చిన్న సంఘటనలు వివరించిన విధానం కళ్ళకు కట్టినట్లున్నాయి. మానవ సంబంధాలు కథకు ఆయువుపట్టు. అది భార్యాభర్తల మధ్యనైతేనేమీ, చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళతోనైతేనేమి, దిగువ మధ్యతరగతి జనాల కష్టాలు, ఆలోచనలు అతి సహజంగా చూపించారు రమణారెడ్డి గారు.

కథలో దొర్లిన కొన్ని మాటలు:


నిరాశ పడిన పక్కింటి పిన్నిగారిని గురించి చెప్తూ, "ఆమెను ఆ స్థితిలో చూసి, మహా విష్ణువు తన మొర ఆలకించకపోతే గజేంద్రుని ముఖం ఎలా వుండి వుండేదో తెలుసుకోవచ్చు." మంచి ఉపమానం.

"ఆడవాళ్ళ నోటికీ, కంటికీ అవినాభావ సంబంధం వుంది. నోటినుంచి బయటకు వచ్చే అవకాశం కల్పించకపోతే అవి నీరుగా మారి కంటినుండి బయటకు వస్తాయి." — ఇలాంటి అభిప్రాయాలకు బహుశా ఈ రోజుల్లో స్త్రీవాదులు అభ్యంతరం తెలుపుతారేమో. రమణారెడ్డి గారు 1998లో ఈ ప్రపంచం విడిచిపెట్టి వెళ్ళడంవల్ల ఆ అభ్యంతరాలు వినలేరు.

ఆయన తను అనుభవించిన, చూసిన ప్రపంచాన్ని మనకు ఈ కథ ద్వారా అందించారు.

*పరిచయకర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్*

# కథాపుస్తక పరిచయం




## మీ పేరేమిటి?

‘వసివాడని సాహిత్యం.. మీ పేరేమిటి? – గురజాడ ఇతర కథానికలు’ పేరుతో గురజాడ ఫౌండేషన్ (అమెరికా) వారు డిసెంబర్ 2024 లో విడుదల చేశారు. గురజాడ వారి కథలతో పాటు ఇతర వ్యాసాలు కూడా పొందుపరిచి అందించిన వీటి

ప్రతుల కోసం


శ్రీ విక్రమ్ ప్రకాశ్,
✆ 9740994008 / 897109160

## వేకువ

వేకువఝామున చేసే వాహ్యాళిలో ఉదయించే ఆలోచనలకు ప్రతిరూపాల కథల సమాహారం ఈ ‘వేకువ’.. మన చుట్టూ ఉన్న సమాజంలో కనిపించే పాతిక కథలు – పాతిక కోణాలు. ఈ కథల రచయిత్రి వృత్తి వైద్యం, ప్రవృత్తి రచనలు. మార్చి 2024 లో విడుదలయిన ఈ కథా సంపుటి వెల రు.250/-.

ప్రతుల కోసం

చరవాణి – 9440615206
మెయిల్ : bharathikanthi65@gmail.com








# దర్పణం


శింగరాజు శ్రీనివాసరావు

✆ 9052048706


**రచయిత పరిచయం**

*భారతీయ స్టేట్ బ్యాంకులో మేనేజరుగా 2016 సంవత్సరంలో పదవీవిరమణ అనంతరం సాహిత్యం మీద అభిలాషతో కవితలు, కథలు వ్రాయడం మొదలుపెట్టారు. శ్రీనివాసరావు గారి కథలు, కవితలు.. ఆంధ్రభూమి, స్వాతి, రమ్యభారతి, సాహితీకిరణం, విశాఖ సంస్కృతి, హాస్యానందం, ఉషా మొదలు పత్రికలోనూ, కథామంజరి, గో తెలుగు, నెచ్చెలి, సహరి, షార్వాణి, సుమతి వంటి మరికొన్ని అంతర్జాల పత్రికలలోను ప్రచురితమయ్యాయి. అందులో 70 పైగా కథలు, 50కి పైగా కవితలు బహుమతులను పొందినవే!*

> ***అమ్మంటే నిన్ను చిన్నతనంలో బొమ్మలతో ఆడించిందని ఆమెను ఆటబొమ్మ అనుకోకురా! ఆమెకు మనసనేది ఒకటి ఉంటుంది. అది దర్పణం వంటిది. అది పగలకుండా చూసుకోవాలి. ఒక్కసారి పగిలితే అది అతకదురా... వెళ్ళిరా!"***

వందేభారత్‌లో చెన్నై నుంచి బయలుదేరి ఒంగోలుకు వెళుతున్నాను. నా ఆలోచనలు వారం క్రితం జరిగిన సంఘటన మీదకు మళ్ళాయి. ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని ప్రవచనాలు విన్నా, ఎన్ని క్షేత్రాలు తిరిగినా రానటువంటి మార్పు, ఒక్క బలమైన సంఘటనతో వస్తుంది అన్నది నాపట్ల నిజమయింది! అందుకేనేమో పెద్దలు చెబుతుంటారు. "పుస్తకాలు చదివితే జ్ఞానం వస్తుంది, అదే మనుషులను చదువగలిగితే లోకజ్ఞానం వస్తుంది" అని! ఆ సంఘటన తరువాత ఆ మాట నిజమని అనిపించింది.

ఉద్యోగరీత్యా గుంటూరు శాఖలో మేనేజరుగా పనిచేస్తున్న నేను అత్యవసరంగా, చెన్నైకి బదిలీ చేయించుకోవలసి వచ్చింది. అదీ నా కూతురు బలవంతం మీద! 'పొరుగింటి పుల్లకూర రుచి' అంటారు కదా... అలా... మా అమ్మాయి స్నిగ్ధకు ఆంధ్రలో కంటే చెన్నైలో ఇంజనీరింగు చేయాలని మక్కువ ఎక్కువ. మంకుపట్టు పట్టి యస్.ఆర్.యం.లో ఇంజనీరింగు సీటు సంపాదించి నాకు అగ్నిపరీక్ష పెట్టింది. ఏదో కోరుకున్నది కదా... దాని ఇష్టప్రకారమే చదివిద్దామని నిర్ణయించుకున్నాను. అంతవరకు బాగానే ఉంది. సీటు దొరికిన తరువాతే అసలు చిక్కు వచ్చిపడింది. స్నిగ్ధను హాస్టలులో ఉండమంటే 'ససేమిరా' కుదరదని చెప్పింది. ఒక ప్రక్క కూతురు, మరొక ప్రక్క భార్య స్రవంతి చెరొక ప్రక్కచేరి జోరీగల్లా పోరడంతో నేను చెన్నైకి బదిలీ చేయించుకోక తప్పలేదు. భాష సమస్య కారణంగా నన్ను శాఖలకు వెయ్యకుండా లోకల్ హెడ్ ఆఫీసులోనే పోస్టింగు ఇచ్చారు. ఎట్టకేలకు స్నిగ్ధ కోరిక తీరి, యస్.ఆర్.యం.లో చేరింది. నాకు కూడ బ్రాంచి మేనేజరుగా బాధ్యత వదిలినందుకు, టార్గెట్ల టెన్షను తప్పినందుకు చాలా సంతోషంగా ఉంది. తిన్నగా అక్కడి భాషకు, వాతావరణానికి అలవాటు పడిపోయాను. నాకు ప్రావిడెంట్ ఫండ్ సెక్షనులో అసిస్టెంట్ జనరల్ మేనేజరు దగ్గర డెస్క్ ఆఫీసరుగా పోస్టింగు ఇచ్చారు. కాలేజికి

దగ్గరలో ఉన్న గుడవంచేరులో ఇల్లు తీసుకున్నాను. అక్కడినుంచి నుంగంబాకంలోని మా ఆఫీసుకు దూరం ఎక్కువైనా, స్నిగ్ధ కోసం అక్కడే ఇల్లు తీసుకున్నాను. నా దగ్గర పనిచేసే అసిస్టెంట్లు తమిళులైనా నాతో బాగానే కలిసిపోయారు. నాకు తమిళం రాదు కానీ, వాళ్ళకు తెలుగు వచ్చు! అది నాకు కాస్త అనుకూలించిన విషయం.

★★★




"సార్.. ఈ రోజు సాయంత్రం నాకు ఒక గంట పర్మిషను కావాలి" అడిగాడు సంతోష్.

"దేనికి" అని అడిగాను.

"మా నాన్నను ఆసుపత్రికి తీసుకువెళ్ళాలి సర్. డాక్టరుగారు అపాయింటుమెంటు ఆరు గంటలకు ఇచ్చారు"

"మొన్న కూడ పర్మిషను అడిగావు కదా"

"అప్పుడు మా అమ్మకు బాగాలేక అడిగాను సర్"

"ఏమిటయ్యా ఇది! ఒకరోజు అమ్మకంటావు, ఒకరోజు నాన్నకంటావు. ఇదేం బాగోలేదు"

"అందుకే నేను నిన్న మిమ్మల్ని సెలవు అడిగాను. పని ఎక్కువగా ఉంది. తప్పక రమ్మన్నారు. ఇప్పుడు పనంతా అయిపోయింది. ఒక్క గంట పర్మిషను ఇవ్వండి సార్ చాలు"

"ఒక పనిచెయ్యి... మీ నాన్నను తీసుకుని మీ ఆవిడను ఆసుపత్రికి వెళ్ళమను. నువ్వు అయిదుకు బయలుదేరి నేరుగా ఆసుపత్రికి వెళ్ళు"

"లేదు సర్... మా నాన్నను నేనే తీసుకు వెళ్ళాలి. అది నా బాధ్యత. ఈ ఒక్కసారికి పర్మిషను ఇవ్వండి. ఈసారి అవసరమైతే పర్మిషను అడగను సార్... సెలవు పెడతాను!"

"ఏం బెదిరిస్తున్నావా?" స్వరం పెంచాను.

"బెదిరించడమేమిటి సర్... నేనేం చేస్తానో చెప్పాను. నా తల్లిదండ్రుల బాధ్యత నాదే సర్. వాళ్ళ కంటే నాకు ప్రమోషను ఎక్కువ కాదు, సెలవులు ఎక్కువ కాదు!" సంతోష్ మాటల్లో దృఢనిశ్చయం.

అతని మాటలు నాకు ఎక్కడో ముల్లులా గుచ్చుకున్నాయి. ఇక ఏంచెప్పినా లాభంలేదని అతడిని వెళ్ళమన్నాను. అసలు సంతోష్ వాళ్ళ తల్లిదండ్రులు అతనితోనే ఉన్నారా... లేక వాళ్ళ పేరు చెప్పి కావాలని పర్మిషను తీసుకుని ఇంకెక్కడికైనా పోతున్నాడా అనే అనుమానం వచ్చి విల్సన్‌ను పిలిచాను.

"విల్సన్... సంతోష్ వాళ్ళ అమ్మ, నాన్న ఇతని దగ్గరే ఉంటారా?"

"అవును సార్! ఇక్కడ తల్లిదండ్రులు పిల్లల దగ్గరే ఉంటారు సర్. మా అమ్మ, నాన్న కూడ నా దగ్గరే ఉంటారు!"

"మరి మీకు బదిలీలు వస్తే..."

"మాతోపాటే వాళ్ళూ వస్తారు సర్. ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాళ్ళను మేము ఆశ్రమాలలో చేర్చము సర్. వాళ్ళను మా బాధ్యతగా అనుకుంటాము!"

"చాలా మంచివాళ్ళయ్యా మీరంతా" అని అతణ్ణి వెళ్ళమని చెప్పి ఆలోచనలో పడిపోయాను.

వాళ్ళ మాటలు విన్న తరువాత నేను తప్పు చేస్తున్నానేమో అనిపించింది. గుంటూరులో ఉన్నపుడు నాకు నేను చేసిన పని తప్పుగా అనిపించలేదు. ఎందుకంటే అక్కడ నాలాంటి వాళ్ళు చాలా మంది ఉన్నారు. కానీ ఇక్కడికి వచ్చాక నా అంతరాత్మ నేను చేసినది తప్పని ఎత్తి చూపసాగింది. ఇప్పుడు నాలో అంతర్మథనం!

★★★

“ఇవిగోండి టెస్టు రిపోర్టులు” మా ఆవిడ స్రవంతి రిపోర్టులు తెచ్చి కౌంటరులో ఇచ్చాను.

“మీరు అక్కడ కూర్చోండి పిలుస్తాను” అని వచ్చీరాని తెలుగులో చెప్పింది కౌంటరు క్లర్క్.

అక్కడున్న కుర్చీలలో కూర్చుని, ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. ఇంతలో కాస్త పరిచయమైన గొంతు తమిళంలో మాట్లాడుతూ వినిపించింది. తల తిప్పి చూసి ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. ఆయన మా జనరల్ మేనేజర్ అశోకన్ గారు! ఆయన ఒక వృద్ధురాలిని తన చేతుల మీద మోసుకుంటూ తెచ్చి, కుర్చీలో

కూర్చోబెట్టారు. ఒక్క ఉదుటున లేచి ఆయన దగ్గరకు వెళ్ళి నమస్కారం చేశాను.

“నమస్తే సర్”

“హాయ్ శ్రీనివాస్... వాట్ ఎ సర్ప్రైజ్! ఏమిటిలా వచ్చారు?” అడిగాడు ఆయన. ఆయనకు తెలుగు కూడ బాగా వచ్చు. ఆయన చీఫ్ మేనేజరుగా అయిదు సంవత్సరాలు ఆంధ్రలో పనిచేశాడు.

“మా శ్రీమతికి ఈ మధ్యనే షుగర్ కనిపించింది సార్! ఇక్కడి ఎండోక్రైనాలజిస్టుకు చూపిద్దామని వచ్చాను. మరి మీరు...”

“మా అమ్మకు వంట్లో నరాలు బాగా బలహీనమై పోయాయి. మేము కూడా ఇక్కడి న్యూరాలజిస్టు దగ్గరే ట్రీట్మెంట్ తీసుకుంటున్నాము. ఈరోజు చెకప్ కోసం వచ్చాము.”

“మాకెవరికైనా చెప్పొచ్చు కదా సర్... మేము ఎవరో ఒకరము మీకు సహాయానికి వచ్చేవాళ్ళము కదా!”

“ఇది బ్యాంకు పని కాదు శ్రీనివాస్... నా స్వంత పని! అందునా నా తల్లికి సంబంధించినది. దాన్ని ఎవరికీ అప్పగించను!”

“అది కాదు సర్... అమ్మను మీరు చేతుల మీద మోసుకుని వచ్చారు. వీల్‌ఛైర్ సహాయం తీసుకున్నా బాగుండేది!” ఏమనుకుంటాడోనని భయపడుతూనే అడిగాను.

దానికి ఆయన చిరునవ్వుతో “శ్రీనివాస్... అది నాకు సంతోషాన్ని కలిగించే విషయం. నేను మోసుకొచ్చింది అమ్మనే కదా! ఆమెను మోసుకురావటంలో నాకు కలిగే తృప్తి అనిర్వచనీయం! మనం పసిపాపలుగా ఉన్నపుడు, అమ్మ మనలను మోస్తుందే తప్ప, ఏ వాహనాన్ని వాడదు. అందులో ఆమె ఆనందాన్ని, తృప్తిని పొందుతుంది. అలాగే మనం కూడ వాళ్ళకు సేవ చేయడంలో ఆనందాన్ని వెతుక్కోవాలి!” అనర్గళంగా చెప్పుకుపోతున్నాడు ఆయన!

నేను మధ్యలో కల్పించుకుని, “అవును సర్.. తల్లిని, భార్యను సమానంగా చూడాలి. ఇద్దరూ మనకోసం వారి జీవితాన్నే త్యాగం చేస్తారు!” అన్నాను ఆయన మాటకు వత్తాసుగా!

“నిజమే కానీ, ఒక చిన్న భేదం ఉంది. భార్య ఎంత త్యాగమూర్తయినా, భర్త సంపాదించి తెచ్చే డబ్బు కోసం ఎదురుచూస్తుంది. కానీ తల్లి మాత్రం బిడ్డ ఎదురుగా ఉంటే చాలనుకుంటుంది. అందుకే నేను ఎప్పుడూ మా అమ్మకు ఎదురుగా ఉండాలనే కోరుకుంటాను!” అని ఏదో చెప్పబోయేటంతలో కౌంటరులో... అమ్మాయి ఆయన్ను పిలవడంతో... “ఓకే శ్రీనివాస్... రేపు కలుద్దాం!” అని వాళ్ళమ్మ భుజం చుట్టూ చేయి వేసి, మెల్లగా నడిపించుకుంటూ పోయాడు.

ఈ సంభాషణ అంతా వింటున్న స్రవంతి, "ఆమెకు ఎనభై సంవత్సరాలు పైనే ఉంటాయేమో... ఆయన ఆమెను ఎంత ఓపికగా తీసుకు వచ్చాడో... సో గ్రేట్!" అన్నది.

నా మెదడు.. ఆమె మాటలు వినే స్థాయిలో లేదు. తండ్రి మరణించినా తల్లిని నా వెంట తెచ్చుకోక, 'ఈ వయసులో నువ్వు మా వెంట తిరగలేవమ్మా... ఇక్కడే ఉండు' అని మా సొంత పల్లెలోనే అమ్మను వదిలేసి వచ్చిన సంఘటన గుర్తుకు వచ్చింది. ఆమెను అలా వదిలేసిన తరువాత, కొన్నాళ్ళు నెలకు ఒకసారి వెళ్ళి వచ్చేవాడిని. తరువాత మూడు నెలలకు ఒకసారి, ఇప్పుడు అమ్మ దగ్గరికి పోయి వచ్చి సంవత్సరమయింది. ఇప్పటిదాకా నేను ఆమెను పల్లెలో ఉంచి మంచి పని చేశాననే అనుకున్నాను. కానీ మా జనరల్ మేనేజరు మాటలు విన్న తరువాత ఏదో తప్పు చేశాననే భావన నాలో కలిగింది. ఆయన అన్న మాట నా చెవిలో మారుమ్రోగుతున్నది. 'తల్లి మాత్రం బిడ్డ ఎప్పుడు ఎదురుగా ఉండాలనే కోరుకుంటుంది!' అవును... చిన్నప్పుడు కూడ నేను స్కూలు నుంచి వచ్చేసరికి, నాకోసం వాకిట్లో నిలుచుని ఎదురుచూసేది. నేను ఎదిగి, సంపాదనకు వచ్చిన తరువాత కూడ నన్ను ఏనాడూ ఒక్క పైసా అడగలేదు. ఇప్పుడు కూడ పొలం మీద వచ్చిన కౌలుతో బ్రతుకుతున్నదే కానీ, నామీద ఎప్పుడూ ఆధారపడలేదు. అటువంటి దేవతను నిర్దాక్షిణ్యంగా వదిలేసి వచ్చాను.

నా ఆలోచనలను ఆటంకపరుస్తూ కౌంటరులో అమ్మాయి మమ్మల్ని పిలిచింది. డాక్టరును కలిసి మందులు తీసుకుని ఇంటికి బయలుదేరాము. ఎంత ప్రయత్నించినా మా జనరల్ మేనేజరుగారు, ఆయన తల్లిని మోసుకుని ఆసుపత్రిలోకి వచ్చిన దృశ్యాన్ని మరచిపోలేక పోతున్నాను. చేస్తున్న పనులన్నీ యాంత్రికంగానే జరిగిపోతున్నాయి.

★★★

ప్రక్కనున్న వ్యక్తి "సార్... ఏమిటి ఇంకా ఆలోచిస్తున్నారు? మన ఒంగోలు వచ్చింది" అనడంతో గబగబా సూట్‌కేసు తీసుకుని అతనితో పాటే దిగాను. వారం రోజుల తర్జనభర్జనల తరువాత, మా అమ్మను తీసుకురావడానికి స్రవంతిని ఒప్పించి మా పల్లెకు బయలుదేరాను. నేను వస్తున్న విషయం మా అమ్మకు చెప్పలేదు. బస్టాండుకు వచ్చి కారుమంచి బస్సు ఎక్కాను. అరగంట తరువాత సరిగ్గా ఇంటి ముందు బస్సు దిగి ఇంట్లోకి వెళ్ళాను. వాణి పిన్ని ఎదురొచ్చింది.

"పిన్నీ... అమ్మెక్కడ?" సూట్‌కేసు పక్కనబెట్టి అడిగాను.

"అదిగోరా... ఆ గదిలో వుంది" అని పడకగది చూపించింది.

అమ్మను చూసి సంతోషకరమైన ఈ విషయం చెప్పాలని పరుగున వెళ్ళాను. అక్కడ మంచంలో అమ్మ. దగ్గరకు వెళ్ళి "అమ్మా!" అని ఆమె చేతిని చేతిలోకి తీసుకున్నాను. కానీ చేతిలో బలం కనిపించలేదు.

"ఏమయిందమ్మా?" అన్నాను ఒళ్ళంతా నిమురుతూ!

"ఏదయితే రాకూడదని ఇన్నాళ్ళూ తపన పడ్డానో... అదే వచ్చిందిరా!" ఆమె మాటలలో స్పష్టత లేదు.

"నెలరోజుల క్రితం అక్కకు పక్షవాతం వచ్చింది. నీకు ఫోనుచేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. నువ్వు చెన్నై వెళ్ళాక ఫోను నెంబరు మార్చావేమో అనుకున్నాము. అక్కను ఆసుపత్రిలో చేరిస్తే, ఈ వయసులో కోలుకోవడం కష్టం అన్నారు. ఏవో మందులు రాసిచ్చారు. ఇక అక్క మంచానికే పరిమితంరా" వచ్చి చెప్పింది పిన్ని.

నేను చెన్నై వెళ్ళాక బ్యాంకు ఫోను మాత్రమే వాడేవాణ్ణి.

నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. అమ్మను ఇలా చూస్తానని కలలో కూడ అనుకోలేదు.

"పిన్నీ... అమ్మను నాతోపాటే తీసుకువెళతాను"

"నేను రానురా" అనుకోకుండా పడిన పిడుగులా వేగంగా వచ్చింది అమ్మ నోటి నుంచి ఆమాట.

"శీను... నేను ఎక్కడికీ రానురా. ఈ స్థితిలో వచ్చి నీకు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టలేను. బాగున్నప్పుడే నన్ను వద్దనుకున్న మీరు, ఈ స్థితిలో నన్ను తీసుకుపోయి ఏం చూస్తారురా! ఇప్పుడు మీ ఆదరణ కాదురా కావలసింది, మనసుకు ప్రశాంతత! అది ఇక్కడ, 'నా' అనుకుని ఇన్నిరోజులు నేను గడిపిన పల్లె తోబుట్టువుల మధ్య మాత్రమే దొరుకుతుంది. అందుకే పోయే కట్టెను తీసుకుపోయి కష్టపెట్టకుండా ఇక్కడ వదిలేసి పుణ్యం కట్టుకోరా!" అన్నది అమ్మ.

ఆమె మాటలు బాకులై గుండెను కోశాయి. అవును... అక్కున చేర్చుకోవలసిన రోజున వదిలేసి, ఇప్పుడు వచ్చి 'అమ్మా' అని కన్నీళ్ళు కారిస్తే, అవి మొసలి కన్నీరుగానే గుర్తించబడతాయి. ఏం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు.

"శీనూ... నువ్వు మంచిమనసు చేసుకుని అమ్మను తీసుకుని వెళ్ళాలని వచ్చావేమో, కానీ ఎదురుచూసినంతసేపూ నీ జాడ కనపడలేదురా. ఇప్పుడు ఆమె మనసు బండబారి పోయింది. ఇది ఆమెను కదిలించి కష్టపెట్టే పరిస్థితి కాదు. తోడబుట్టిన దాన్ని నేను ఉన్నాను కదా! చూసుకుంటాలే... వెళ్ళు! అమ్మంటే నిన్ను చిన్నతనంలో బొమ్మలతో ఆడించిందని ఆమెను ఆటబొమ్మ అనుకోకురా! ఆమెకూ మనసనేది ఒకటి ఉంటుంది. అది దర్పణం వంటిది. అది పగలకుండా చూసుకోవాలి. ఒక్కసారి పగిలితే అది అతకదురా... వెళ్ళిరా!" అని సుతిమెత్తగా చెప్పి, నన్ను వెళ్ళమనకుండా వెళ్ళిపోయేలా మాట్లాడింది, పిన్ని.

ఇక చేసేది లేక, అమ్మ కాళ్ళకు నమస్కరించి తిరుగుముఖం పట్టాను. వారి మాటలకు నాకు ఆవేశం గాని, బాధ గాని కలుగలేదు. ఎందుకంటే కృతఘ్నుడికి ఇంతకన్నా గొప్ప మర్యాద ఎందుకు దొరుకుతుంది!



# తొలిసంధ్య వేళలో...!

ప్రోత్సాహక
బహుమతి
పొందిన కథ

జాస్తి రమాదేవి
✆ 9391555364

**రచయిత్రి పరిచయం**

*వృత్తి – హౌస్‌వైఫ్. చదువు – బి.ఎ. తల్లిదండ్రులు – ముసునూరి రామారావు, రత్నాంబ గార్లు. జన్మస్థలం – ములకల్లంక, తూర్పు గోదావరి జిల్లా. శ్రీవారు – జాస్తి వెంకట నర్సుబాబు. ఇద్దరు పిల్లలు.*

*బి.ఎ. చదివి, గృహిణిగా ఉన్న రమాదేవి గారు ఇప్పటి వరకూ రచించిన నూట యాభై ఐదు కథలు, నాలుగు నాటికలు, కొన్ని కవితలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. యాభై కథలకు బహుమతులు వచ్చాయి. ఈ మధ్యనే రాసిన ఒక నవలకు కూడా బహుమతి వచ్చింది. మంచి సాహిత్యం చదవడం ఇష్టం. రాయడం ఇంకా ఇష్టం!*

***‘ఏం కావాలి? ఏం చదువుతావు? పంపిన డబ్బులు సరిపోతున్నాయా? హాస్టల్లో భోజనం సరిపడుతోందా? ఈ బట్టలు నీకు నచ్చాయా? ఈ బైక్ నీకు నచ్చిందా? ఈ అమ్మాయి నీకు నచ్చిందా?’ అన్నీ వాడినడిగే చేసాడు తను! ఇప్పుడు తననేం అడక్కుండానే కొడుకు ఓ నిర్ణయం తీసేసుకున్నాడు.***

సుమతి పూజ ముగించుకుని వచ్చింది. మనవడు నిద్ర లేచినట్టున్నాడు.

“లేచావా కన్నా! వెళ్ళి బ్రెష్ చేసుకుని రా! పాలు కలుపుతాను.” అంది.

‘హాలిడేస్’ అని రామకృష్ణ, మద్రాసు వెళ్ళి మనవడిని తీసుకొచ్చాడు రాత్రి.

“నానీ! మన ఇంటి దగ్గర చాలా బర్డ్స్ లేవగానే విష్ చేసేవి కదా!”

“ఏవండీ! మిమ్మల్నే... పృథ్వీ ఏదో అడుగుతున్నాడు!” అంటూ భర్తని పిలిచింది సుమతి.

“అప్పుడే డౌట్స్ మొదలు పెట్టాడా?” నవ్వుతూ అడిగాడు రామకృష్ణ.

పృథ్వీ మంచం దిగి బైటికొచ్చాడు. వాడి వయస్సు ఎనిమిదేళ్ళు.

“తాతయ్యా! ఇక్కడ ఉండే మామిడి చెట్టు లేదు... బర్డ్స్ కూడా లేవు!” అడిగాడు పృథ్వీ.

అక్కడ ఉండాల్సిన పెద్ద మామిడిచెట్టు స్థానంలో శూన్యం తచ్చాడుతోంది.

“చెట్టు బాగా ఆకులు రాల్చుతోందిరా! కాయడం లేదని తీసేసేం! చెట్టు లేదు కదాని, పక్షులు మరో చోటుకు వలస

వెళ్ళిపోయాయి!" చెప్పాడు రామకృష్ణ. పృథ్వి మౌనంగా ఉండిపోయాడు.

"సాయంత్రం జూపార్క్‌కి వెళ్దాం... అక్కడ బోలెడు బర్డ్స్ చూడొచ్చు!" అంటూ మనవడి తల నిమిరాడు.

రామకృష్ణ గవర్నమెంట్ ఉద్యోగిగా రిటైర్ అయ్యాడు. సొంత ఇల్లు తప్ప పెద్దగా ఆస్తులు లేవు. కొడుకును, కూతుర్ని ఇంజనీరింగ్ చదివించేడు. పెళ్ళిళ్ళు చేసాడు. అల్లుడు కంపెనీ తరపున యు.కె. వెళ్ళడంతో, లండన్లో సెటిలైపోయారు. కొడుక్కి చెన్నయ్‌లో ఉద్యోగం! కూతురికి ఇద్దరు కూతుళ్ళు, కొడుక్కి ఓ కొడుకు! కొన్నాళ్ళు పిల్లల్ని తీసుకొని కొడుకు, కూతురు వచ్చేవాళ్ళు. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారని, కూతురుకి కుదిరితేనే వస్తుంటుంది. కొడుకు, కోడలు సాఫ్ట్‌వేర్ జాబుల్లో బిజీ అంటూ రావడం తగ్గించేసేరు. మనవణ్ణి చూడాలని పెద్దవాళ్ళే వెళ్ళొస్తుంటారు.



కొడుకు, కోడలూ ఆఫీసులకి, మనవడు స్కూలుకు వెళ్ళిపోతే అపార్ట్‌మెంట్ గోడల మధ్య ఊపిరి ఆడనట్టుండేది. తిరిగొచ్చాక ఇంటిని చూడగానే పెన్నిధి దొరికినంత సంతోషంగా ఉండేది. ఏదో స్వేచ్ఛ మనసుకు హాయినిచ్చేది. మోకాలిలోతున పడున్న ఎండుటాకులు చూసి నవ్వుకుంటూ, 'మనం లేమని పాపం చూడు చెట్టు ఎన్ని కన్నీళ్ళని రాల్చిందో' అనేవాడు.

కొడుకు చిన్నప్పుడు ఆ మామిడిచెట్టుని నాటాడు రామకృష్ణ. నాలుగేళ్ళకి మొదటి కాపు పాతిక కాయలనిచ్చింది. ప్రయోజకుడైన కొడుకు మొదటి సంపాదన తమ చేతికి ఇచ్చినంత సంతోషం కలిగింది. ఆ చెట్టు పక్కన కొడుకు విశ్వంని నిలబెట్టి, ఫోటో తీసి ఫ్రేమ్ కట్టించాడు. దాన్ని హాల్లో పెట్టి, వచ్చిన ప్రతివాళ్ళకీ గొప్పగా చెప్పుకోడం అలవాటుగా మారిపోయింది.

పండుగలు వచ్చినా, శుభకార్యాలు చేస్తున్నా మామిడి ఆకులు కోసం వచ్చేవారు. బస్తాలు బస్తాలు ఆకులు కోసినా, కొమ్మలు విరిచినా కించిత్ విచారం లేనట్టు ఠీవిగా నిలబడుండేది. చెట్టుమీద పక్షులు గూళ్ళు కట్టుకునేవి. గుడ్లు పెట్టి పొదిగేవి. పిల్లలు బైటకు వచ్చాక, ఒకటే సందడిగా ఉండేది. ఆహారం పట్టుకొచ్చి పిల్ల పక్షులకు పెడుతున్నప్పుడు, తమ పిల్లలు గుర్తొచ్చేవారు. ఎన్నో జ్ఞాపకాలను మనసు ముంగిట్లోకి లాక్కువచ్చేవి.

చెట్టుకు కూడా కాలం రాపిడి తప్పలేదు! కాయడం మానేసింది. తాము మద్రాసులో ఉన్నపుడు, విశ్వం మనుషులతో ఆ చెట్టుని కొట్టించేసాడని తెలిసి చాలా బాధపడ్డాడు! ఇంటికి వచ్చాక చెట్టులేని వెలితి మనసుకు ముల్లులా గుచ్చుకుంది. కొడుకు తీసుకున్న నిర్ణయం మింగుడు పడలేదు. ఆ విషయాన్ని సుమతికి చెప్పలేకపోయాడు.

సాయంత్రం జూపార్కుకి మనవణ్ణి తీసుకెళ్ళాడు రామకృష్ణ. జంతువుల్నీ, పక్షులని చూసి చాలా ఎంజాయ్ చేసాడు పృథ్వి. తిరిగి తిరిగి అలసిపోయి ఇంటికి వచ్చారు. స్నానం చేసి భోజనాలు చేసారు. ఆరుబయట మంచం వేసింది సుమతి.

“తాతయ్యా! ఈ ఇల్లు అమ్మేసి మీరు మా ఇంటికి వచ్చేస్తారంట కదా!” అడిగాడు పృథ్వి.

సుమతి ఉలిక్కిపడింది. “ఎవరన్నారు కన్నా!” కంగారుగా అడిగింది.

“డాడీ చెప్పాడు... ‘ఈసారికే నువ్వు తాతయ్య వాళ్ళూరు వెళ్ళేది’ అని! ఇంక నేను హాలిడేస్‌లో ఏ ఊరుకి వెళ్ళాలి తాతయ్యా?” అడుగుతున్నాడు పృథ్వి. మౌనంగా ఉండిపోయాడు రామకృష్ణ.

పృథ్వీకి సెలవులు ఇవ్వగానే తమ దగ్గరకే వస్తాడు. తాము కూడా మద్రాస్ వెళ్ళిపోతే, తనకంటూ హాలిడేస్ ప్లేస్ ఉండదని పృథ్వి క్వశ్చన్ చేస్తున్నాడు. పృథ్వీని ఎత్తుకుని బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టి వచ్చాడు రామకృష్ణ. సుమతి ఇంకా అయోమయంలోనే ఉన్నట్లుంది... ఆమె చేతిని చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు.

“ఏమిటండీ! ఇల్లు అమ్మడం ఏంటి?” ఆరాటంగా అడిగింది.

“పిచ్చిదానిలా మాట్లాడకు! మన విశ్వం అలా ఎందుకంటాడు?” సాధ్యమైనంత కూల్‌గా అన్నాడు రామకృష్ణ.

“ఏమోనండీ! పృథ్వి అలా అడిగినప్పటి నుంచి, నా మనసు మనసులో లేదు. మనకున్నది ఈ ఇల్లేనండి. ఇక్కడ మన జ్ఞాపకాలు చాలా ఉన్నాయి!” సుమతి గొంతులో బాధ సుడులు తిరిగింది. సుమతిని దగ్గరకు తీసుకుని ఓదార్పుగా భుజం నిమిరాడు.

“అనవసరంగా ఏదేదో ఊహించుకుని బాధ పడకు!”

ఆ రాత్రి ఇద్దరికీ నిద్ర పట్టలేదు.

పృథ్విని తీసుకెళ్ళి దించి, తిరిగి విజయవాడ బయలుదేరాడు రామకృష్ణ. ట్రైన్ దిగి బైటికి వస్తుండగా, రైల్వే స్టేషన్‌లో శివరావు కనబడ్డాడు. 'శివం అంటూ ఆనందంగా కౌగిలించుకున్నాడు.

వాళ్ళిద్దరూ బాల్య స్నేహితులు! చదువులు పూర్తి అయి, ఉద్యోగాలు వచ్చి, పెళ్ళిళ్ళు అయ్యి, పిల్లలు పుట్టినా వాళ్ళ స్నేహం చెక్కు చెదరలేదు. ఇద్దరివీ గవర్నమెంటు ఉద్యోగాలు ఇద్దరివీ మధ్యతరగతి కుటుంబాలు. ఒకేసారి ఇళ్ళు కట్టుకున్నారు. ఇద్దరూ ఒకేసారి రిటైరయ్యారు. అప్పట్నుంచీ శివరావు ఇల్లు అమ్మేసి, తన కొడుకుల దగ్గర ఉంటానని హడావిడి పడుతుంటే, రామకృష్ణ వారించేవాడు.

"అప్పుడే ఏం తొందరొచ్చింది? కొన్నాళ్ళు నువ్వు, చెల్లాయి హేపీగా ఉండొచ్చు కదరా!"

"అసలైన ఆనందం పిల్లలతో కల్సి ఉన్నప్పుడే ఉంటుందిరా! మీ చెల్లాయి కూడా ఎప్పుడెప్పుడు పిల్లల దగ్గరకు వెళ్ళాలని ఆరాటపడుతోంది!" తేలిగ్గా నవ్వేడు శివరావు. అన్నట్లుగానే ఇల్లు అమ్మేసి కొడుకులున్న బెంగుళూరుకు వెళ్ళిపోయారు.

కొన్నాళ్ళు ఇద్దరి మధ్యనా ఫోన్లు, ఉత్తరాలు నడిచాయి. తర్వాత్తర్వాత ఎందుకో శివరావు ఫోనూ చెయ్యలేదు. తను రాసిన ఉత్తరాలకి జవాబూ ఇవ్వలేదు.

"శివం! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి... ఎలా ఉన్నావు? నన్ను పూర్తిగా మర్చిపోయావు కదరా!" అంతలో వాటర్‌బాటిల్‌తో వచ్చింది శివరావు భార్య అనసూయ. రామకృష్ణని చూడగానే అనసూయ కళ్ళలో చెమ్మ పలకరింపుగా బయటకొచ్చింది.

"నిన్ను మర్చిపోవడం ఏంటిరా!" శివరావు బలవంతంగా నవ్వేడు.

"విజయవాడ వచ్చి కూడా మా ఇంటికి రాకుండా వెళ్ళిపోతున్నావు కదరా?" రామకృష్ణ నిష్టూరంగా అన్నాడు. శివరావు తలొంచుకున్నాడు.

"శివం! పిల్లలిద్దరూ నిన్నూ చెల్లాయిని బాగానే చూసుకుంటున్నారా?"

"మీరు చెప్పినప్పుడు వినుంటే బాగుండేది అన్నయ్యా!" అనసూయ కళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఇప్పుడు ఎక్కడికి ప్రయాణం?" అడిగాడు రామకృష్ణ.

"పెద్దోడు తిరుపతిలో ఉంటున్నాడు. ఆరు నెలలు చిన్నోడు, ఆరు నెలలు పెద్దోడు పంచుకున్నారురా నన్ను, వాళ్ళమ్మనీ! ఒక్క రోజు ఎక్కువైనా..." శివరావు గొంతు మూగబోయింది.

అనసూయ సిగ్గుగా తలొంచుకుంది.

పిల్లలు బాగా చదివితే గొప్ప, మంచి ఉద్యోగం చేస్తుంటే గొప్ప, వాళ్ళు జీవితంలో ఎదిగితే గొప్ప, చిన్న గిఫ్ట్ ఇస్తే గొప్ప, ఫోన్ చేసి ఓ మాట మాట్లాడితే గొప్ప... ఇన్ని గొప్పలు చెప్పుకునే తల్లిదండ్రుల అభిప్రాయాలు గొప్పవి కావెందుకు?' మొదటిసారి అనిపించింది రామకృష్ణకి.

"ఇల్లు అమ్మేద్దాం నాన్నా. అమ్మేసి ఇక్కడ అపార్ట్‌మెంటు తీసుకుందాం! మీరు మాతో ఉంటే మాక్కూడా ఆనందంగా ఉంటుంది నాన్నా!" మామిడిచెట్టు గురించి అడిగినప్పుడు కొడుకు అన్న మాటలు గుర్తొచ్చాయి.

'ఏం కావాలి? ఏం చదువుతావు? పంపిన డబ్బులు సరిపోతున్నాయా? హాస్టల్లో భోజనం సరిపడుతోందా? ఈ బట్టలు నీకు నచ్చాయా? ఈ బైక్ నీకు నచ్చిందా? ఈ అమ్మాయి నీకు నచ్చిందా?' అన్నీ వాడినడిగే చేసాడు తను! ఇప్పుడు తననేం అడక్కుండానే కొడుకు ఓ నిర్ణయం తీసేసుకున్నాడు.

ఒక్కో పైసా కూడగట్టుకుని, మూడు గదుల చిన్న ఇల్లు కట్టగలిగాడు. ఆ ఇంటి కోసం తనూ, సుమతీ ఎన్నో త్యాగాలు చెయ్యాల్సి వచ్చింది. ఇల్లు ఇరుగ్గా ఉన్నా, ఎన్నెన్నో జ్ఞాపకాలను మూట గట్టి ప్రతిక్షణం తమకు గుర్తుచేసేది. ట్రైన్ రావడంతో శివరావు, అనసూయ లేచారు. "మీరు విజయవాడలో ఉన్నప్పుడు మా ఇంటికి తప్పకుండా రావాలి శివం" కౌగిలించుకుని వదిలాడు రామకృష్ణ. శివరావు నవ్వేడు.

★★★

"తమ్ముడు చెప్పింది బాగానే ఉంది కదా! నీకు అమ్మకి రెస్ట్ దొరుకుతుంది కదా నాన్నా!" కూతురు ఫోన్లో చెబుతోంది.

"ఇప్పుడు మేము హేపీగానే ఉన్నాం తల్లీ! మమ్మల్ని కొన్నాళ్ళు ఇలా ఉండనివ్వండి. మాకింకా వొండుకు తినే ఓపిక ఉంది!" నవ్వుతూ చెప్పాడు.

"నాకైతే తమ్ముడి ప్రపోజల్ నచ్చింది. ఆలోచించొచ్చు కదా!" వినోదిని తనని కన్విన్స్ చేస్తోందని అర్థమయ్యింది రామకృష్ణకి! ఎందుకు తను కన్విన్స్ కావడం లేదో వాళ్ళకి అర్థం కాదు.

అప్పుడప్పుడూ మద్రాసు వెళ్ళినప్పుడు, సుమతి ఎంతగా అలసిపోతుంటుందో తనకి తెలుసు! అర్థరాత్రి లేచి కొబ్బరినూనె అరికాళ్ళకు మర్దనా చేసుకోడం తనకి తెలుసు! పెయిన్‌బామ్ నడుముకు రాసుకోడం తనకు మాత్రమే తెలుసు! పిల్లలకు చేసి పెట్టడం తల్లిదండ్రులకు ఆనందంగానే ఉంటుంది కానీ, తరుముకుంటూ వచ్చే వయసులో ఆనందం కూడా అలసటను మోయలేనంత భారాన్ని ఇస్తుందని సుమతిని చూసినప్పుడే కాదు, అనసూయను చూసినప్పుడు కూడా అర్థమైంది తనకు!

"అమ్మా, నువ్వూ తమ్ముడి దగ్గర ఉంటే మాకూ హేపీగా ఉంటుంది నాన్నా!" అంటోంది వినోదిని.

"నీకూ, తమ్ముడికీ అడుగులు వేయడం నేర్పింది నేనూ, మీ అమ్మా! ఇప్పుడు అడుగులు వేయడం మాకు నేర్పాలనుకోవడం నవ్వొస్తోందమ్మా! ఇప్పుడీ లైఫ్ మాకు బాగుంది. మమ్మల్ని ఒత్తిడి చేయొద్దు ప్లీజ్ !" ఫోన్ ఆఫ్ చేసాడు రామకృష్ణ.

తన పక్కనే నిలబడి ఓ విధమైన అయోమయావస్థలో ఉన్న సుమతిని దగ్గరకు తీసుకున్నాడు.

"రేపు మనం నర్సరీకి వెళ్ళి ఓ మామిడి మొక్కని కొనుక్కురావాలి సుమతీ!" చెప్పాడు రామకృష్ణ.

# ప్రయత్నం


మద్దూరి నరసింహమూర్తి

✆ 9164543253


ప్రోత్సాహక బహుమతి పొందిన కథ



**రచయిత పరిచయం**

*ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న 76 ఏళ్ల నరసింహమూర్తి గారు, పుట్టి పెరిగినది, విద్యాబుద్ధులు గ్రహించినది బరంపురం(ఒరిస్సా)లో! ఈయన వాణిజ్యం మరియు న్యాయశాస్త్రంలో పట్టభద్రుడు. భారతీయ స్టేట్ బ్యాంక్‌లో పనిచేసి, మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు పురాణాలు, ఆధ్యాత్మిక చింతన పట్ల అభిరుచి ఎక్కువ! ఉభయభాషాప్రవీణులైన పెద్ద మేనమామ వలన సాహిత్యం పట్ల, చిన్న మేనమామ వలన సంగీతం పట్ల అభిలాష, ప్రవేశం. కరోనా కాలంలో కాలం గడవక, నవంబర్ 2020 లో ప్రారంభించిన రచనా వ్యావృత్తిలో, ఇప్పటి వరకు 152 కథలు, 43 వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. వీరి తొలి కథ "ముందుగా తెలిస్తే" కథామంజరి జూన్ 2021 సంచికలో ప్రచురింపబడింది.*

> ***"ఈరోజు శుక్రవారం. వచ్చే సోమవారం ఉదయం పదకొండు గంటలకు ఈ న్యాయస్థానం పర్యవేక్షణలో, మా ఎదుట, వాదిని ప్రతివాది ఇంటర్వ్యూ చేయాలి. అంతవరకు వాది కానీ, ప్రతివాది కానీ ఈ ఊరు వదలి బయటకు వెళ్ళడానికి ఎటువంటి అనుమతి లేదు"***

వాది ప్రతివాదులైన లక్ష్మణ్, సర్కారువారి ప్రతినిధులు మరియు సర్కారు వారి వకీలుగార్ల దృష్టి న్యాయమూర్తిగారి మీదనే నిలచి, ఆయన ఏమీ తీర్పు చెప్తారా అని నిశ్శబ్దంగా కూర్చొని ఉన్నారు.

'భారతీయ పరిపాలనా అధికారిగా నియుక్తమయేందుకు సర్కారువారు నిర్వహించే వ్రాత పరీక్షకు' తగిన శిక్షణ దొరికే సదుపాయం తాను ఉండే పట్టణంలో లేకపోవడంతో, హైదరాబాదులో శిక్షణ తీసుకొని ఫైనల్ వ్రాత పరీక్ష సంతృప్తిగా వ్రాసి, ఇంటికి చేరుకున్న లక్ష్మణ్, ఇంటర్వ్యూ కొరకు చదువుకుంటూ ఉన్నాడు. ఆ పరీక్షలో ఉత్తీర్ణుడైన సమాచారం తెలియగానే, ఇంటర్వ్యూ కొరకు హైదరాబాదు మీదుగా దేశరాజధానికి వెళ్లి రావడానికి ట్రైన్ టికెట్ రిజర్వు చేయించుకొని, ఏకాగ్రతతో ఇంటర్వ్యూ కోసం తయారవసాగేడు.

ప్రయాణం రోజున ఉదయం ఏడు గంటలకు తల్లితండ్రులతో కలిసి కాఫీ తాగుతూ తెలుగులో వచ్చే వార్తలలో...

"దేశంలో చాలా చోట్ల అకస్మాత్తుగా సంభవించిన తీవ్రగాలులతో కూడిన అకాలవర్షాల వలన, పలుచోట్ల రోడ్లు, రైల్వే లైన్లు దెబ్బతిని, రాకపోకలకు విపరీతమైన అంతరాయం కలిగింది. రోడ్లు బాగుపడేందుకు నాలుగు రోజులు పట్టవచ్చు అని రోడ్లు, రవాణాశాఖ మంత్రి తెలియచేయగా, రైల్వే లైన్లు సరిచేసేందుకు మూడు రోజులు పట్టవచ్చు అని రైల్వేమంత్రి తెలియచేస్తున్నారు. భారతీయ వాతావరణ శాఖ ఈ హఠాత్తు పరిణామానికి కారణాలు తెలుసుకునేందుకై తీవ్రంగా

శ్రమిస్తున్నారు. ప్రతీ రాష్ట్ర రాజధానిలో మరియు దేశ రాజధానిలో సహాయక శిబిరాలు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసేరు. జనం దూరప్రయాణాలను కనీసం నాలుగైదు రోజుల వరకూ వాయిదా వేసుకోమని ప్రభుత్వం సూచిస్తున్నది!” అని విన్నాడు లక్ష్మణ్.

వెంటనే రైల్వేస్టేషన్లో విచారిస్తే, ఇక్కడికి సుమారు అరవై కిలోమీటర్ల దూరంలో రైల్వే లైన్ కొట్టుకుపోయినందువలన, ఆ రోజు తాను వెళ్ళవలసిన రైలు కాన్సిల్ అయిందనీ, ఏ రైలు ఎప్పుడు బయలుదేరేది రెండు మూడు రోజుల తర్వాత ప్రకటన ద్వారా తెలియచేస్తారని, వాళ్ళు తెలిపారు.



హైదరాబాదు నుంచి ఢిల్లీ వెళ్లే దారిలో చాలా చోట్ల రైల్వేలైన్ కొట్టుకుపోయినందువలన, తాను హైదరాబాదు నుంచి ఢిల్లీకి రిజర్వేషన్ చేసుకున్నరైలే కాక ఆ మార్గంలో వెళ్లే అన్నిరైళ్లు కాన్సిల్ అయ్యాయని, ఆ మార్గంలో రైళ్లు ఎప్పుడు బయలుదేరేదీ రెండు రోజుల్లో తెలియచేయబడుతుంది అని కూడా తెలిసింది.

అక్కడనుంచి బస్టాండులో హైదరాబాదుకి వెళ్లే బస్సుల గురించి విచారిస్తే, ఆ మార్గంలో చాలా చోట్ల రోడ్డు దెబ్బతిన్నందున ఏ బస్సు ఆ మార్గంలో వెళ్ళేది లేదు, ఎప్పుడు ఏ బస్సు వెళ్తుంది అన్నది ప్రస్తుతం చెప్పలేము అని తెలియచేసేరు.

ఆ ఊరికి విమానాశ్రయం లేదు కనుక, ఫ్లైట్ గురించి ఆలోచించే అవసరమే రాలేదు లక్ష్మణ్‌కి.

ఇంటర్వ్యూ కోసం వెళ్ళవలసిన తన ప్రయాణానికి, ఆటంకం రావడంతో విచారంగా ఇంటికి వచ్చిన లక్ష్మణ్‌ని తల్లితండ్రులు ఊరడించి, పరిస్థితి చక్కబడిన తరువాత వెళ్లి అక్కడ ఇంటర్వ్యూ చేసే అధికారులకు పరిస్థితి వివరిస్తే తగిన ఫలితం ఉండవచ్చని ధైర్యం చెప్పేరు. ప్రస్తుతానికి చేసేదేమీ లేక, తన ప్రయత్నలోపం ఉండకూడదనుకున్న లక్ష్మణ్ ఇంటర్వ్యూ కోసం చదువుకోసాగేడు.

అధిక వ్యయప్రయాసలతో, ఐదు రోజులు ఆలస్యంగా ఢిల్లీ చేరుకున్న లక్ష్మణ్‌కి, ఎంతో కష్టపడ్డ తర్వాత, ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులను ముఖాముఖి కలిసే అవకాశం దొరికింది. తాను ఆలస్యంగా చేరుకుందికి కారణాలు వివరించినా, వారు లక్ష్మణ్‌కి మరో అవకాశం ఇచ్చేందుకు నిరాకరించేరు. తాను వ్రాతపూర్వకంగా వారికి పంపిన అర్జీ మీద 'మీరు కోరిన అనుమతి నిరాకరించడమైనది' అని వ్రాసి, స్టాంప్, తేదీ వేసి, సంతకం పెట్టి వాపసు ఇచ్చేసి, "ఇక మీరు వెళ్ళవచ్చు" అని పంపించేసేరు.

నిరాశతో తిరిగివచ్చిన లక్ష్మణ్‌ని తీసుకొని అతని నాన్నగారు తనకు తెలిసిన వకీలు దగ్గరకు తీసుకొని వెళ్ళేరు. ఆయన అంతా విని "ఇది సర్వసామాన్యమే. ఫలితం గురించి ఆలోచించక, న్యాయం కోసం దావా వేసి ప్రయత్నం చేయడం ఉత్తమం!" అని సలహా ఇచ్చేరు.

వకీలుగారి సహాయంతో లక్ష్మణ్ కేంద్రప్రభుత్వానికి పంపిన తాఖీదుకు కేంద్రప్రభుత్వం అధికారులు కనీసం జవాబు కూడా ఇవ్వలేదు.

తాఖీదులో విధించిన గడువు దాటిన పిమ్మట లక్ష్మణ్ న్యాయస్థానంలో దావా వేయడం జరిగింది.

న్యాయస్థానంవారు ఒక అధికారిని నేరుగా ఢిల్లీలోని కేంద్రప్రభుత్వం కార్యాలయానికి పంపి, లక్ష్మణ్ వ్రాత పరీక్షలో వ్రాసిన జవాబు పత్రాన్ని సీల్డ్ కవర్ ద్వారా తెప్పించి, దానిని పరీక్షించి, వాది తగిన ప్రతిభావంతుడే అని గ్రహించి, దావా కొనసాగేందుకు తగిన చర్యలు ప్రారంభిస్తూ న్యాయస్థానానికి రావాలని కేంద్ర ప్రభుత్వానికి తాఖీదు పంపేరు.

న్యాయస్థానంవారు పంపిన తాఖీదుకి సమర్పించవలసిన వ్రాతపూర్వక సమాధానంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు లక్ష్మణ్ కోరినట్టుగా అవకాశం కల్పించేందుకు ఎటువంటి నియమం లేదు. కనుక, లక్ష్మణ్ వేసిన దావాను కొట్టివేయవలసినదని తెలియచేసేరు.

న్యాయస్థానంలో దావా విచారణకు వచ్చిన రోజున న్యాయమూర్తిగారు లక్ష్మణ్‌ని ఉద్దేశించి... "మీరు కేంద్రప్రభుత్వం మీద వేసిన దావాను ఇప్పటికీ కొనసాగించదలచుకున్నారా లేక వాపసు తీసుకొనే ఉద్దేశముందా? దావాను కొనసాగించదలచుకుంటే మీ తరఫున వకీలు ఎవరు?" అని ప్రశ్నించేరు.

"యువర్ ఆనర్, నేను కేంద్రప్రభుత్వం మీద వేసిన దావాను కొనసాగించదలచుకున్నాను. మీరు అనుమతిస్తే, నా దావాను నేనే వాదించుకుంటాను!"

"మీరు కోరినట్టయితే ఈ న్యాయస్థానం మీకు వకీలును ఏర్పాటు చేస్తుంది"

"అవసరం లేదు యువర్ ఆనర్, నా దావాను నేనే వాదించుకునేందుకు మీ అనుమతి కోరుతున్నాను!"

"సరే, మీరు కోరినట్టుగా అనుమతి ఇవ్వడమైనది. దావా నడుస్తుండగా మధ్యలో ఎప్పుడైనా మీరు కోరితే, ఈ న్యాయస్థానం మీకు వకీలును ఏర్పాటు చేస్తుంది!"

దావాదారు అతని ఆక్షేపణను తత్సంబంధమైన కోరికను ముందుగా ఋజువు చేసుకోవాలి కనుక, లక్ష్మణ్‌ని న్యాయస్థానంవారు ముందుగా అతని దావాకు సంబంధించిన ప్రమాణాలను సమర్పించవలసినదని తెలియచేసేరు.

లక్ష్మణ్ తాను విన్న మరియు ఎదుర్కొన్న ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన ఋజువులను, ఆ ఆటంకాలు తీరగానే ఎటువంటి జాప్యం చేయక తాను ఢిల్లీకి ప్రయాణం కొనసాగించిన ఋజువులను, మరొకసారి తనకు ఇంటర్వ్యూ అవకాశం ఇవ్వమని పెట్టుకున్న అర్జీని, దాని తిరస్కరణ తెలిపే ఋజువును న్యాయస్థానంకి సమర్పించిన తరువాత... "యువర్ ఆనర్, న్యాయస్థానానికి మరికొన్ని నిజాలు తెలియచేసేందుకు అనుమతి కోరుతున్నాను" అని విన్నవించుకున్నాడు.

"వీలైనంత క్లుప్తంగా చెప్పండి."

"ఇంటర్వ్యూ ఆరంభం అవవలసిన రోజున, ఇంటర్వ్యూ నిర్వహించవలసిన స్థలానికి ఇంటర్వ్యూ సభ్యులు ఎవరూ రాలేదు. రెండవ రోజున వారు వచ్చినా, ఆరోజు మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటిన వరకూ ఏ ఒక్క అభ్యర్థినీ ఇంటర్వ్యూ చేయలేదు. అందులోని నిజానిజాలు కారణాలు న్యాయస్థానంవారికి తెలియవలసిన అవసరం ఉంది యువర్ ఆనర్!"

అందుకు న్యాయస్థానంవారు ప్రతివాది తరఫు న్యాయవాదిని ప్రశ్నించగా... "ఇంటర్వ్యూ ఆరంభం రోజున ఢిల్లీలో రోడ్లమీద ఎక్కడికక్కడ చెట్లు విద్యుత్ స్తంభాలు పడిపోయి మహానగరం మొత్తం చాలా అల్లకల్లోలంగా ఉండడమే కారణం. రెండవ రోజున ఇంటర్వ్యూ జరిగే కార్యాలయానికి నీరు, విద్యుత్ లభించేసరికి మధ్యాహ్నం సుమారుగా పన్నెండు అవడంతో, ఇంటర్వ్యూ పన్నెండు గంటలు దాటిన తరువాత ఆరంభించడమైనది యువర్ ఆనర్!" అని ఆయన తెలియచేసేరు.

"మొదటి రెండు రోజులలో ఇంటర్వ్యూ ఇవ్వలేని అభ్యర్థులను అసలు ఇంటర్వ్యూ చేసేరా లేక వారిని వెనక్కి పంపించేసేరా అన్న పరిస్థితి న్యాయస్థానికి తెలియవలసిన అవసరం ఉంది యువర్ ఆనర్."

ప్రతివాది తరఫు న్యాయవాది లేచి "ఇంటర్వ్యూకి కేటాయించిన రోజులు పూర్తి అయిన తదుపరి వెంటనే రెండు రోజులలో వారిని ఇంటర్వ్యూ చేయడమైనది యువర్ ఆనర్" అని విశదీకరించేడు.

"ఏ నియమావళి ప్రకారం అలా చేసేరు అన్నది కూడా న్యాయస్థానికి తెలియవలసి ఉంది యువర్ ఆనర్."

ప్రతివాది తరఫు న్యాయవాది లేచి "వారు సమయానికే ఇంటర్వ్యూకి ఎంతో కష్టనష్టాలతో వచ్చేరని, అయినా ఇంటర్వ్యూ బోర్డు ఆ సమయాలలో ఇంటర్వ్యూ చేయలేకపోవడంతో, ఆయా అభ్యర్థుల దగ్గర ఎటువంటి తప్పు, దోషం, నిర్లక్ష్యం లేనందున... ఇంటర్వ్యూ బోర్డు ఛైర్మన్, ఆయనకు ఉండే ప్రత్యేక అధికారంతో, ఆ విధంగా నిర్ణయించి అనుమతించారు యువర్ ఆనర్!" అని వివరణ ఇచ్చేరు.

"ప్రకృతి వైపరీత్యాల ఆటంకంతో ఇంటర్వ్యూకి సమయానికి రాలేకపోయిన నన్ను కూడా అదే అధికారం ఉపయోగించి

ఎందుకు అనుమతించలేదు అన్నది న్యాయస్థానికి తెలియవలసి ఉంది యువర్ ఆనర్!"

అందుకు, ప్రతివాది తరపు న్యాయవాది ఇంటర్వ్యూ బోర్డు సభ్యులతో సంప్రదించి "ఇంటర్వ్యూ కోసం వాది ఐదు రోజులు ఆలస్యంగా చేరుకున్నందున ఆయనకు అనుమతి నిరాకరించబడింది యువర్ ఆనర్" అని బదులిచ్చేరు.

అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న సమయాన, న్యాయమూర్తిగారు వారి తీర్పును ఈవిధంగా ప్రకటించేరు.

"ప్రకృతి వైపరీత్యం ప్రత్యేక పరిస్థితులు కారణంగా ఇంటర్వ్యూకి వాది సమయానికి రాలేకపోయినందున ఆయన యెడల ఎటువంటి తప్పు, దోషం, నిర్లక్ష్యం లేదని భావిస్తూ ఈ న్యాయస్థానం వాదిని ప్రత్యేక ఇంటర్వ్యూకి అర్హుడిగా అనుమతిస్తున్నది. కనుక, ఇరుపక్షాలవారికి అనుకూలమైన తేదీన ఇంటర్వ్యూ బోర్డు వారు వాదిని ఇంటర్వ్యూ చేయవలసినదిగా ఉత్తర్వులు ఇస్తూ ఇంతటితో ఈ దావా..."

మధ్యలో కలగచేసుకుంటూ లక్ష్మణ్...

"సారీ యువర్ ఆనర్, మధ్యలో కలగచేసుకున్నందుకు నన్ను క్షమించి, నా విన్నపం ఒకటి మనవి చేసుకునేందుకు అనుమతి కోరుతున్నాను!"

"ఏమది?"

"రేపే ఇంటర్వ్యూ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. దయచేసి ఆ ఇంటర్వ్యూ మీ పర్యవేక్షణలో జరిగితే తప్ప నాకు పరిపూర్ణమైన న్యాయం జరగదని సందేహంగా ఉంది యువర్ ఆనర్!"

"వాదిని రేపు ఇంటర్వ్యూ చేయడానికి ప్రతివాది సంసిద్ధంగా ఉన్నారా?" అన్న న్యాయమూర్తిగారి ప్రశ్నకు...

ప్రతివాది తరపు న్యాయవాది కేంద్రప్రభుత్వపు అధికారులతో సంప్రదించి,

"రేపు ఇంటర్వ్యూ జరపడం కష్టం కాబట్టి, రెండు రోజుల గడువు ఇప్పించవలసినది!" అని మనవి చేసేరు.

"ఈరోజు శుక్రవారం. వచ్చే సోమవారం ఉదయం పదకొండు గంటలకు ఈ న్యాయస్థానం పర్యవేక్షణలో, మా ఎదుట, వాదిని ప్రతివాది ఇంటర్వ్యూ చేయాలి. అంతవరకు వాది కానీ, ప్రతివాది కానీ ఈ ఊరు వదలి బయటకు వెళ్ళడానికి ఎటువంటి అనుమతిలేదు అని స్పష్టంగా తెలియచేయడమైనది.

వాదిని ఇంటర్వ్యూ చేసేటప్పుడు బోర్డులో ఉన్న సభ్యులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, ఇంటర్వ్యూ నిర్ణయాన్ని వారు వేరువేరు సీల్డ్‌కవర్లలో ఉంచి, ఇంటర్వ్యూ అయిన వెంటనే ఈ న్యాయస్థానానికి ఇవ్వవలసి ఉంటుంది. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు వాది ఇంటర్వ్యూ ఫలితం ఈ న్యాయస్థానమే ప్రకటిస్తుంది. ఇంతటితో ఈ దావా ముగిసింది!"

అని న్యాయమూర్తిగారు ప్రకటించిన తీర్పు పట్ల, ప్రతివాది తప్ప, అక్కడ ఉన్నవారందరూ హర్షం ప్రకటించి లక్ష్మణ్_కి అభినందనలు శుభాకాంక్షలు తెలియచేసేరు.

న్యాయమూర్తిగారు లక్ష్మణ్ _ని తమ గదికి పిలిపించుకొని... “వయసులో చిన్నవాడవైన నిన్ను నా ఏకాంత నివాసంలో నిన్ను ఏకవచనంతోనే సంబోధిస్తాను!” అన్నారు.

“అది నాకు మీ ఆశీర్వాదం సర్.”

“నిన్ను నీ ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను. నీవు చక్కగా వాదించేవు. కానీ, నీ వాదనలో ఏ మాత్రం లోపం ఉన్నా మంచి అవకాశం పోగొట్టుకునేవాడిని కదా!”

“అవును యువర్ ఆనర్”

“మరి అలాంటప్పుడు న్యాయస్థానం వారు నీకు వకీలును ఏర్పాటు చేస్తామంటే ఎందుకు వద్దన్నావు?”

“అదృష్టం బాగుండి భవిష్యత్తులో నేను జిల్లా అధికారినైతే, నా దావాను వాదించుకోవడంలో వెనక్కు తగ్గే నేను, నా జిల్లా జనాన్ని ముందుండి ఎలా నడపగలను? అందుకే, నన్ను నేను పరీక్షించుకొని మీ ఆశీర్వాదం అందుకోగలిగేను. మీకు నేను సదా కృతజ్ఞుడిని!”

మనసా నవ్విన న్యాయమూర్తిగారు “నీకు అన్నీ శుభములు కలుగుగాక!” అని లక్ష్మణ్‌ని దీవించేరు.



భండారు అచ్చమాంబ గారు (1874 - 1905) తొలి తెలుగు కథా రచయిత్రి. గురజాడ వారి కంటే ముందే కథారచన చేసిన ఈమె కథ "ధన త్రయోదశి" 1902 లో ప్రచురితమైంది. ఈమె వ్రాసిన "అబలా సచ్చరిత్ర రత్నమాల" అనే గ్రంథంలో దాదాపు 1000 సంవత్సరాల కాలంలో ప్రసిద్ధి చెందిన ఎంతోమంది మహిళల గురించి చర్చించారు. ఈ గ్రంథాన్ని కందుకూరి వీరేశలింగం గారి ముద్రణాలయంలో ప్రచురించారు.

# ఋణానుబంధం!

కొత్తపల్లి ఉదయబాబు

✆ 9441860161

***"మేము ఈ ఊరొచ్చి అయిదేళ్లు నిండిపోయింది రెడ్డిగారూ. వారం రోజుల్లో వెళ్లిపోతాం. ఈసారి పట్టణానికి నన్ను ప్రమోషన్ మీద వేశారు. ఈ మూడేళ్లపాటు కామేశ్వరి పాలు రుచిగా తాగాం. బహుశా ఇంక జీవితంలో ఇలా ఆవునో, గేదెనో పెంచుకునే అవకాశం ఇక ఉండదు.. కామేశ్వరితో మాకు ఋణం తీరిపోయింది. రేపు మంచిరోజు. రేపటి నుంచే మీరు ఆ తల్లీబిడ్డల్ని మీ ఇంట్లో కట్టేసుకోండి.***

"మన కావేశరీ సూలు కట్టిందే" అన్నాను ఎంకట్లచ్చిమితో.

ఎండిన పిడకల్ని పక్కింటి పోట్టాపీసులో పనిసేసే 'పల్లాలమ్మ' గోనిసంచి అట్టుకుంటే, లెక్కబెట్టి, నూరు ఆ సంచిలో ఏసిన ఎంకటలచ్చిమి నా మాటింటానే "ఏంది బావా? మన కావుడు చూలు కట్టిందా... ఎంత శుభవార్త చెప్పావు బావా!"అని టక్కున నా దగ్గరకొచ్చి బుగ్గ మీద ముద్దెట్టేసింది... పల్లాలమ్మ సూత్తోందని కూడా సూడకుండా!

పల్లాలమ్మ ముందు తాను అట్టా సెయ్యడం నాకు నచ్చలే! గట్టిగా బుగ్గ తుడుసుకుంటూ "పట్టపగలు ఏటిది సిరాగ్గా... నా ముఖం నిండా సెమటలు కార్తన్నాయి... సూడ్నేదా?" పల్లాలమ్మ సూసేసిందన్న సిగ్గు దాసుకుంటూ ఎంకట్లచ్చిమి మీద సిరాకుగా అరిసేసినా!

పల్లాలమ్మ స్మిత సూపుల్తో నన్ను లోపలకి జుర్రేసుకుంటన్నాది.

"మీ ఆయనతో సరసాలు బాగానే ఆడతన్నావు గాని... కొసరు సెయ్యి ఐదు పిడకలు ఎయ్యవా ఏటి?" సూదంటిరాయిలాటి సూపు నాకేసి సూసి, నా ఎంకటిని అడిగింది పల్లాలమ్మ.

"ప్రతి వంద పిడకలకి కొసరు సెయ్యి ఐదు పిడకలంటే నాకేం మిగులుద్ది వదినా? ఐదు వందల పిడకలు అమ్ముకుంటే పాతిక పిడకలు కొసరికే ఎలిపోతే ఎట్టా వదినా?"

"అదిగో... నన్ను వదినా అని పిలవద్దని ఎన్నోసార్లు సెప్పినాను. కనీసం రెండన్నా ఎయ్యి సెల్లీ!" గారంగా అడిగింది పల్లాలమ్మ.


ఆమె అడిగిన రెండు పిడకలు కొసరు వేసేసిన ఎంకటలచ్మి సేతుల్లో డబ్బులెట్టేసి ఆడ ఆంజనేయులు మల్లే పిడకలసంచీ ఎత్తుకుని, 'జాకీటు' లేని సీరసెంగుని నడుం సుట్టూతా తిప్పుకుని, శరీరం అదిరించుకుంటూ ఎల్లిపోయింది పల్లాలమ్మ.

ఆ ఎంటనే వెంకటి డబ్బులు బొడ్లో దోపుకుని పరుగెత్తుకుంటూ నా కాడకి వచ్చేసింది.

“ఎంత శుభవార్త చెప్పావయ్యా… మళ్ళీ మన ఇంట్లో పెయ్యదూడ పుట్టబోతోందన్నమాట. నాకు చాలా సంతోషంగా ఉందయ్యా!”

“ఏంటి అట్టా మాటాడతావ్ ఎంకటి? ఈసారి అది సూలు కడితే, మళ్ళీ ఏడాదిపాటు మనం ఒకపూటే తినాల… ఆ సంగతి మర్సిపోయావా?” బాదగా అన్నాను.

ఒక్కక్షణం నల్లమబ్బు కమ్మిన ఆకాశంలా అయిపోనాది ఎంకటి మొగం.



“అవును ఎంకా! నీకిప్పుడు నాలుగో నెల. డాట్టరు బాబు బలమైన తిండి తినాల, మందులు బాగా వాడాల అన్నాడు. పదారు ఈతల కావేసరి ఈసారి సూలు కడితే ఎలా? దానికి దూడను కనే ఓపికుందా? బిడ్డను కంటే ఈసారది బతుకుద్దా? సరిగా రెండు పూటలా గడ్డి గాదం నేక, అది ఇప్పటికే నీరసపడిపోనాది. దాన్ని ఈ పదినెల్లూ పోసించాలంటే మనవల్ల కాదనుకున్నాం కదా! అమ్మేద్దామంటే ‘నా పుట్టింటి కాడనుంచి తెచ్చుకున్నానూ’ అంటావ్… ఎలాగోలా మనమే పోసిద్దామంటే మనకా దన్ను లేదు. ఏం సెయ్యాలో నాకేం పాలుపోడం లేదు ఎంకటీ?”

ఎంకటి కళ్ళనీళ్లెట్టుకుని గుబుక్కున లోనికెళ్లిపోయింది.

పిడకలసంచీ పోట్టాపీసు ఆరింట్లో ఇచ్చేసింది కామోసు... పల్లాలమ్మ, బార్లా తెరసి ఉన్న మా గేటులోంచి నన్ను జుర్రేసేలా సూత్తా సీరకొంగు ఓపాలు, ఇలాసంగా గుండెల మీదకు అటు ఇటు సద్దుకుని, కింది పెదవి కొరుక్కుంటా ఎల్లిపోయింది.

ఈ పల్లాలమ్మది మా పక్కన ఐదు మైల్ల దూరంలో సిలకంపాడని ఆ ఊరు. ఆళ్ళమ్మ మా పక్క పోట్టాపీసులో, రెండేల్ల కితం వచ్చిన పోట్టుమాట్టారి సుట్టాల పొలం కౌలుకు తీసుకుని సేత్తన్న రైతు నాగరత్తం కూతురు! నా మీద రెండేల్లు పెద్దదే. మావూళ్ళో నాతో గేదెలు కాసే రంగారావు గాడికిచ్చి పెళ్ళిసేసారు.

అది... ఆల్ల వూరిలో, వయసులో కుర్రోళ్ళందరితోటి సరదాగా తిరిగేసిందట. ఆ ఇసయం పెళ్ళైన ఏడాదికి రంగడికి తెలిసి పొలంగట్టున పురుగులమందు తాగేసి సచ్చిపోనాడు. కొడుకు పోయిన బాదలో ఆళ్ళత్తకి పచ్చవాతం వత్తే, ఇది ఆ అత్తగారిని సూసే వంకతో ఈడనే ఉండి వూళ్ళో కుర్రాల్లకి వల ఎత్తాది. పడినవాడి దగ్గర డబ్బు నాక్కుని, ఆడి బాద తీర్సి పంపుతాదని... సూసినోల్లు సెప్పుకుంటారు. నన్ను ఎలాగైనా ముగ్గులోకి దింపాలని దాని ఎత్తుగడ! నేను కదులుతున్న దాని అందాలు సూసి వదిలేత్తాను. అయినా దానికి నేనంటే మాంచి కసి అని నాకు తెల్సు.

నా బంగారు ఎంకటి నాకుండగా అదెందుకు నాకు?

ఎంకటి నా అత్త కూతురు. అదంటే నాకు పేణమని తెలిసి, మా అత్త నాకిచ్చి పెల్లి సేసి నాలుగేళ్లయింది. మా అమ్మ, అయ్య నాకొగ్గేసి పోయిన పాత పెంకుటింట్లో తలదాసుకుంటూ, మా అయ్య కట్టార్జితంతో కొన్న నాలుగు గేదెలు, రెండు ఆవుల్ని పెంచుకుంటూ, ఆటి పాలు, పెరుగు అమ్ముకుని బతుకుతున్నాం!

ఎంకటి ఎనిమిదో కళాసు సదివింది. జాకెట్లు, సీరలకి అడుగున రిబ్బను గుడ్డల్లాటివి కుట్టి సంపాదిత్తాది. పొలంపని లేనపుడు, దగ్గరున్న పట్నానికి జట్టు కూలికి పొద్దున్న ఎల్లి, రేతిరికి వత్తాను నేను.

ఎంకటి మొదటిసారి నెలతప్పింది. 'మీయమ్మకి కబురెడతానే' అని నేనంటే, 'అయిదో నెల వచ్చాక అమ్మకి ఉత్తరం రాత్తానులే బావా' అంది ఎంకటి.

నేను లేనపుడు ఆ పల్లాలమ్మ ఏం మాయమాటలు సెప్పుద్దో అని నా బయ్యిం!

పోట్టాపీసులో దాన్ని జగ్గడని, ఓ పనికిమాలిన ఎదవ పనిలో సేర్పించాడంట. ఆడి బామ్మర్ది పక్కనున్న సిన్న గేమానికి టపా అట్టుకెల్లి, అక్కడి టపా ఈ పోట్టాపీసుకి అట్టుకొత్తాడంట!

పెతీ ఆదివారం మాగుమ్మం ముందున్న పదెకరాల జాగాలో ఆవులు, గేదలు, ఎడ్ల సంత జరుగుద్ది. ఆ సంతలో, ఏ ఇద్దరికీ బేరం కుదరకపోయినా... మద్దెలోదూరి, బేరం కుదిరిసి, మొత్తానికి అమ్మకం జరిగేలా సూసే పెద్ద ఎదవ జగ్గడు! ఇద్దరి దగ్గరా కమీసను గుంజుతాడు.

రెండు లీటర్ల పాలిచ్చే గేదె నాలుగు లీటర్లిత్తాదని, ముసలి ఎద్దయినా పూటకి అరెకరం పొలం దుక్కి దున్నేత్తాదని... ఇలాటి కబుర్లు బొంకడంలో జగ్గడ్ని కొట్టేవోడు లేడు.

ఆ జగ్గడే పోట్టుమాట్టారిని బురిడీ కొట్టించి తన బామ్మరిది గాడి గొడ్డుగేదెని మూడోనెల సూల్దని నమ్మించి కొనిపించాడంట. దానికి కారణం... ఆ పోట్టాఫీసు మా గోడ అవతల అయిదెకరాల్లో కట్టిన ఇంట్లో ఉంటమే. ఇంటిజాగా పోగా, మిగిలిన

జాగా అంతా ఆరు నెల్లపాటు కొనక్కర్లేనంత పచ్చగడ్డి ఆ దొడ్డినిండా ఉంటుంది!

పాపం ఆ పోట్టుమాట్టారి బార్య దొడ్డ ఇల్లాలు. కొన్న ఆ గేదికి, రోజూ నూకలజావ, ఉలవలు, సిక్కటి కుడితి, కూరగాయల తొక్కలు, లేత పచ్చగడ్డి, ఎట్టి ఎట్టి మేపేసరికి అది ఐరెన్ లెగ్ శాత్రినాగ తెగబలిసిపోయి, పదో నెల సూడుగేదెలా తయారైంది. సంవత్సరమైనా అది ఈనక పోయేసరికి మాట్టారికి అనుమానం వచ్చి సంతలో సూపిత్తే అది సూల్డి కాదని తేలింది.

దాంతో మాట్టారికి మండిపోయి జగ్గడ్ని సంతలో పదిమందిలోనూ పెట్టి కడిగేత్తే 'దానికి తన బామ్మర్ది తిండేట్టనేక బాదపడుతుంటే తానే అట్టాంటి తప్పుడుపని సేసినానని, ఆయన డబ్బు ఆయనకిచ్చేత్తా'నని, కాళ్ళట్టుకుంటే ఆయన సమించేసినాడు.

మబ్బులు కమ్మేసిన ఆకాశంలో అటాత్తుగా మెరుపు మెర్సినట్టు, నా మట్టిబుర్రలో సిన్ని ఆలోచన టక్కున మొలిసింది. నా ఎంకటి ఒప్పుకుంటే, నా బాదకు ఆకులేపనం రాసినట్టుగా!

సేటంత ముకం సేసుకుని ఎంకటి ఉన్న గదిలోకి వచ్చేను. ఎంకటి ఇంకా అట్టాగే పడుకుని ఉంది. నేను ఎల్లి ఎనకమాల కల్లు మూసినా. నా సేతులకి తడైంది.

"ఏటే... ఎందుకేడుత్తన్నావ్?" అడిగాను, తన బుజాలు పట్టుకుని బలవంతంగా లేపి నాయేపు తిప్పుకుని!

"బాధ్యత తీసుకున్నాక, తప్పో రైటో భరించాలి బావా! అంతేగాని, కావున్ని అమ్మేత్తానని మరో పాలి అనమాక!" అంది ఎంకటి కళ్ళు తుడుచుకుని.

"పిచ్చిమొగమా... అందుకా ఏడుత్తూ పడుకున్నావ్? నిన్ను, దాన్ని ఎట్టా ఒగ్గేత్తాననుకున్నావ్? నువ్వు, అది బాగా తిని ఆరోగ్గెమైన బిడ్డల్ని కనాలని నాకు మాత్రం ఉండదా సెప్పు! అందుకే బయటే కూసుండిపోయి, ఆలోసిత్తావుంటే మాంచి ఆలోచనొచ్చినాది. ఇని ఎట్టా ఉందో సెప్పు. నాకన్నా నువ్వు సదువుకున్నదానివి కదా... ఆలోసించు!" అని నేను అనుకున్నది ఇవరంగా సెప్పాను.

"నీ ఆలోచన చాలా బాగుంది బావా! ఆ జగ్గడుగాడు మోసం చేసాక, పోట్టుమాట్టారు కొత్తపశువుని కొననేలేదు. మన కావున్ని ఆయనకు అప్పగిస్తే, దానికి కావలసినంత పచ్చగడ్డి దొరుకుతుంది! మన పశువులతో పాటు పొద్దున్నే పొలానికి తోలుకుపోయి సాయంత్రం తిరిగి ఆళ్ళ ఇంట్లో కట్టేసి వచ్చేయి. ఆ అమ్మగారు పశువుల్నికూడా పసిబిడ్డల్లా చూస్తారట. రెండు పూటలా ఆ పాలు వాళ్లనే తాగమందాం. మళ్ళీ ఆ పాలకోసం కక్కుర్తి పడకు! ఓ రెండు బేరాలు పోతాయి. అంతేగా. దాని పోషణభారం మనకు తగ్గిపోతుందిగా! నా కానుపయ్యి బిడ్డతో తిరిగొచ్చాక మళ్ళీ కావున్ని మన ఇంటికి తెచ్చేసుకుందాం. ఏమంటావ్?"

"నానేమంతాను? నువ్వు సరిగా ఆలోసిత్తావనే గందా నిన్ను అడిగింది. ఆ అయ్యోరు ఒప్పుకోవాలే గాని, మనకేటి అబ్బెంతరం! అయ్యోరింటికి ఎపుడెలదాం అడగడానికి?"

"నువ్వు వణ్ణం తినేసేయ్. ఆ సారు ఆపీసు అయిపోయాక ఏడింటికి ఇంటిలోకొచ్చేస్తారు. అపుడు వెళ్లి అడుగుదాం!" అంది ఎంకటి లెగబోతూ.

"ఇప్పుడియ్యి నాకు ముద్దు" అడిగాను బుగ్గ సూపించి.

"పనైతే రాత్రికి నీ ఒంటినిండా అయ్యే పెడతా. వేన్నీళ్లు చల్లారిపోతన్నాయి. వెళ్లి స్నానం చేసిరా" అని నా బుగ్గమెత్తగా సిదిమి బయటకు నడిసింది ఎంకటి.

★★★

మమ్మల్ని సూత్తానే "రండి వీర్రెడ్డిగారు. మీ శ్రీమతిగారిని కూడా తీసుకొచ్చారే. కూర్చోండి" అంటూ కుర్చీలు సూపించారు పోట్టుమాట్టారు.

"అమ్మగారిని కూడా పిలవండి బాబూ!" అని ఆయనతో అన్నాను.

అంతలో ఆవిడే వచ్చి, మాట్టారి కుర్చీ ఎనకాల నిలబడి "బాగున్నావా వెంకటలక్ష్మి. నీళ్ళోసుకున్నావట కదా! పల్లాలమ్మ చెప్పింది చాలా సంతోషం. నీకు ఏం తినాలని ఉన్నా చెప్పు. చేసి పంపిస్తాను!" అన్నారు ఎంకటితో.

"ఇంతకీ ఏమిటి విషయం?" అడిగారు మాట్టారు.

"నువు సెప్పవే" అన్నాను నేను.

"అదేనయ్యా... ఆ జగ్గడు మోసం చేసాక, తమరు మళ్ళీ గేదెని కొనలేదట కదా!" అంది ఎంకటి.

"అవును లక్ష్మీ. మేము చేసిన పనికి మాకే సిగ్గేసిందనుకో! అంతగా నమ్మించి మోసం చేసాడతను. పోనీ ఇంత పెద్ద స్థలం ఉంది కదా... ఆ పచ్చగడ్డి అలా పెరిగిపోతుంటే, ఏ పురుగు పుట్రా చేరినా, పిల్లలు భయపడతారు. అంత పచ్చమేత ఉంది కనుక, ఓ పాడిగేదెను కొనుక్కుందాం. ఈ ఊళ్ళో ఉన్నంత కాలం చిక్కటి పాలు, పెరుగు తాగచ్చు అని ముచ్చట పడ్డాను. పల్లాలమ్మ తాను చాకిరీ చేస్తానంది... చేసింది కూడా! తీరా అతనేమో అలా చేసాడు. ఇంకో మూడేళ్లుంటాం కదా. ఈసారి మంచి పాడిగేదెను కొనండీ అని పోరుతున్నాను." అన్నారు ఆవిడ

"మేము ఆ విషయం అడగటానికే వచ్చాం అమ్మగారు! మా పుట్టింట్లో పదేళ్లప్పుడు మొదటిసారి పెయ్యదూడ పుట్టింది. దానికి మా అమ్మ కామేశ్వరి అని పేరు పెట్టింది. పెళ్ళి అయ్యాక దాన్ని నాతో తెచ్చుకున్నాను. అది చాలా పొగరుగా ఉండేది. ఒకరోజు పొలాల్లో ఒక ఎద్దు, దాన్ని బలంగా కుమ్మింది. దాంతో దాని కుడిచట్ట జారిపోయింది. వైద్యం చేయించాం. అప్పటినుంచి అది కుడికాలు ఈడుస్తూ నడుస్తుంది. నాకు తెలిసి ఇప్పటికి పదహారు ఈతలు ఈనింది. ఇపుడు మళ్ళీ చూలు కట్టింది. మీ పెరట్లో పచ్చగడ్డి ఉంది కాబట్టి దాన్ని మీరు ఈ ఊళ్ళో ఉన్నంతకాలం పెంచుకోండి. అది ఈనాకా దాని పాలు మీరే వాడుకోండి. మా బావ... మా పశువులతో పాటు రోజూ పొలం తోలుకెళ్లి మేపుకోస్తాడు. మళ్ళీ మీ ఇంట్లోనే కట్టేస్తాడు. మీరు మళ్ళీ బదిలీ అయినప్పుడు మా కామేశ్వరిని మాకు ఇచ్చేయండి. మీరు కొత్తగా గేదెని కొనక్కర్లేదమ్మా. మీకిష్టమైతేనే!" అంది ఎంకటి.

మాట్టారుగోరు, అమ్మగారు మొకాలు సూసుకున్నారు. అయ్యగారు సంతోసంగా అన్నారు.

"ఎంత మంచి మాట సెప్పావు వీర్రెడ్డి. మా వదినగారి పొలం నుంచి ఎండుగడ్డి, జనుము తెప్పిస్తాను. అనవసరంగా ఆ

ఎండుగడ్డిని పెంటలోకి తోలేస్తున్నాడట మా రైతు! రేపు దశమి మంచి రోజు. రేపే మీ కామేశ్వరిని మా ఇంటికి పంపేయండి. మాకు బదిలీ అయి వెళ్ళేటప్పుడు, దానిని అప్పగించి మరీ వెళ్తాం. ఏమంటావ్?" అమ్మగోరి వైపు చూస్తూ అన్నారు.

"మీ సహాయానికి కృతజ్ఞతలు రెడ్డిగారు. దాన్ని నా కన్నబిడ్డలా చూసుకుంటాను" అన్నారు అమ్మగోరు.

అమ్మయ్య... ఆ దేవుడే మా ఇబ్బందికి పరిస్కారం సూపినందుకు మనసులో దండాలెట్టుకుని "సరే బాబూగోరూ. రేపట్నించి మా కావుడు మీ కావేసరి! మీ సాయానికి ఏమిచ్చి ఋణం తీర్సుకోము బాబు? ఎల్లుత్తాము అమ్మా!" అని అయ్యగోరికి, అమ్మగోరికి సెప్పేసి ఇంటికొచ్చేసినాం.

ఇంటికొచ్చినాక ఎంకటితో అన్నా... "మంచి ఉద్యోగం సేసుకుంటా కూడా, ఒక మూగజీవిని సాకాలన్న ఆ దంపతులు ఎంత గొప్పమనసు కలవారో! మన కావుడికి మంచిరోజులొచ్చినాయే. అది మన ఇంటికొచ్చేలోగా మనం కాలు సెయ్యి కూడదీసుకోచ్చు." ఆ రేతిరి మాట ప్రకారం నాకు ముడుపు చెల్లించేసుకుంది ఎంకటలచ్చిమి.

★★★

కాలపెవాహంలో రోజులు నెలలయినాయి. నా దగ్గర ఎముకలు తేలి డొక్కలెండిపోయి, సూలు పొట్ట ఒకటే కనిపించే కావేసరి అయిదో నెల సూలుకే రేపో మాపో ఈనేత్తదా అనిపించేలా బలంగా తయారైనాది. మరి ఆయమ్మ సేతిలో ఏముందో ఏటో... ఏపసెట్టుకు ఇనపగొలుసుతో కట్టేత్తే గానుగెద్దులా తిరగతానే ఉండేదట. ఆయమ్మగారిని సూత్తానే రెండు మూరల కొమ్ములున్న కావేసరి, మోరసాచి కన్నతల్లిని సేరిన బిడ్డలా మారిపోయేదంట. ఓరిని దగ్గరకు రానిచ్చేది కాదంట. ఓపాలి ఆల్ల పదేళ్ల మనవడు దగ్గరకెల్తే, రెండు కొమ్ముల్తో ఎత్తి ఇసిరేసిందట. ఆ బిడ్డ సచ్చిపోయాడనే అనుకున్నారంట. ఆయమ్మ సేసిన పున్నెం... ఆ బిడ్డ సరిగా నిండా ఎండుగడ్డున్న జల్లలో పడ్డాడంట. సిన్న దెబ్బ కూడా తగల్నేదంట. అంత సల్లని మనసు ఆయమ్మది!

అటు ఎంకటి, ఇటు కావేసరి ఒక నెలరోజుల తేడాలో మాంచి బగుమతులు అందించారు.

సంక్రాంతి పండగనాడు ఎంకటి ఆళ్ళ అమ్మగారింట్లో పండంటి మగబిడ్డను కన్నాది.

నెలలు నిండి మాగమాసంలో పౌర్నమి రోజున పెయ్యదూడను ఈనింది కావేసరి. జున్నుపాలు తీసి నాకు కూడా ఇచ్చినారు అమ్మగోరు. పోట్టాపీసులో పనిసేసేవోళ్ళందరికి బొబ్బట్లు, పులియోరా సేసిపెట్టి, పండగలాగా సేసేరు. నాకు కూడా ఇంటికి పంపేరు అమ్మగోరు.

బాబుకు 'సూర్రెడ్డి' అని పేరు పెట్టుకున్నాం.

కావేసరి బిడ్డకి 'సీతమ్మ' అని పేరెట్టింది ఎంకటి.

సూత్తావుండగానే ఇటు సీతమ్మకి, అటు నా బిడ్డ సూరీడికి రెండేళ్లు నిండిపోయి మూడో ఏడాది వచ్చేసినాది.

మా సూరిగాడైతే వచ్చీ రాని మాటలు, పరుగెట్టి పడిపోడాలు, నాతో దొంగాటలు, ఆళ్ళమ్మతో దోబూచులు. సంతోసంగా సాగిపోతోంది జీవితం.

★★★

ఆరోజు పోట్టుమాట్టారు నాకు కబురంపినారు.

నేను, ఎంకటి, బాబుతో ఎల్లాం.

"రండి వీర్రెడ్డి గారూ" అని ఎప్పటిలాగే కుర్చీలు సూపించారు.

అమ్మగోరు ఆయన ఎనకమాల వచ్చి నిలబడ్డారు. ఇద్దరి ముకాలు బాదగా ఉన్నయి.

"మేము ఈ ఊరొచ్చి అయిదేళ్లు నిండిపోయింది రెడ్డిగారూ. వారం రోజుల్లో వెళ్లిపోతాం. ఈసారి పట్టణానికి నన్ను ప్రమోషన్ మీద వేశారు. ఈ మూడేళ్లపాటు కామేశ్వరి పాలు రుచిగా తాగాం. బహుశా జీవితంలో ఇలా ఆవునో, గేదెనో పెంచుకునే అవకాశం ఇక ఉండదు.. కామేశ్వరితో మాకు ఋణం తీరిపోయింది. రేపు మంచిరోజు. రేపటి నుంచే మీరు ఆ తల్లీబిడ్డల్ని మీ ఇంట్లో కట్టేసుకోండి. అలవాటు పడతాయి. అన్నట్టు గత మూడురోజులుగా కామేశ్వరి పాలు ఇవ్వకుండా తంతోంది. మళ్ళీ చూడు కట్టిందని నా అనుమానం. ఓసారి పరీక్ష చేయించండి." అని నాకు, ఎంకటికి, బాబుకు కొత్తబట్టలెట్టి పంపినారు.

మరునాడు అమ్మగారు దాన్ని పట్టుకుని కల్లనీల్లెట్టుకుంటే నాకు దుక్కమాగలేదు. కావేసరి కంట నీరు కారతానే ఉంది. అయ్యగారు సెప్పింది నిజమే. కావేసరి పద్దెందోసారి సూలు కట్టింది.

మా జీవితంలో అన్నిసార్లు సూలుకట్టిన గేదెని ఏనాడు సూల్లేదు.

లారీలో సామానుతో ఆళ్లిద్దరూ ఎల్లిపోతాంటే నేనే దాని మెడలో తాడట్టుకుని లారీ కాడకు తీసుకొచ్చినా.

లారీ ఎనక నెమ్మదిగా నడవసాగింది కావేసరి. నేను తాడు బిగించినా. అది ఒక్క గుంజు గుంజి లారీ ఎనక వేగంగా నడిసినాది.

ఊరి మలుపు వరకు అట్టా నడిసినాకా లారీ వేగంగా ఎల్లిపోడంతో ఆగిపోనాది.

ఇక తప్పక దాని తాడు తీసుకుని ఎనుతిరిగినా. ఈది దీపం ఎలుగులో దాని కళ్ళల్లోంచి దారాపాతంగా నీళ్లు జారిపోతూనే ఉన్నాయి.

# సంఘర్షణ

అనంతపట్నాయకుని కిశోర్
✆ 9490262162

***"ఇంకు మరకలు తెలిసిపోతాయి" అన్నాడు తగ్గు స్వరంలో. వార్డుబోయ్ మాట తగ్గు స్వరంలో ఉండటం గుర్తించాడు కిరణ్. క్షణం ఆలస్యం చెయ్యకుండా జేబులోనుండి కొన్ని ఐదువందల రూపాయల నోట్లు తీసి వార్డుబోయ్ జేబులో పెట్టాడు. "కొంచెం ఆగు. స్పిరిట్ తెస్తాను. వెంటనే స్పిరిట్‌తో క్లీన్ చేస్తే మరకలు పోతాయి. ఇక్కడివన్నీ మామూలే!***

"హలో!"

"హలో, ఆ ఏమ్మా అరుణా, నాన్నకెలా ఉంది?"

"ఐసీయూలో ఉన్నారంకుల్. నలభై ఎనిమిది గంటలైతేగాని చెప్పలేం అంటున్నారు!"

"అలాగా? అసలేమైందమ్మా?"

"మాసివ్ హార్ట్ఎటాక్ అంకుల్"

"అయ్యో అలాగా? నిన్నేమైనా సుస్తీ చేసిందా?"

"లేదంకుల్, నిన్న రోజంతా నార్మల్‌గానే ఉన్నారు. నిన్న సాయంత్రం నాతోనూ, బాబుతోనూ కూడా మామూలుగానే మాట్లాడారు. రాత్రి ఏడున్నర సమయంలో, ఎప్పట్లాగే రెండు పుల్కాలు తిని కారిడార్లో కాసేపు వాకింగ్ కూడా చేశారట! తొమ్మిదింటికి పడుకున్నారట. రాత్రి ఒంటిగంటప్పుడు అమ్మ ఫోన్ చేసి... 'నాన్నగారికి ఏదో బాలేదమ్మా, నువ్వు వెంటనే రాగలవా?' అంది. నేనూ క్రిష్ణా వెంటనే వచ్చాం. వచ్చేసరికి నాన్న బాగా ఆయాసపడుతున్నారు. మాట్లాడలేక పోతున్నారు. క్రిష్ణా నేనూ వెంటనే కార్లో తీసుకొచ్చి ఇక్కడ అడ్మిట్ చేశాం. టెస్టులన్నీ అయాక ఐసీయూలో పెట్టారు."

"ఆంజియో ఏమైనా చేశారా?"

"బైపాస్ చెయ్యాలంటున్నారంకుల్. బీపీ, షుగర్ ఎక్కువగా ఉన్నాయంట! కొంచెం కంట్రోల్లోకొస్తే చేస్తామన్నారు."

"అదేంటమ్మా, వాడికి షుగర్ లేదు కదా? అయినా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూనే ఉంటాడే!"


"అదే తెలియదంకుల్"

"ఏ హాస్పిటల్? ప్రసాదరావుదేనా?"

"అవునంకుల్. కానీ ప్రసాదరావు డాక్టరుగారు ఊళ్లో లేరంట. వేరే ఎవరో చూశారు. నేనే ఇంకాసేపట్లో మీకు ఫోన్ చేసి చెప్పాలనుకున్నాను. ఈలోగా మీరే చేశారు."

"వాకింగ్‌కి వాడు రాలేదు. ఫోను చేస్తే అదీ తియ్యలేదు. సరేలెమ్మని ఇంటికెళుతూ దారిలో వాణ్నీ, మీ అమ్మనీ పలకరించి వెళదామని ఫ్లాట్‌కెళ్లాను. కిందనే వాచ్‌మేన్ చెప్పాడు 'రామంగారికి బాగులేదు సార్, అర్ధరాత్రప్పుడు వాళ్ల అమ్మాయిగారు వచ్చి హాస్పిటల్‌కి తీసుకెళ్లారని'. విషయం కనుక్కుందామని నీకు ఫోన్ చేశాను. ఇప్పుడు అమ్మెక్కడుంది?"

"ఇందాకే ఇంటికి పంపించానంకుల్. స్నానం, పూజ చేసుకునొస్తానంది."



"సరే నేను కూడా పూజా అదీ చేసుకుని మీ ఆంటీని తీసుకునొస్తాను. మేం మధ్యాన్నం వరకూ ఉంటాంలే. నువ్వొ ఇంటికెళుదూగానీ!"

"సరే అంకుల్"

"తమ్ముడికి తెలిసిందా?"

"ఆ, రాత్రే చెప్పానంకుల్. ఆ టైములో వాళ్లకి పగలు కదా! కంగారు పడుతున్నాడు. గంటగంటకీ ఫోన్ చేసి అడుగుతున్నాడు!"

"సరేలే" ఫోన్ కట్ చేశారు శంకరంగారు. శంకరంగారనబడే ఈ శంకర నారాయణగారూ, రామంగారనబడే రామ్మూర్తి గారూ, గురుమూర్తిగారనబడే మరో పెద్దాయనా, ప్రసాదరావుగారనబడే డాక్టర్ ప్రసాదరావుగారూ బాల్యస్నేహితులు! ప్రాణానికి ప్రాణంగా ఒకరికి ఒకరుగా... చిన్నప్పటి నుండి వారి స్నేహం అలా కొనసాగుతూనే ఉంది. ఆ నలుగురికీ కొంచెం అటూఇటుగా డెబ్బై ఎనిమిదేళ్లు. జీవితంలోని ఎత్తుపల్లాలన్నీ సంపూర్ణంగా చవిచూసి ఈ వయసులో అన్ని ఆపేక్షలూ వదిలేసినా, స్నేహమనే ఈ ఒక్క బంధం మాత్రం వారి మధ్య అలా పచ్చగా కొనసాగుతూనే ఉంది.

రామంగారు హెడ్మాస్టరుగా రిటైరయారు. చాలా పద్ధతైన మనిషి. అన్ని విషయాల్లోనూ మంచి క్రమశిక్షణ పాటిస్తారు. సొంత రెండు పడగ్గదుల ఫ్లాట్లో మకాం!

రామంగారి సహధర్మచారిణి లక్ష్మిగారు. గత ఏభైఏళ్ల వైవాహిక జీవితంలో అనుక్షణం రామంగారిని అంటిపెట్టుకుని మంచిచెడ్డలన్నీ, ఆయనతో సమానంగా పంచుకున్నారు. వారికి ఇద్దరు బిడ్డలు. కుమార్తె అరుణ. కుమారుడు కిరణ్. ఇద్దరికీ చదువులూ పెళ్లిళ్లూ పూర్తయ్యాయి. అరుణా, ఆమె భర్త క్రిష్ణా, వాళ్ల కొడుకుతో అదే ఊళ్లో రెండు వీధులవతల ఉంటారు. కిరణ్ అమెరికాలో ఉద్యోగం. భార్యాబిడ్డలతో అక్కడే ఉంటాడు.

చెప్పినట్టుగానే శంకరంగారు మధ్యాహ్నం పన్నెండు గంటల సమయానికి వారి శ్రీమతి లలితగారితో సహా హాస్పిటల్‌కి చేరుకుని, అరుణను ఇంటికి పంపారు. విజిటర్స్ లాబీలో కూర్చున్న లక్ష్మిగారిని పలకరించి ధైర్యంగా ఉండమన్నారు. తరవాత ఫోన్ తీసుకుని మిత్రులందరికీ ఫోన్లు చేసి రామంగారికి బాగులేని విషయం తెలియపరచారు.

కొంతసేపటికి గురుమూర్తిగారు చేరుకున్నారు. అరుణ కూడా వచ్చింది. వస్తూనే సరాసరి ఐసీయూలోనికెళ్లి నాన్నగారిని చూసి, ఆయన పరిస్థితి గురించి సిస్టర్ని అడిగి తెలుసుకుని బయటికి వచ్చింది.

"ఎలా ఉందమ్మా?" అడిగారు శంకరం గారు.

"బీపీ కొంచె కంట్రోల్‌లోకొచ్చింది గానీ పల్స్ మాత్రం ఇంకా వీక్‌గానే ఉందంట అంకుల్. షుగర్ టెస్టు మళ్లీ సాయంత్రం ఐదింటికి చేస్తారంట!" బదులిచ్చింది అరుణ.

"అద్సరే గానీ కొంచెం నాతో రామ్మా" అని ఆమెను పక్కకు పిలిచారు గురుమూర్తిగారు. "నువ్వూ రారా" అన్నారు శంకరంగారితో. ముగ్గురూ కలసి కొంచెం దూరం వెళ్లాక అరుణనుద్దేశించి గురుమూర్తి గారన్నారు "పెద్దవాణ్ణి చెప్తున్నాననుకోకుండా, ఓ నాలుగు తెల్లకాయితాల మీద మీ నాన్న వేలిముద్రలు తీసుకోమ్మా. తరువాత అవసరం పడగలవు!"

"ఎందుకంకుల్?" అడిగిందామె. ఆ కంఠంలో ఆశ్చర్యమూ, ఆదుర్దా, సందేహమూ, సందిగ్ధతా అన్నీ ఒకేసారి ధ్వనిస్తున్నాయి.

"నీకు తెలీదమ్మా. పెద్దవాణ్ణి అనుభవంతో చెప్తున్నాను విను" అన్నారు గురుమూర్తిగారు.

ఆమె శంకరంగారి వైపు ప్రశ్నార్థకంగా చూసింది. "ఇప్పుడవన్నీ ఎందుకులేరా? చూద్దాంలే. ఇంకా సమయం ఉంది కదా! అంతవరకూ వస్తే అప్పుడాలోచిద్దాంలే!" అంటూ "నువ్వు తమ్ముడికోమాట చెప్పి నిర్ణయించుకోమ్మా!" అని అరుణకు సూచించారు.

అరుణ ఆలోచిస్తోంది. ఇంత ప్రాణ స్నేహితులు! ఇంత క్రిటికల్ కండిషన్లో ఇలాంటి సలహా ఇస్తున్నారేంటి? శంకరం అంకుల్ కూడా ఇప్పుడెందుకులే అన్నారే గానీ వద్దని వారించలేదు! పైగా తమ్ముడితో కూడా మాట్లాడమంటున్నారు! ఆమెకంతా అయోమయంగా ఉంది. గురుమూర్తి అంకుల్ ఇలాంటి సలహా ఇచ్చారేమిటి? శంకరం అంకుల్ కూడా అలా చేయవద్దని చెప్పకుండా తమ్ముడితో మాట్లాడమన్నారేమిటి? ఇంతలో ఆమె చేతిలోని సెల్ మ్రోగింది. తమ్ముడు కిరణ్ ఫోన్ అది. ఆన్సర్ చేస్తూనే కిరణ్ అడిగాడు "ఎలా ఉందక్కా?"

"అలాగే ఉందిరా. అప్పుడే ఏం చెప్పలేమంటున్నారు హాస్పిటల్ వాళ్లు!" ఆ మాట అంటున్నప్పుడు ఆమె స్వరం తడబడింది. ఆ తడబాటుతోపాటు ఆమె దృక్పథంలో అస్పష్టమైన ఓ కొత్త కోణం ఆవిష్కృతమైంది. నాన్నకి మంచి స్నేహితులే కదా! పెద్దవారు. అనుభవంతో చెప్పినమాట!! ఒకవేళ జరగరానిదేదైనా జరిగితే? ఆ తరువాత బేంకు ఎకౌంట్ల విషయంలో గానీ, నాన్న పెన్షన్ అమ్మ పేరిట మార్చడానికి గానీ ఇంకే ఇతర విషయంలో గానీ ఎక్కడైనా నాన్న సంతకాలు అవసరం పడితే? అంకుల్ ఇచ్చిన సలహా పాటిస్తేనే మంచిదా? తమ్ముడికీ విషయం చెప్తేనే మంచిదా? ఆమె ఆలోచనలు ఓ కొలిక్కి రాక ముందే కిరణ్ "అంతా మంచిగా జరగాలనే కోరుకుందాం అక్కా! అమ్మ జాగ్రత్త!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఆ మరుసటి రోజు ఉదయాన్నే కిరణ్ అరుణకి ఫోన్ చేశాడు.

"ఎలా ఉందక్కా?"

"ఏం ఇంప్రూవ్మెంట్ కనిపించడం లేదురా! ఆక్సిజెన్, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం, మానిటర్ చెయ్యడం మినహా ఏం చెయ్యడానికి లేదంటున్నారు. వుయ్ హేవ్ టు వెయిట్ అంటున్నారు. నిన్న సాయంత్రానికి ప్రసాదరావు డాక్టర్ గారొచ్చి చూశారు. 'ప్రమాదం లేదనడానికి లేదమ్మా, హిజ్ కండిషన్ ఈజ్ క్రిటికల్ బట్ స్టేబుల్. డిటీరియొరేట్ అవ్వడంలేదు లక్కీగా, కానీ అప్పుడే ఏం చెప్పలేం. ఓ డాక్టరుగానే కాకుండా ఓ చిన్ననాటి స్నేహితుడిగా నా శక్తి మేరకు ప్రయత్నిస్తాను' అన్నారు. ఇంతకీ నువ్వెప్పుడు బయల్దేరుతున్నావు?"

"అదే అక్కా! నాకు ఇక్కడ చాలా హెక్టిగ్గా ఉంది. వర్క్ ప్రెజర్ చాలా హెవీగా ఉంది. ఇప్పుడు నేను చేస్తున్న ప్రోజెక్ట్ వచ్చే వారానికంతా కంప్లీట్ చెయ్యాలి."

"అలా అంటే ఎలారా? ప్రోజెక్టు చూసుకోవడానికింకెవరూ లేరా? నాన్న పరిస్థితి ఇలా ఉంటే దగ్గరుండాల్సిన బాధ్యత నీకు లేదా?" కాస్త గట్టిగానే మందలించింది.

"అది కాదక్కా! నీకెలా చెప్పాలో నాకు తెలియడం లేదు. టైము లోపల ఈ ప్రోజెక్ట్ కంప్లీట్ చేస్తే హాఫ్ మిలియన్ డాలర్స్ ఇన్సెంటివ్ అక్కా! ఇంతవరకూ తెచ్చి చూస్తూ చూస్తూ చివరిలో ఎలా చేజార్చుకోగలను? ఇట్స్ వన్స్ ఇనే లైఫ్ టైం ఛాన్స్

అక్కా! ప్లీజ్! అర్థం చేసుకో. అమ్మకేదో సర్ది చెప్పు. ఎలాగోలా మేనేజ్ చెయ్యక్కా! ఎంత ఖర్చైనా ఫర్వాలేదు. వీలైతే ఈ లోగానే ప్రోజెక్ట్ కంప్లీట్ చేసుకునొచ్చేస్తా! కొంచెం హెల్ప్ చెయ్యక్కా!"

హతాశురాలైంది అరుణ. ఏంటి వీడు? నాన్నకిలా ఉంటే, వెంటనే వచ్చి దగ్గరుండి చూసుకోకుండా... ఇన్సెంటివ్ గురించి ఆలోచిస్తున్నాడు?

"కిరణ్! నాన్న పొజిషన్ ఏంటన్నది నీకు క్లియర్‌గా చెప్పాను. ఈ టైమ్‌లో మనమందరం నాన్న దగ్గరుండడం అవసరం. అసలిప్పుడే అవసరం! ఇలాంటప్పుడు కాకపోతే ఇంకెప్పుడుంటాం? డబ్బులు ఇప్పుడు కాకపోతే ఇంకోసారి సంపాదించుకోవచ్చు, కానీ నాన్నకేమైనా ఐతే... ఆలోచించు!"

"కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించక్కా! ఇప్పుడక్కడికి వచ్చి మాత్రం నేనేం చెయ్యగలను, విజిటర్స్ లాబీలో వెయిట్ చెయ్యడం తప్ప? వీలైనంత తొందరలో వచ్చేస్తాను. కొంచెం మేనేజ్ చెయ్యక్కా. మా ఫ్రెండ్ రమేష్‌ని పంపిస్తాను. నీకు హెల్ప్‌గా ఉంటాడు."

"నేను చెప్పవలసింది చెప్పాను. ఇక నీ ఇష్టం!" అసహనంగా ఫోన్ కట్ చేసింది.

ఒక్క నిముషంలోనే ఆమెకు వాట్సప్ మెసేజ్ పంపాడు కిరణ్. "ప్లీజ్ అక్కా. ఎక్స్క్యూజ్ మీ. నాన్నంటే నాకు ప్రాణం. ఐ లవ్ హిమ్ ద మోస్ట్. ఐ విల్ బీ దేర్ ఏసాప్. హోప్ ది ఆల్మైటీ విల్ బీ ఆన్ అవర్ సైడ్." ఆ మెసేజ్ ఆమెకు చిరాకు కలిగించింది. అవసరానికి దగ్గర నిలబడకుండా ఎక్కడలేని ప్రేమా ఒలకబోస్తున్నాడు! ఛీ, తన తమ్ముడింత స్వార్థపరుడని తనెప్పుడూ కనీసం ఊహించలేదు. తమనిద్దరినీ ఇంతవాళ్లని చెయ్యడానికి అమ్మా నాన్నా ఎంత కష్టపడ్డారు? అలాంటి తండ్రి పట్ల చూపించాల్సిన కృతజ్ఞత ఇదేనా?

"డాక్టరుగారు రమ్మంటున్నారు" సిస్టర్ పిలుపుతో తేరుకుంది అరుణ. కంగారుగా లోనికి వెళ్లింది.

"కండిషన్ ఇంప్రూవ్ అవ్వడం లేదమ్మా! వెంటిలేటర్ పెట్టాల్సి ఉంటుంది!" గబగబా చెప్పి లోపలికెళ్లిపోయారు డాక్టరుగారు.

"సంతకం పెట్టండి మేడం" ఫారమూ, పెన్నూ ఇచ్చింది సిస్టర్. యాంత్రికంగా సంతకం చేసి బయటకు వచ్చేసింది.

"ఏమన్నారు?" అడిగారు శంకరం గారు. ఆయన గొంతులో సమాధానం తెలుసుకోవాలన్న కుతూహలం కంటే ఏమి చెప్పి ఉంటారో ఊహించగలనన్న భావనే ఎక్కువగా ఉంది.

"వెంటిలేటర్ పెట్టాలన్నారు" ఆమె స్వరంలో ఆందోళన.

గాఢంగా నిట్టూర్చారాయన. గురుమూర్తిగారు శంకరంగారి భుజం మీద చెయ్యి వేసి నిమిరారు. ఇద్దరూ ఒకరి కళ్లలోకి ఒకరు ఒక్క క్షణం చూసుకున్నారు. ఇద్దరి కళ్లలోనూ ఒకటే భావన. ఆ భావన పేరు నిస్సహాయత!!

అరుణకు అంతా సందిగ్ధంగా ఉంటోంది. ఏమిటీ జీవితం? ఇంతేనా? జీవితంలో నాన్నకంటే డబ్బే ముఖ్యమా? ఇదేనా ప్రేమ?

మరోసారి తమ్ముడి ఆలోచన కరెక్టేనేమో అనిపించసాగింది. నిజమే! హాఫ్ మిలియన్ డాలర్సంటే మాటలా? ఒక డాలర్ అంటే ఎనభై రూపాయల పైమాటే! అలాంటి డాలర్లు అక్షరాలా ఐదు లక్షలు! అందులోనూ ఇన్నాళ్లూ కష్టపడి ఈ ప్రోజెక్టుని ఇంతవరకు నడిపించి ఇప్పుడు ఫలితం చేతికందబోయే వేళ!! నాన్న పరిస్థితి ఇలా ఉన్నందుకు గానీ, లేకపోతే తమ్ముడు అంత ఘనత సాధించబోతున్నందుకు తనూ గర్వించేది కాదూ?

ఆలోచిస్తే అన్ని కోణాలూ సరైనవే అనిపిస్తున్నాయి! ఎటు చూసినా ఏమీ తేల్చుకోలేని పరిస్థితి! ప్చ్! ఈ సమయంలో నాన్నకిలా కాకపోతే బాగుండేది!!

రెండు రోజులు గడిచాయి. రామంగారి పరిస్థితిలో చెప్పుకోదగ్గ అభివృద్ధి లేదు. అందరిలోనూ ఆశ సన్నగిల్లుతోంది. ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉండాలన్న సన్నద్ధత అందరిలోనూ పెరుగుతోంది. కిరణ్ గంటకోసారి ఫోన్ చేస్తున్నాడు. అరుణలో అతని ఫోన్ పట్ల నిర్లిప్తత పెరిగింది. తీస్తే తీస్తుంది... లేదంటే లేదు. తీసినప్పుడు... ఇద్దరిమధ్యా మూసలో పోసినట్టు అదే సంభాషణ!

ఆరోజు మళ్లీ కిరణ్ నుండి కాల్! నిరాసక్తంగా ఆన్సర్ చేసింది అరుణ. “అక్కా, గుడ్‌న్యూస్. నా ప్రోజెక్ట్ కంప్లీట్ అయింది. సాయంత్రం బయలుదేరి వచ్చేస్తున్నా. అంతా బాగానే ఉంది కదా!”

“సరే, రా” అనేసి కాల్ కట్ చేసింది.

మరుసటి రోజు సాయంత్రానికి కిరణ్ చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టు నుండి సరాసరి హస్పిటల్‌కి చేరుకున్నాడు. ఐసీయూలో వెంటిలేటర్‌తో ఉన్న తండ్రిని చూసి ఖిన్నుడయ్యాడు. ఇప్పుడు నాన్న మాట్లాడే స్థితిలో లేరు. తను ముందే వచ్చి ఉండాల్సింది. తప్పుచేశానా అన్న భావన అతడిని క్రుంగదీసింది.

తల్లి దగ్గరకు వెళ్లాడు. ఆమె అతడిని చూసింది కానీ ఆమెలో ఏ భావనా లేదు. అనుక్షణం తన భర్త క్షేమంగా తిరిగి రావాలని భగవంతుని ప్రార్థించడం మినహా ఆమె మనసులో మరో ఆలోచన లేదు.

అరుణ దగ్గరకు వెళ్లాడు. “నన్ను క్షమించక్కా!”

“ఇప్పుడవన్నీ ఎందుకు? పోనీలే సమయం మించిపోకుండానే రాగలిగావు!” ఆత్మీయత, అవహేళన కలిసిన ఓ భావం ఆమె మాటలో ఉంది.

“డాక్టరుగారు పిలుస్తున్నారు” సిస్టర్ చెప్పడంతో అక్కా తమ్ముళ్లిద్దరూ లోపలికెళ్లారు.

“వెంటిలేటర్ పెట్టి రెండు రోజులైందమ్మా. పేషెంట్ రెస్పాన్స్‌లో ఇంప్రూవ్‌మెంట్ లేదు. ఏం చేద్దామంటారు?” అడిగారు డాక్టర్ ప్రసాదరావుగారు.

ఏం చెయ్యాలో చెప్పవలసిన డాక్టరుగారు, ‘ఏం చేద్దామంటారు?’ అని అడగడంలో అంతరార్థం తెలుసుకోగలిగే మానసిక పరిణత ఆ ఇద్దరికీ లేదు. “మీరే చెప్పండంకుల్” అయోమయంగా అన్నారిద్దరూ.

"చూడు కిరణ్. క్రిటికల్ కండిషన్లో ఉన్న ప్రతి పేషెంటు బంధువూ ఎదుర్కొనే క్లిష్టమైన పరిస్థితి అది! పేషెంటు వైటల్స్ అన్నీ పని చేస్తున్నాయి. కానీ అవి వెంటిలేటర్ మీద పని చేస్తున్నాయి. వెంటిలేటర్ తీసేస్తే పని చేస్తాయా లేదా అన్నది తెలియదు. ఇలా వెంటిలేటర్ మీద ఉన్నంతకాలం పేషెంట్ మెడికల్‌గా బ్రతికి ఉన్నట్టే లెక్క! కానీ అలా ఎంతకాలం ఉంచగలం? మీరు మీ వాళ్లందరితో మాట్లాడి ఓ నిర్ణయానికి రావాలి మరి. వాడు నా ఫ్రెండు. వాడి విషయంలో మీతో ఈ మాట చెప్పాల్సి రావడం నాకు చాలా బాధగా ఉంది. కానీ డాక్టర్నే అయినా నేనూ మనిషినే కదా! నేను చెయ్యగలిగింది ఇంతకంటే ఏం లేదు. మీరు ఆలోచించుకుని ఏ విషయం చెప్పండి!" చెప్పలేని విషయాన్ని చెప్పకనే చెప్పారు డాక్టర్ ప్రసాదరావుగారు.

సమాధానం చెప్పకుండానే బయటకు నడిచారు అరుణ, కిరణ్. ఇద్దరిలోనూ నిశ్శబ్దం!

వాళ్లిద్దరూ బయటకు వస్తూనే దగ్గరికెళ్లారు శంకరం, గురుమూర్తి గార్లు. వారు ఏమీ అడగలేదు. అరుణ, కిరణ్ తలలెత్తి వారిని చూశారు. వారి మనసుల్లోని ప్రశ్న అర్థం చేసుకున్నారు. ముందుగా తేరుకున్న కిరణ్ చెప్పాడు "వెంటిలేటర్ పెట్టి రెండురోజులైనా ఇంప్రూవ్‌మెంట్ లేదు, మీరు ఆలోచించుకోండి అన్నారు"

"మరో రెండు రోజులు చూద్దాంలే" శంకరం గారన్నారు. ఔనన్నారు గురుమూర్తిగారు.

"నాకూ అదే అనిపిస్తుంది" అంది అరుణ.

"అదే బెటర్. లెటజ్ ట్రై" అన్నాడు కిరణ్.

"నేనొకసారి నాన్నని చూసొస్తానక్కా" అంటూ కిరణ్ తన బేక్‌పేక్ భుజాన వేసుకుని ఐసీయూలోనికెళ్లాడు. తన తండ్రిని అలాంటి స్థితిలో చూడాల్సి వచ్చినందుకు చాలా బాధగా ఉందతనికి. దుఃఖాన్ని దిగమింగుకుంటూ తన బేక్‌పేక్‌ని సైడ్‌టేబిల్ మీద పెట్టి ఓపెన్ చేశాడు. అటూఇటూ పరికించి చూసి అందులోనుండి ఓ నాలుగు తెల్ల కాగితాలూ ఒక స్టాంప్‌పేడ్ బయటకు తీశాడు. సరిగ్గా అదే సమయానికి వార్డుబోయ్ హఠాత్తుగా వచ్చాడు. కిరణ్ చేతిలోని కాగితాలు, స్టాంప్‌ప్యాడూ చూశాడు. ఆ తరువాత కిరణ్ కళ్లలోనికి చూశాడు. "ఇంకు మరకలు తెలిసి పోతాయ్" అన్నాడు తగ్గు స్వరంలో. వార్డుబోయ్ మాట తగ్గు స్వరంలో ఉండటం గుర్తించాడు కిరణ్. క్షణం ఆలస్యం చెయ్యకుండా జేబులోనుండి కొన్ని ఐదువందల రూపాయల నోట్లు తీసి వార్డుబోయ్ జేబులో పెట్టాడు. "కొంచెం ఆగు. స్పిరిట్ తెస్తాను. వెంటనే స్పిరిట్‌తో క్లీన్ చేస్తే మరకలు పోతాయి. ఇక్కడివన్నీ మామూలే! రోజూ చూస్తుంటాం!" అని గబగబా వెళ్లి స్పిరిట్ బాటిల్ తీసుకొచ్చాడు వార్డుబోయ్. పని ముగించుకుని కిరణ్ బయటికొచ్చాడు.

మరో రెండు రోజులు గడిచాయి. రామంగారి పరిస్థితి యథాతథంగా ఉంది. డాక్టర్ ప్రసాదరావుగారు మళ్లీ పిలిచారు. కిరణ్, అరుణలతో పాటు ఈసారి శంకరం గారూ గురుమూర్తి గారూ కూడా లోనికెళ్లారు.

"ఏంటాలోచించారు?" ప్రశ్నించారు.

"మీరే చెప్పండంకుల్" అన్నాడు కిరణ్ ఏమీ చెప్పలేని స్థితిలో.

"మీరు సరేనంటే తీసేద్దాం! ఎక్కువ కాలం వెంటిలేటర్ మీద ఉంచడం కూడా మంచిది కాదు. న్యుమోనియా రావచ్చు. లేదంటే బ్రీతింగ్ ట్రబుల్స్ అయినా రావచ్చు. తీసి చూస్తే... అదృష్టం బాగుంటే కోలుకోవచ్చు కూడా. చెప్పలేం!" తాను

చెప్తున్నది ఇంచుమించు అసాధ్యం అన్న విషయం తనకు సంపూర్ణంగా తెలిసినా, వృత్తిధర్మంగా నమ్మబలికారు డాక్టరు గారు.

"ఈరోజొద్దులేరా. అమావాస్య ఘడియలు పోనీయ్" ఆందోళనగా ఇంచుమించు అరిచారు శంకరంగారు అసహనంగా!

ఆయనమాటకు ఎవరూ కాదనలేదు. ఔననీ అనలేదు!!

అందరూ బయటకు వెళ్లిపోతుండగా, డాక్టరుగారు అరుణనీ, కిరణ్‌ని ఆపి చెప్పారు "ఈరోజు కాకపోతే రేపైనా తీసేయ్యాల్సిందే కదా! దానికి మీ ఇద్దరితో పాటు మీ అమ్మగారి సంతకం కూడా అవసరం. మావాళ్లు ఆ పేపర్స్ ఇస్తారు. సంతకాలు చేసి రెడీగా ఉంచుకోండి"

అరుణ, కిరణ్ బయటకొచ్చాకా శంకరంగారు అరుణతో అన్నారు "ఈరోజు అమావాస్యమ్మా! చాలా క్లిష్టమైన సమయం. మా ఇంటి దగ్గర శివాలయంలో మహా మృత్యుంజయ మంత్ర జపం చేయించి విభూతి తెచ్చాను. వాడి నుదుటి మీద పెట్టాలి!" అంటూ లేచారు.

"ఇలా ఇవ్వండంకుల్. నేను పెట్టొస్తాను" అందామె.

"కాదమ్మా, నన్నే స్వయంగా పెట్టనీ" అంటూ ఐసీయూ లోనికెళ్లారు. అక్కడ మొహం పూర్తిగా కప్పేసినట్టున్న వెంటిలేటర్‌తో అచేతనంగా ఉన్న తన బాల్యస్నేహితుణ్ని చూసి పొంగుకొస్తున్న దుఃఖాన్ని పంటి బిగువున అదుపు చేసుకుని, తన షర్ట్ జేబులో నుండి కాగితం మడతల్లో అత్యంత భక్తి భావంతో, ఎనలేని ఆశలతో అఖండమైన విశ్వాసంతో తీసుకు వచ్చిన విభూతిని తన కుడిచేతిలోని మూడు వేళ్లకు అద్ది వణుకుతున్న చేతులతో రామంగారి నుదుటిన కుడి నుండి ఎడమకు అద్దుతూ 'త్వరలోనే కోలుకుని రారా! ఇదే కడపటి చూపు కానీకురా!' అని మనసులోనే అభ్యర్థించారు. ఆ క్షణంలో ఉవ్వెత్తున తన్నుకొస్తున్న భావోద్వేగాన్ని ఆపుకోవడం ఆయనకు ఎంతమాత్రం సాధ్యపడలేదు. ఎంత ప్రయత్నించినా పసితనం నుండి కలసి పెరిగిన అనుబంధం ఆయన్ను దుఃఖాక్రాంతం చేయగా సన్నగా ఏడ్వనారంభించారు. అక్కడున్న సిబ్బంది ఆయన్ను బలవంతంగా బయటకు పంపారు.

"అక్కా! అమ్మ సంతకాలు కావాలన్నారు కదా! నావల్ల కాదు. ప్లీజ్ నువ్వే సంతకం చేయించి తీసుకురా" హాస్పిటల్ స్టాఫ్ ఇచ్చిన మూడు నాలుగు కాగితాలు అరుణ చేతిలో పెట్టి అన్నాడు కిరణ్.

లక్ష్మిగారు రెండు రోజులుగా హాస్పిటల్‌కి రాలేదు. ఈరోజు కూడా ఇంట్లోనే ఉండిపోయారామె. తల్లిని చూసినట్టూ, ఆమె సంతకం తీసుకున్నట్టూ ఉంటుందని బరువెక్కిన హృదయంతో అరుణ బయలుదేరింది. ఆమె చేరే సరికి లక్ష్మిగారు పూజ ముగించుకుని హాల్లోనికి చేరారు. నిండు ముత్తయిదువగా ఆమెను చూసిన అరుణ చేష్టలుడిగిపోయింది. తను వచ్చిన పనేమిటి? అమ్మ సంతకం తీసుకోవడానికి! దేనికి? నాన్నకు పెట్టిన వెంటిలేటర్ తొలగించడానికి! తొలగిస్తే ఏమవుతుంది? ఊహలో కూడా భరించలేని ఆ భయంకర సత్యం సమీపంలోనే ఉందా? ఆమె మనసు కీడు శంకిస్తోంటే అతి కష్టంగా మనసును నిగ్రహించుకుని తల్లిని సమీపించింది. తను మాట్లాడే ప్రయత్నం చెయ్యలేకపోయింది. మాట్లాడేందుకు పెదవి విప్పితే ఆమె నోటి నుండి వెలువడేది మాట కాదు. పెల్లుబుకున్న దుఃఖం... చెలియలికట్ట తెగిన వరద గోదారిలా ఉధృతంగా ఉప్పొంగుతుంది. వణికే చేతులతో హేండ్‌బేగ్ లోనుండి కాగితాలు తీసి తల్లి ముందు పెట్టింది. ఏమిటన్నట్టు చూశారు

లక్ష్మిగారు. ఆమె కళ్లలోకి చూసే ధైర్యం లేక వెనక్కు తిరిగింది అరుణ. కాగితాలను పరికించి చూసే మానసిక స్థితిలో లేరు లక్ష్మిగారు. వాటికేసి యథాలాపంగా చూసి, ఇంటూ గుర్తు కనబడిన చోట్ల యాంత్రికంగా సంతకాలు చేసి పూజగది లోనికెళ్లిపోయారామె. ఆమె చేసిన ఒక్కో సంతకం ఆమె భర్తపై ఆమే జారీ చేసిన మరణశాసనం అన్న విషయం గుర్తెరగలేదామె!

కొంతసేపటికి ఆ కాగితాలు తీసుకుని హాస్పిటల్‌కి బయలుదేరింది అరుణ.

ఆరోజు సాయంత్రానికి రామంగారికి పెట్టిన వెంటిలేటర్ తొలగించబడింది. సిస్టర్ బయటకు వచ్చి ఆ విషయం చెప్పేసరికి అందరి వదనాల్లోనూ దిగులు ఆవహించింది. వచ్చినవారందరూ ఒక్కొక్కరుగా ఇళ్లకు వెనుదిరిగారు. అరుణ, ఆమె భర్త, కిరణ్‌లు మాత్రమే మిగిలారు. ఎవరూ మాట్లాడే స్థితిలో లేరు. అందరి మనసుల్లోనూ ఆందోళన! ఏదో ఒక అద్భుతం జరిగి ఆయన ఆరోగ్యం కుదుటపడితే బాగుండునన్న ఆశ!!

ఆ రాత్రి గడిచింది. మరునాడు ఉదయం సిస్టర్ బయటకు వచ్చి చెప్పింది "పల్స్, బీపీ నిలకడగా ఉన్నాయండీ. డాక్టరు గారు వచ్చి చూస్తారు" అందరూ కాస్త తేలికపడ్డారు.

రెండు రోజులు గడిచాయి. రామంగారి పరిస్థితి కాస్త ఆశాజనకంగా అభివృద్ధి చెందింది.

మరో వారం తరువాత తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా కుటుంబ సభ్యులకు చెప్పి రామంగారిని డిశ్చార్జ్ చేశారు. ఇంటిలో ఆయన్ను అందరూ కంటికి రెప్పలా చూసుకుంటున్నారు.

ఓ నెల రోజులు గడిచాయి. ఆయన ఆరోగ్యం క్రమేపీ అభివృద్ధి చెందుతోంది. ఇంట్లోనే వీల్‌ఛెయిర్‌లో ఎవరి సహాయంతోనైనా అటూ ఇటూ తిరగ గలుగుతున్నారాయన. కిరణ్ లాంగ్‌లీవ్ తీసుకుని తండ్రి దగ్గరే ఉంటూ ఆయనకు సకల సపర్యలూ చేస్తున్నాడు.

ఆరోజు ఉదయం ఆయన వీల్‌ఛైర్లో కూర్చుని టీవీలో ఎక్కడో జరిగుతున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం లైవ్‌లో చూస్తున్నారు. ఆయనకు సమీపంలో కూర్చుని లక్ష్మిగారు కాయగూరలు తరుగుతున్నారు. అరుణ వచ్చింది. మరికొంత సేపటికి శంకరంగారు కూడా వచ్చారు.

కిరణ్ ఒక కవరు రామంగారి చేతిలో పెట్టి ఆయన కాళ్లపై పడి, "నన్ను క్షమించండి నాన్నగారూ" అన్నాడు. ఏమిటిది అని రామంగారనుకునే లోపే, అరుణ కూడా ఓ కవరుని ఆయనకందిస్తూ ఆయన కాళ్లపై పడింది.

ఏం జరుగుతోందనుకుంటూ రామంగారు ఆ కవర్లు ఒకొక్కటీ తెరిచారు. రెండిటిలోనూ ఆదుర్దాగా సేకరించబడినవని తెలుస్తూనే ఉన్న బొటనవ్రేలి ముద్రలు గల తెల్ల కాగితాలు!! వాటికేసి తేరిపారచూసి రెండు కళ్లూ మూసుకుని ఒక్కసారి గాఢంగా ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఉచ్ఛ్వాసనిశ్వాసాల వెనుక ఆయన కళ్లనుండి రెండు కన్నీటిబొట్లు జాలువారాయి! కుతూహలంగా దగ్గరకు చేరిన లక్ష్మిగారి చేతికి వాటినందించారు. అది గమనించిన శంకరంగారు, రామంగారి దగ్గరకు చేరి ఆయన భుజంమీద చెయ్యివేసి "ఇందులో వాళ్ల తప్పేం లేదురా. ఆ సలహా ఇచ్చింది మేమే! అప్పుడున్న పరిస్థితుల్లో…"

అంటూండగా రామంగారు, తన భుజం మీదనున్న శంకరంగారి చేతిని తన కుడిచేత్తో తాకి, ఆయనకేసి మెల్లగా చూశారు. ఆ చూపులో విమర్శ గానీ ప్రశ్నార్థకం గానీ లేవు. ఆ స్పర్శలో జరిగిన సంఘటనకు ఆమోదం ఉంది. లక్ష్మిగారి వైపు చూసి అస్పష్టంగా ఏదో సైగ చేశారాయన. అర్థమైనట్టుగా లక్ష్మిగారు లోనికెళ్లి బీరువాలో నుండి మరో కవరు తెచ్చి ఆయనకందించారు. ఆయన దానిలోని కాగితాలు బయటకు తీసి కిరణ్, అరుణలిద్దరికీ చేతిలో పెట్టారు.

అవి... ఆయన లోగడ ... తన ఆస్తి మొత్తాన్ని ... తన తదనంతరం సంపూర్ణ అనుభవ హక్కులతో లక్ష్మిగారికీ, ఆమె అనంతరం అనుభవదానవిక్రయాది సంపూర్ణ హక్కులతో పిల్లలిద్దరికీ సమానంగా చెందేలా రాసిన వీలునామా!!

ఇది విలువలకీ వాస్తవానికీ మధ్య జరిగిన సంఘర్షణ.

# అంతర్యుద్ధం

వారణాసి భానుమూర్తి రావు

✆ 9989073105

***"నీవు అనుకొన్నదే జరిగింది గనుక..."***

***"అంటే!"***

***"ఇంకా డొంకతిరుగుడెందుకు రామారావ్? వికృతంగా వున్నాడని, అవిటివాడని నీ బిడ్డను నువ్వు చంపదలచుకోలేదా?" అంతరాత్మ నిలదీసి అడుగుతోంది.***

***తప్పు చేసిన అపరాధిలా తలొంచుకొన్నాడు రామారావు.***

కరుణా మెటర్నటీ హాస్పిటల్ ముందర...

రామారావు తచ్చాడుతున్నాడు వెయిటింగ్ హాల్లో! సముద్రపు హోరులా గజిబిజిగా ఉంది హృదయం. గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. కుజోపరితలంపై మొదటి సారిగా దిగిన వైకింగ్ నుంచి మొదటి సారిగా ఏం వింటామా అన్న శాస్త్రజ్ఞుల ఆరాటం, ఆత్రుతలా... ఇంకొక ఐదు నిమిషాల్లో భూకంపం వస్తుందని విన్నప్పుడు , అక్కడి ప్రజల హృదయాల్లో చెలరేగిన ఆందోళనల, వేదన, భయం... ఇప్పుడు రామారావులో చోటు చేసుకొన్నాయి.

మూడు గంటలనుండి.. ఏకాంతంగా తను.. తనతో అంతరాత్మ.. అంతరాత్మతో తను.. తెలియని ఉద్రిక్తతతో బిగుసుకు పోయిన పిడికిళ్ళలో వెచ్చదనం!

లబ్‌డబ్‌మని సెకనుకు ఎనభై సార్లు వేగాన్ని హెచ్చించిన హృదయం. చల్లగాలి రివ్వున చెవులకు తగులుతూంటే భరింపరాని చల్లదనం. వాతావరణం అసహ్యంగా ఉంది. పరిసరాలు రుచించడం లేదు. మనసు వికలంగా ఉంటే, ప్రకృతి గూడా వికృతిలాగా కనబడుతుందేమో!

రేడియం డయల్ వాచీలో నిమిషాలు, సెకన్ల ముల్లు గమనం పై తన కళ్ళు. ముళ్ళు ముందుకే కదలడం లేదు.

సూర్యుడు ఆకాశంలో ఒకే చోట నిలబడి తనని వెక్కిరించినట్లుంది. అర్థం లేని ఆలోచనలు! భరింపరాని ఆలశ్యం,

ఏదో వెగటు... ఏదో వెలితి...

రామారావు అడుగులు వేస్తున్నాడు.

ముందుకు ఐదు... వెనక్కి ఐదు... తనకు అక్కడ తెలిసిన వారెవ్వరూ లేరు. నిజంగా ఏకాంతం భరించరానిది.

నరకం లాంటిది.



జానకికి ఇది మొదటి కాన్పు ... తనకీ ఆనందమే!

పెళ్ళయిన ఏడాదిన్నరగా ఆడుకొన్న వలపు ఆటల ఫలితం. అనుభవించిన ఆనందాలకు ప్రతిరూపం. అలా రామారావు అనుకున్నా... తన అంతరాత్మ అడ్డంగా వాదిస్తుంది. ససేమిరా ఒప్పుకోదు.

నవమాసాలు మోయాలి. అఫ్‌కోర్స్, తను గాక పోయినా... తన శ్రీమతి! ప్రసవవేదన, అతి భయంకరమైన పురిటి నొప్పులు భరించాలి.



నేరం తనది. అనుభవించవలసిన శిక్ష తన భార్యకు! కర్త తను... కర్మ తన భార్య!

ఆమెకు కడుపు రావడానికి కారణం తను... ఆమెను అలా హింసించడానికి కారణం తను... రామారావు ఆత్మ పిచ్చిగా వాదిస్తోంది.

ఇంకా గూడా వాదించగలుగుతుంది. రామారావు తన అంతరాత్మతో పోటీ పడలేదు. దానిని ఎదిరించలేదు. అశక్తుడు పాపం తను! జీవితంలో ఏ నాడో అంతరాత్మతో ఓడిపొయ్యాడు తను! అంతరాత్మకు తను బానిస. అది చెప్పినట్లు చెయ్యడమే తనకిష్టం. అందుకే అది మంచయినా, చెడు అయినా అంతరాత్మ సలహా లేనిదే అడుగు ముందుకు వెయ్యడు. ఇదీ రామారావు పద్ధతి.

ఆలోచిస్తున్నాడు... ఆలోచనలు ఒకరకమైన సంతృప్తిని ఇవ్వగలుగుతాయి ఒక్కొక్కప్పుడు! హృదయంలో ఆరాటం, బాధ, భయం, ఆవేదన, రంపపు కోతలాంటి ఆవేదన!

తన అర్ధాంగి ప్రసవ వేదన. రాత్రి కరుణా మెటర్నిటీ ఆసుపత్రిలో చేర్పించాడు. ప్రొద్దుటి నుండీ పురిటి నొప్పులు

ప్రారంభమయ్యాయి తీవ్రంగా! కానీ, ఇంకా ప్రసవం కాలేదు.

ఒకటి, రెండు, రెండున్నర, మూడు... మూడున్నర గంటలు దాటిపొయ్యాయి పురిటినొప్పులు ప్రారంభమయి...

భగవాన్! ఏమిటీ పరీక్ష? జానకిని రక్షించు స్వామీ! నా దేవిని కాపాడు!

కనుల పొరల్లో నిండాయి కన్నీళ్ళు. సిజేరియన్ ఆపరేషన్ తప్పదన్నారు డాక్టర్లు.

సరేనన్నాడు తను. ఒక 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' మీద తన సంతకం తీసుకొన్నారు.

రామారావు హృదయంలో విపరీతమైన అలజడి. గుండెల్లో దడదడ. హాస్పిటల్ వాతావరణం మరీ ప్రత్యేకం. ప్రతి మనిషి ముఖంలో ఏదో తెలియని విచారం. భయం! రామారావుకి హాస్పిటల్ వాతావరణం అసలు నచ్చదు.

ప్రక్కనున్న పిల్లల వార్డులోంచి గట్టిగా ఏడ్పులు. ముసుగు కప్పిన పిల్లవాడి శవం మీద పడి, ఒక తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. రామారావు లేచి చూశాడు.

కాళ్ళల్లో వణుకు, చేతుల్లో కంపరం. నోట్లో తడి ఆరిపోతోంది. ముఖంలో చెమట! నిలబడలేక పోతున్నాడు. ప్రక్కన ఉన్న కూలర్ నుండి మినరల్‌వాటర్ గ్లాసులో నింపుకొని గడగడమని త్రాగేశాడు. ఆయాసం తగ్గింది. తుండుగుడ్డతో మొహం మీదున్న స్వేదబిందువుల్ని తుడుచుకున్నాడు.

ఏవో వికృతమైన శబ్దాలు... ఆ రోదనలను, పెడబొబ్బల్ని విన లేక పోతున్నాడు రామారావు.

నిజమా! జానకి గూడా నొప్పులు భరించలేక ఇలానే అరుస్తుంటుందా?

"ఓ... మై గాడ్! జానకీ... నా జానకీ!" గొంతులో వణుకు. కాళ్ళల్లో కంపరం. పీలగా అరచాడు.

ప్రసూతి వార్డు ప్రక్కనున్న ఆపరేషన్ రూంము వైపు నడిచాడు రామారావు.

తెల్లని డ్రస్సులో సిస్టర్ తన వైపే వస్తోంది. "సిస్టర్!" ఆయాసంగా పిలిచాడు రామారావు.

"రామారావు మీరే గదూ? "

"అవును... నా జానకి ఎలాగుంది?" కంగారెక్కువయింది రామారావుకి.

సిస్టర్ ముఖంలో ఆనందం కంటే సానిభూతి ఎక్కువ పాలు కనిపిస్తోంది. ఆమె కళ్ళు చురుకుదనంగా లేవు. మాసిపోయినట్లు నిర్జీవంగా ఉన్నాయి. రామారావు ఇవన్నీ గమనించే స్థితిలో లేడు.

"సిస్టర్!" రామారావు గొంతులో ఆతృత.

"తల్లీ బిడ్డా క్షేమంగానే వున్నారు రామారావు గారూ! డోంట్ వర్రీ!" అన్నది సిస్టర్ ఎక్కడో చూస్తూ.

"బేబీ ఆడా... మగా?" ఉండబట్టలేక అడిగాడు రామారావు.

"బాబే... కానీ..."

"కానీ...." రామారావులో కోటి సందేహాలు.

సిస్టర్ మౌనంగా ఉంది.

"ఏమిటి సిస్టర్... మీ అనుమానం?"

"ఆ... ఏమీలేదు.. ఇంకో గంట తరువాత తల్లీబిడ్డలను మీరు చూడవచ్చు!" వెనుతిరిగింది సిస్టర్.

రామారావు గొంతులో వెలగ బడ్డట్లయింది ఆమె సమాధానం. తనకు బాబు పుట్టాడు. తను అదృష్టవంతుడు. తను ఓ బాబుకి తండ్రి ఇప్పుడు. గర్వంగా చెప్పుకొంటాడు తను. ఆనందంగా ఉంది తనకు. బాబు మీద ఎన్నో కలలు.

'తన పోలికా? జానకి పోలికా?' తన పోలికయితే జానకిని ఏడ్పించాలి.

బాబుని పెద్ద పెద్ద చదువులు చదివించాలి. బాబుని ఐ ఏ ఎస్ ఆఫీసరుని చెయ్యాలి. పదిమంది తనని గొప్ప ఆఫీసర్ తండ్రినని చెప్పుకోవాలి. పరి పరి విధాల పోతున్నాయి ఆలోచనలు రామారావు మస్తిష్కంలో!

★★★

"రామారావ్!" పిలిచింది అంతరాత్మ.

"నాకు బాబు పుట్టాడు" చెప్పేశాడు రామారావు.

"సంతోషం"

"మరీ చప్పగా ఉన్నావేంటి.. ఇలాంటి ఆనంద సమయంలో గూడా!"

"పిచ్చి రామారావ్... నీకానందంగా ఉంటే నాకు ఆనందంగా ఉండాలా!"

"మరి..." అర్థం కాలేదు రామారావుకి.

"ముందు ఆలోచనలు పనికిరావని తెలుసా?"

"తెలుసు"

"మరి తెలిసే ఆలోచిస్తున్నావా?"

జవాబు చెప్పలేదు తను. మెలికలు త్రిప్పుతూ అంతరాత్మ అడిగే ప్రశ్నలకు, సమాధానం చెప్పడం తనకు చేతగాదు ఒక్కొక్కసారి.

"ఏం మాట్లాడవు? బాబుని నువ్వు చూశావా?"

"లేదు"

"మరి అంత సుందరంగా అంచనాలు వేసుకొంటున్నావు?" గంభీరమైన ప్రశ్న అంతరాత్మ నోటి నుండి.

"_______"

"సిస్టర్ చెప్పింది విన్నావా? కానీ... అని అర్థాంతరంలో చెప్పి వెళ్ళింది." గొప్ప రహస్యం బోధిస్తున్నట్లు ఫీలయ్యింది అంతరాత్మ.

"అవును" రామారావు తల వూపాడు.

"ఆ... కానీ... అనే పదంలో ఎంత గూడార్థం దాగివుందో కనుక్కో! మళ్ళీ కలలు కను! నే వస్తా!"

రామారావు నుండి అంతరాత్మ నిష్క్రమించింది. హృదయం నిండా మేఘాలు పులుముకొన్నాయి.

"అవును... సిస్టర్ ఎందుకు సంకోచంగా, సంశయంగా వెళ్ళిందో?"

గంటన్నర దాటింది. సిస్టర్ తనను పిలుచుకొని వెళ్ళింది, జానకిని, బాబుని చూపడానికి! జానకి బెడ్ మీద పడుకొనింది నీరసంగా! కళ్ళు గూడా తెరవడంలేదు.

"ఆమెకు విశ్రాంతి కావాలి. ఆమెను లేపకండి." సిస్టర్ వారించింది.

"బాబు ఎక్కడ?" రామారావు గొణిగాడు.

"అదిగో... అ ఉయ్యాల్లో!" సిస్టర్ ముఖం త్రిప్పుకోవడం తను గమనించాడు.

ముద్దుగా నిదురోతున్న తన బాబుని మొదటిసారిగా చూశాడు రామారావు.

అంతే... కోటి బాంబులు పగిలినట్లు! భూమండలం గిర్రని ఘీంకార నాదాలతో తిరిగినట్లు! మహాప్రళయం వచ్చి భూమండలం పటాపంచలయినట్లు... చుట్టూ గాఢాంధకారం, రామారావుకి ఏం కనబడ్డంలేదు. తను తూలి పడిపోతూంటే, కంగారుగా సిస్టర్ పట్టుకోవడం తెలిసిందతనికి!

★★★

ఆ రాత్రి ....

రామారావుకి నిద్ర పట్టడం లేదు. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచిపొయ్యాయి.

"భగవాన్! నీకేం అపకారం చేశానని? మా కెందుకీ శిక్ష విధించావు?" కన్నీరు మున్నీరుగా విలపించాడు రామారావు.

" రామారావ్!"

" __________"

"నిన్నే పలకవేం?"

"నేనే పాపం చేశాను?" ఏడ్చేశాడు రామారావు.

"నీ పాపఫలం గాదది.. వాడి కర్మఫలం"

"నన్నేం చెయ్య మంటావ్?"

"కన్నతండ్రివి. ఏం చెయ్యాలో నీకే తెలియాలి"

" భగవాన్!"

"రామారావ్... అటు చూడు"

కళ్ళల్లో నిండిన కన్నీటి పొరల మధ్య మసక మసక తెల్లని వెలుతురు దగ్గరగా అయినట్లనిపించింది రామారావుకి! అస్పష్టంగా ఉన్న దృశ్యం స్పష్టకాసాగింది.

రెండు కాళ్ళు వంకరలు తిరిగిన అవిటివాడు. రెండు చేతులు వంకర్లు పోయిన మొండిచేతివాడు. అష్టకురూపిలా మారిన ముఖం. మాసి పోయిన గడ్డం. పిపీలకలు అయిన గుడ్డలు. నడవలేకపోతున్నాడు. ముఖం పీలగా అందవికారంగా ఉంది. రోడ్డు మీద బోర్లాపడి అడుక్కు తింటున్నాడు. మూల్గుతున్నాడు. బలంగా నిట్టూర్పులు విడుస్తున్నాడు. బాధగా అరుస్తున్నాడు. నడవ లేక, నడిచే వాళ్ళను చూసి ఏడుస్తూ... పరుగెత్తే వాళ్ళు తనని చూసి నవ్వుతూంటే... కాకులు, ఈగలు, దోమలు, కుక్కలు ముసురుతూంటే "నో..నో.. అలా జరగడానికి వీల్లేదు ఇది అసంభవం." పిడుగులా అరచాడు రామారావ్ .

"రామారావ్"

"నో... నో..."

"రాబోయే ఆ రేపులో ఎంత భయంకరత్వం దాగి ఉందో గమనించావా?"

"నో... అసంభవం. ఇంపాజిబుల్! అలా జరగడానికి వీల్లేదు!"

"అన్నీ నువ్వు అనుకొన్నట్లు జరగవు!"

భయంకర మైన నిశ్శబ్ధం. ఆ నిశ్శబ్దంలో... జ్వాలాకీలలతో గిర్రని తిరిగే చక్రం. ప్రళయ కాలరుద్ర శబ్దారావములు.

విలయ తాండవ గర్జనలు. ఎర్రని రక్తం... రక్తంలో ముద్దయిపోయిన మనిషి!

"ఏమిటిది? నా కేమయ్యింది? నేనెందుకిలా మారాను?" పీలగా అరచాడు రామారావు.

"నువ్వు మారలేదు. పరిస్థితులు నిన్ను మారుస్తున్నాయి."

"నాకెందుకీ శిక్ష?"

"శిక్ష గాదది. భయంకర పరీక్ష. ఈ పరీక్షలో నెగ్గాలి."

"నేను నెగ్గలేను. నేనోడిపోతాను. నేను ఓడిపొయ్యాను భగవాన్!"

"పిచ్చి ఆలోచనలు మానేసి పరిష్కార మార్గం ఆలోచించు."

"నా వల్ల కాదు. నేను ఆలోచించలేను."

"అయితే... అనుభవించు."

దిగ్భ్రమచెందాడు రామారావు.

శివమెత్తినట్లు వూగుతూ నవ్వుతోంది అంతరాత్మ తనని చూసి! పిచ్చివాడిని చూసినట్లు చూస్తోంది. ప్రపంచం పగిలిపొయ్యేలా వికృతంగా నవ్వుతోంది.

"నీ కొడుకు రామారావ్... రెండు కాళ్ళు లేని అవిటి వాడు. చేతుల్లేని మొండివాడు. కురూపి, కుంటివాడు, అవిటివాడు!" అంతరాత్మ వికృతంగా తనని చూసి నవ్వుతోంది... ఆ రాత్రంతా!

★★★

ఉదయం పది గంటల సమయం.

రామారావు హాస్పిటల్‌కేసి నడకసాగించాడు. హృదయంలో రంపపుకోతలాంటి బాధ! ఆవేదన, వేదన, భరింపరాని వ్యధ!

చరిత్రలో జరగని విచిత్రాతి చిత్రం. సృష్టిలో జరిగే అతి రహస్యం .

కసాయివాడు గొర్రెను పెంచి నరికేటట్లు... మొక్కల్ని పెంచి త్రుంచేసినట్లు... రాజుల ప్రభుత్వాలు మనుషుల్ని పోషించి యుద్ధాలకు పంపేటట్లు... అంతా స్వార్థం...అందరివీ స్వార్థపు పనులే! రేపటిజీవితంలో గుదిబండలాంటి బరువు మోయవలసి వస్తుందని, తన మెడకు తన కొడుకు ఉరిత్రాడై వుచ్చులా బిగిస్తుందని, తను ఏదో చెయ్య బోతున్నట్లు... చెయ్యాలని వెతుకు తున్నట్లు... తనదీ స్వార్థపు పనే!

అన్నెం పున్నెం ఎరుగని ఓ అమాయక పచ్చి జీవితాన్ని... రక్తం ఇచ్చి జీవం పోసిన తను నా శ నం...

తను కిరాతకుడు... తను హంతకుడు..!

నో... నో... తను కిరాతకుడు కాదు. హంతకుడు అసలేకాదు.

జీవితాంతం బ్రతుకే శాపంగా... ప్రతి ఘడియలోనూ నరక బాధతో... కన్నీళ్ళ క్షణాలతో... విషాద గాథలతో...

గాఢాంధకారం అలుముకొన్న జీవితం.. పుట్టుకే ఒక ఘోర శాపంగా పరిణమించకుండా...శభాష్.. గర్విస్తున్నాడు తను... ఏ కన్నతండ్రీ చెయ్యలేని పని... తను చెయ్యగలడు. తన మంచికి గాదు... పుట్టిన పసికందు మంచికి... వాడి బాగు కోసం! శాపగ్రస్థుడిగా పుట్టిన వాడి జీవితం అలా కొనసాగకుండా... దుర్భర మానసిక వేదనా సంఘర్షణలతో జీవితాంతం కుమిలి పోకుండా... తను ఏదో చెయ్యబోతున్నాడు.

నిష్కర్షతో, ఆత్మనిగ్రహంతో, ఆత్మశక్తితో, అంతరాత్మ ప్రభోధంతో ముందుకు అడుగులేస్తున్నాడు తను.

తను హంతకుడు గాదు. కానే కాదు. తను కిరాతకుడు గాదు. తనకీ తండ్రి ప్రేమ తెలుసు. తనకీ మానవత్వం వుంది. తను పాపిగాడు.

పాప పరివృత్తమైన బీజాన్ని పుణ్యభూమిలోకి విసిరివేయడానికి, భగభగమని మండే మంటలలో, ఉరకబోతున్న పురుగును నీటి ప్రవాహంలోకి విసిరివేయడానికి... త్వరత్వరగా ముందుకు అడుగులేస్తున్నాడు తను!

★★★

వార్డులోకి అడుగుపెట్టాడు రామారావు.

బిగ్గరగా ఆర్తనాదం లాంటి ఏడ్పు. ఆ ఏడ్పు తనకి సుపరిచితంగానే ఉంది.

"ఎవరిదా ఏడ్పు?"

అంతరాత్మ నవ్వింది.

"తెలీదా?"

"ఊహూ!"

"నీ భార్య జానకిది."

"ఏమయింది? ఎందుకని?"

కోటి సందేహాలు. గుండె ఆగిపోయినట్లుంది రామారావుకి.

"నీవు అనుకొన్నదే జరిగింది గనుక..."

"అంటే!"

"ఇంకా డొంకతిరుగుడెందుకు రామారావ్? వికృతంగా వున్నాడని, అవిటివాడని నీ బిడ్డను నువ్వు చంపదలచుకోలేదా?" అంతరాత్మ నిలదీసి అడుగుతోంది.

తప్పు చేసిన అపరాధిలా తలొంచుకొన్నాడు రామారావు.

రెండు క్షణాలు నిశ్శబ్దం.

ఏడ్పు మరీ భయంకరంగా వినిపిస్తోంది.

"అ... అవును "

రామారావు పాంటు జేబీ కేసి చూసుకొన్నాడు. జేబీలోంచి ఒక పసుపు పచ్చని మందు డబ్బా పైకి తీసి, దాని మీదున్న

అక్షరాలు చదువుకోసాగాడు.

"టూ మచ్... ఈజ్... పాయిజనస్" అని వ్రాసి వుంది ఆ డబ్బా మీద.

"నీవు హంతకుడివి... కిరాతకుడివి... రాక్షసుడివి... అవునా?"

అంతరాత్మ పిచ్చిదానిలా అరుస్తోంది.

వణికిపోతూ క్రింద తూలి పడబొయ్యాడు రామారావు.

కళ్ళు గిర్రుమని తిరిగినట్లోంది.

హాస్పిటల్ అంతా తన చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉన్నట్లు అనిపిస్తోంది.

"వాట్ హాపెన్డ్ టూ యు మిస్టర్ రామారావ్?"

తూలిపడబోతున్న రామారావును పొదివి పట్టుకొన్నాడు అటుగా వెడుతున్న డాక్టర్.

"కమాన్ టేక్ రెస్ట్"

"నో... నో... నా బాబుని చూడాలి. వాడికేమయింది డాక్టర్?"

"అయాం సారీ రామారావ్ గారూ? రాత్రి నుండి వామిట్స్... మోషన్స్... వుయ్ హావ్ ట్రైడ్ అవర్ లెవెల్ బెస్ట్!"

"డా...క్ట...ర్!"

అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు ఉబుకుతూంటే జానకి ఉన్న బెడ్‌కేసి పరిగెత్తాడు రామారావు

"ఏమండీ!" జానకి రామారావుని చుట్టేసి బావురుమంది.

ఆమెను సముదాయించడానికి అక్కడున్నవారు అశక్తులై పొయ్యారు.

"జానకీ!" ఆమెను హత్తుకొన్నాడు రామారావు.

"బాబు మనల్ని వదలి వెళ్ళిపొయ్యాడండీ!"

నిర్జీవంగా పడివున్న తన బాబు కేసి చూశాడు రామారావు.

కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. అంతరాత్మ తన కేసి సానుభూతిగా చూస్తోంది.

# అమ్మ చెప్పింది నిజమే!

సరస్వతి కరవది

✆ 9849530000

***ఉన్నట్లుండి అమ్మ గుర్తొచ్చింది రాముకి. అమ్మో, ఆలస్యమైనందుకు అమ్మ ఎంత కంగారు పడుతోందో అనుకుంటూ ఇంటికి బయల్దేరాడు. దారిలో కుక్క తోకాడిస్తూ రాము దగ్గరకి వచ్చింది. దానికేసి కన్నెత్తి కూడా చూడలేదు. వేపచెట్టు దగ్గర ఆగలేదు కూడా. మొహం వేళ్ళాడేసుకుని, కన్నీళ్లతో తడిసిన బుగ్గలతో ఇంటివైపు నడిచాడు.***

"ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే మనిషిగా పుట్టినవారి మొదటి కర్తవ్యం కన్నా! సహాయం చేసి మరిచిపోవాలి. కానీ నీకెవరన్నా సహాయం చేస్తే జన్మంతా గుర్తుంచుకోవాలి. వాళ్ళకి మళ్ళీ చేతైన సహాయం చెయ్యాలి. నువ్వు చేసిన మంచి... నీకు అక్కరకొస్తుంది!" రాము క్రాఫ్ దువ్వుతూ చెప్పింది అమ్మ.

కళ్ళు పెద్దవి చేసుకుని, అమ్మ మొహంలోకి చూస్తూ విని ఆకళింపు చేసుకున్నాడు ఆరేళ్ళ రాము! స్కూలుకి బయల్దేరాడు. అమ్మ గుమ్మం దాకా వచ్చి 'టాటా' చెప్పింది. "జాగ్రత్త, చూసుకుని వెళ్ళు" అంటూ రోజూలాగానే వెనకనించి అరిచింది.

సందు చివర వేపచెట్టు కింద, ఈ మధ్యనే ఒక కుక్క ఆరు పిల్లల్ని పెట్టింది. మూడు తెల్లవి, రెండు నల్లవి. ఒకటి తెలుపు, నలుపు మచ్చలది. మిగిలిన కుక్కపిల్లలూ ఇష్టమే అయినా, రాముకు అదంటే మరీ ఇష్టం! స్కూలుకి వెళ్తూనప్పుడు, ఇంటికి వస్తున్నప్పుడు వాటిని చూడటం ఎంతో ఇష్టం! అవి వాళ్ళ అమ్మ దగ్గర పాలు తాగుతుంటే, తప్పటడుగులు వేస్తూ అటూ, ఇటూ తిరుగుతుంటే చూసి మురిసిపోతుంటాడు. వాటిని చూడటం కోసం బడికి ఓ పది నిమిషాలు ముందే బయలుదేరతాడు.

ఆవేళ వేపచెట్టు వైపు వెళ్తున్న రాముకి, దూరంనించే తల్లి కుక్క అరుపులు వినిపించాయి. ఏమయ్యిందో అనుకుంటూ పరిగెత్తుకుని వెళ్ళాడు రాము. ఎలా పడిందో... మచ్చల కుక్కపిల్ల వేపచెట్టు పక్కనే ఉన్న మురికి గుంటలో పడింది. తల్లి కుక్క ఆ గుంట చుట్టూ తిరుగుతూ తల్లడిల్లిపోతోంది. దోవన పొయ్యేవారు చూస్తున్నారు కానీ, ఆ కుక్కపిల్లను బయటకు తీసే ప్రయత్నం చెయ్యట్లేదు.

గుంట వెడల్పుగా ఉంది. కుక్కపిల్ల అప్పటికే మునుగుతూ తేలుతూ, మధ్యకి వెళ్ళిపోయింది. రాము మనసు తల్లడిల్లిపోయింది. అమ్మ మాటలు గుర్తు వచ్చాయి. ఈ కుక్కపిల్లని ఎలాగైనా కాపాడాలి. ఒక్క నిమిషం కూడా ఆగకుండా రాము ఆ గుంటలోకి దిగి కుక్కపిల్లను చేతులలోకి తీసుకున్నాడు. వాడి కాళ్ళు మోకాళ్ళ దాకా మురికి అయ్యాయి. అయినా లెక్కచెయ్యకుండా, దాన్ని వీధి కుళాయి దగ్గరకు వెళ్లి శుభ్రంగా కడిగి, వేపచెట్టు కింద దింపాడు. తరువాత తన ఒళ్ళు కూడా శుభ్రం చేసుకున్నాడు. అమ్మ తను బడిలో తినటానికని కట్టిన డబ్బా తెరిచి, అందులో ఉన్న అన్నమంతా వేపచెట్టు కింద పెట్టేసాడు.

తల్లి కుక్క గుర్రుగుర్రుమంటూ తింటుంటే, కుక్కపిల్లలు దాని మీదకు ఎగబడి పాలు తాగుతున్నాయి. అలా చూస్తుంటే రాముకి ఆనందం వేసింది.

అప్పుడు స్కూలు గుర్తొచ్చింది. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. ఆమ్మో, ఆలస్యమైంది అనుకుంటూ రివ్వురివ్వున పరిగెత్తాడు. కానీ రాము వెళ్ళేసరికే స్కూలు గేటు మూసేసారు. అప్పటికే పెద్దబెల్ కొట్టేశారు. అసెంబ్లీ మొదలైపోయింది. అదైతే కానీ గేటు తెరవరు. అసెంబ్లీ అయిన తర్వాత, పిల్లలందరూ తరగతి గదుల్లోకి వెళ్ళిపోయాక, గేటు తెరిచారు. రామూ పరిగెత్తుతూ తన తరగతికి వెళ్ళాడు. కానీ ఏం లాభం... అప్పటికే ఇంగ్లీష్ మాస్టారు క్లాసు మొదలు పెట్టేసారు.

ఆయన రామూని చూసి కోపంగా "ఇప్పుడా రావటం? ఇంత ఆలస్యంగానా? ఇటు రా, చెయ్యి చాపు" అని రాము చెప్పబోయేది కూడా వినకుండా బెత్తంతో ఒక్కటిచ్చారు!



రాము చెయ్యి మంటెత్తిపోయింది. కళ్ళవెంట నీళ్లు జలజలా కారాయి. గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కుకుంటూ రాము తన చోటుకెళ్ళి కూర్చున్నాడు.

'అమ్మ చెప్పింది అబద్ధం. మనం మంచి చేస్తే చెడు జరుగుతుంది. అలాంటప్పుడు మంచి ఎందుకు చెయ్యాలి అసలు? ఇంటికెళ్ళగానే అమ్మకి 'అమ్మా, నువ్వు చెప్పింది అబద్ధం. మంచి చేస్తే చెడు జరుగుతుంది. నేను కుక్కపిల్లకు సహాయం చేస్తే మాష్టారు నన్ను కొట్టారు. ఇంక నేను ఎవరికీ మంచి చెయ్యనూ' అని చెప్పాలని అనుకున్నాడు. స్కూలు అయ్యేవరకూ బిగబట్టుకున్న వాడి ఏడుపు, ఇంటి బెల్ కొట్టగానే పొంగుకొచ్చింది. అందరూ ఇంటికి పరుగెడితే తరగతి గదిలోనే కూర్చుని కుళ్ళికుళ్ళి ఏడ్చాడు రాము. రవి వచ్చి పిలిచినా కదలలేదు.

"నువ్వు కుక్కపిల్లని కాపాడటం నేను చూసారా. నువ్వు మంచిపనే చేసావు!" అని రవి అన్నా సరే, రాముకి ఏడుపు ఆగలేదు. చాలాసేపు ఎదురుచూసి రవి వెళ్ళిపోయాడు.

ఉన్నట్లుండి అమ్మ గుర్తొచ్చింది రాముకి. అమ్మో, ఆలస్యమైనందుకు అమ్మ ఎంత కంగారు పడుతోందో అనుకుంటూ ఇంటికి బయల్దేరాడు. దారిలో కుక్క తోకాడిస్తూ రాము దగ్గరకి వచ్చింది. దానికేసి కన్నెత్తి కూడా చూడలేదు. వేపచెట్టు దగ్గర ఆగలేదు కూడా. మొహం వేళ్ళాడేసుకుని, కన్నీళ్లతో తడిసిన బుగ్గలతో ఇంటి వైపు నడిచాడు.

ఇల్లు అంతదూరంలో ఉండగానే అమ్మ ఒక్క పరుగున వచ్చి రాముని ఎత్తుకుంది. వాడి తడి బుగ్గలను ప్రేమగా తుడుస్తూ ఇంట్లోకి తీసుకు వెళ్ళింది. రాముచేత కాళ్ళు, చేతులు కడిగించి, బట్టలు మార్పించి తినటానికి కారపు బూందీ, తీపిలడ్డు పెట్టింది. వాడి మూతి తుడిచి తన ఒళ్ళో పడుకోబెట్టుకుని, అరచెయ్యి తెరిచి దెబ్బమీద వెన్నపూస రాసింది. హాయిగా అనిపించింది రాముకు. మంట తగ్గింది. అమ్మ తల నిమురుతుంటే కళ్ళు మూతలు పడుతున్నాయి రాముకి. అమ్మకి రవి చెప్పాడు కాబోలు అనుకున్నాడు.

ఇంతలో బయటనించి "రామూ!" అంటూ ఇంగ్లీష్ మాస్టారి గొంతు విన్పించింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు రాము.

"అమ్మ, మా ఇంగ్లీష్ మాష్టరు వచ్చారు" అంటూ బయటకు పరిగెత్తాడు. కుర్చీ చూపించి, చేతులు కట్టుకు నిల్చున్నాడు.

అమ్మ వంటింట్లో నుంచి బయటకు వస్తూ "నమస్తే సార్!" అంది.

మాస్టారి మొహం వాడిపోయి ఉంది.

"విషయం తెలుసుకోకుండా రాముని కొట్టాను. రవి చెప్పేవరకూ తెలియదు. తండ్రి లేని పిల్లవాడు. నీకా ఎవరి అండా లేదు. వీడు దారితప్పుతాడేమోనని భయం. క్షమించమ్మా!" అన్నారు చేతులు జోడిస్తూ.

"అయ్యో, ఎంతమాట. మీరో దెబ్బేసినా తప్పులేదు. బిడ్డ మంచి కోసమేగా!" అంది అమ్మ.

మాస్టారు రాముని దగ్గరకు రమ్మన్నారు. వాడి చెయ్యి చూసిన ఆయన ముఖంలో బాధ కదలాడింది.

"రాము, మన స్కూల్‌వాళ్ళు నాగార్జున సాగర్ ట్రిప్‌కి పేరివ్వమంటే నువ్వు ఇవ్వలేదటగా? నీ పేరు ఇచ్చి, నేను డబ్బులు కట్టేసాను. నువ్వు కూడా సాగర్‌కి వస్తున్నావు." అన్నారు వాడి భుజం తడుతూ! రాము కళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి. అమ్మ మాస్టారికి దణ్ణం పెట్టింది.

"ఇలాగే ఎవరన్నా కష్టంలో ఉంటే సహాయం చేస్తూండు." అంటూ లేచారు మాస్టారు వెళ్ళటానికి.

'అమ్మ చెప్పింది నిజమే. మంచి చేస్తే అక్కరకొస్తుంది' అనుకున్నాడు రాము అమ్మ కుచ్చిళ్లలో మొహం దాచుకుంటూ!

# మంచి చేస్తే మంచే జరుగుతుంది

సి. హెచ్. నాగార్జున శర్మ

✆ 8978504127

***"బాబూ, నువ్వు దేవుడివి బాబూ. రెండ్రోజుల నుంచీ బిచ్చం దొరక్క, అన్నం లేక ఆకలితో అలమటిస్తున్నాం. నువ్వు చిన్న కుర్రాడివైనా చాలా పెద్ద మనసుతో మా ఆకలి తీర్చావు. పది కాలాలపాటు నువ్వు చల్లగా ఉండాలి బాబూ"***

రాము, కృష్ణ, రవి పాఠశాల విద్యార్థులు. ముగ్గురూ మంచి స్నేహితులు. ఒకరోజు ముగ్గురూ పాఠశాల నుంచి ఇంటికి వస్తూంటే వారికి దారిలో తళతళమని మెరుస్తూ ఒక అయిదువందల నోటు కనిపించింది. ఆ నోటుని ముగ్గురూ ఒకేసారి చూసారు. కానీ ముందుగా దాన్నిచేతిలోకి తీసుకుంది రాము. "ఒరే, ఎవరో ఈ డబ్బులు జారవిడుచుకున్నారు. వారెవరో తెలిస్తే బాగుండును. వారికి ఇచ్చేద్దుము!" అన్నాడు రాము.

కృష్ణ, రవి ఫక్కున నవ్వారు. "ఒరే రాము, నువ్వు చాలా అమాయకుడిలా ఉన్నావు. ఎవరికయినా డబ్బులు దొరికితే వారు అవి పోగొట్టుకున్న వారికి తిరిగిస్తారా? ఎంచక్కా మనం ఆ డబ్బులతో ఏమైనా కొనుక్కోవచ్చు. పదరా షాపింగ్ మాల్‌కి వెళదాం!" అన్నారు ఇద్దరూ.

కానీ రాము ఒప్పుకోలేదు. "అలా చేయటం తప్పురా! పరాయిసొమ్ము పాములాంటిదని మన మాష్టారు మనకు చెప్పలేదూ! ఇది పోగొట్టుకున్నవారు మనకి ఎదురు పడకపోతే అప్పుడు దీన్ని ఏం చెయ్యాలో ఆలోచిద్దాం!" అన్నాడు రాము.

అలా వాళ్ళు ముగ్గురూ కొంత దూరం నడిచారు. 'బాబూ, నావి అయిదొందల నోటు పడిపోయింది. మీకు దొరికిందా?' అంటూ ఎవ్వరూ ఆ ముగ్గురు పిల్లల్ని అడగలేదు. దాంతో రాము కాస్త నిరుత్సాహ పడ్డాడు. ఈ డబ్బు పోగొట్టుకున్నవాళ్ళు ఎంత బాధ పడుతున్నారో అని ఆలోచించి కాస్త కలత చెందాడు.

"ఒరే, ఈ నోటు మనకి దొరికి ఇప్పటికి గంటయ్యింది. ఎవరూ దీని గురించి అడగలేదు. పదరా హోటల్‌కి వెళ్లి, మనకి నచ్చినవి తిందాం!" అని ఆశ చూపించారు మిత్రులిద్దరూ.

అయినా రాము చలించలేదు. సమాధానం చెప్పలేదు.

"సరే నువ్వెలాగూ మా మాట వినవు కానీ, పద ఆ గుడి దగ్గరకి వెళదాం!" అన్నాడు కృష్ణ.

"గుడి దగ్గరకా? ఎందుకు?" అన్నాడు రవి.

"ఒకసారి మా అమ్మ చెప్పింది రా. మనకి దొరికిన డబ్బులు దేవుడి హుండీలో వేస్తే మనకి చాలా మంచి జరుగుతుందిట.

ఎలా అంటే మన డబ్బులు కూడా ఇలా ఎప్పుడూ పడిపోవంట" అన్నాడు కృష్ణ.

రాము, రవి చిన్నగా నవ్వుకున్నారు. "నువ్వు చెప్పింది కూడా బాగానే ఉందనుకో. కానీ మనం ఈ డబ్బులు దేవుని హుండీలో వేస్తే అవి ఎవరికి చేరుతాయో మనకి తెలీదు. ఇప్పుడే మన కళ్ళముందే ఈ నోటు పది మందికీ ఉపయోగ పడితే చాలా బాగుంటుందని నా ఆలోచన!" అన్నాడు రాము.



"కానీ మనం దీన్ని ఎలా ఉపయోగిస్తాం?" అన్నారు కృష్ణ, రవి ఇద్దరూ ఒకేసారి.

రాము దూరంగా చూసాడు. అక్కడ రోడ్ పక్కన కొంతమంది బిచ్చం ఎత్తుకుంటున్నారు. అందులో కొంతమంది కళ్ళు లేనివాళ్లు, కాళ్ళు లేనివాళ్లు, చేతులు లేనివాళ్లు ఉన్నారు. అది చూసి రాము మనసు జాలితో ద్రవించిపోయింది.

"నాకు ఒక ఆలోచన వచ్చింది రా! పదండి అక్కడికి వెళదాం!" అన్నాడు రాము.

రాము ఆలోచన కృష్ణ, రవి పసిగట్టారు. "ఓహో ఈ నోటుని చిల్లరగా మార్చి అందరికీ పంచుతావు కదూ?" అని ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"లేదురా" అన్నాడు రాము.

"మరి?" అని ఆశ్చర్యంగా చూసారు ఇద్దరు మిత్రులు.

"మీరు చెప్పినట్టు చేసినా, వాళ్ళు ఆ డబ్బుల్ని సద్వినియోగం చేస్తారో చెయ్యరో మనం చూడలేము. అందుకే నాకు ఒక ఆలోచన వచ్చింది!" అంటూ ముందుకు నడిచాడు రాము.

కాసేపయ్యాక, అక్కడున్న పదిమంది బిచ్చగాళ్లూ రామూని చూసి, "బాబూ, నువ్వు దేవుడివి బాబూ. రెండ్రోజుల నుంచీ బిచ్చం దొరక్క, అన్నం లేక ఆకలితో అలమటిస్తున్నాం. నువ్వు చిన్న కుర్రాడివైనా చాలా పెద్దమనసుతో మా ఆకలి తీర్చావు. పది కాలాలపాటు నువ్వు చల్లగా ఉండాలి బాబూ" అంటూ దండాలు పెట్టసాగారు.

"శభాష్‌రా రాము, ఈ అయిదు వందలతో నువ్వు కొన్న పళ్ళు, రొట్టెలు, తినుబండారాలు ఆ పదిమంది ఆకలీ తీర్చాయి. అది మనం కళ్లారా చూసాం. మేము నీలాగ మంచిగా కాకుండా తప్పుగా ఆలోచించాంరా" అన్నారు కృష్ణ, రవి.

ఎలాంటి కల్లా కపటం, కల్మషం లేని ఆ మూడు పసి మనసులు ఒక మంచిపని చేశామనే తృప్తితో నిండిపోయాయి.

# హైదరాబాద్ హరిదాసు

కర్లపాలెం హనుమంతరావు

✆ 8142283676

**విశిష్ట అతిథి కథ**

***ఇది విమలమ్మగారు ఇచ్చి పంపించారు. మామ్మగారి కండిషన్ చూస్తున్నారుగా! మన లోకంలో లేరు.. వారం రోజులుగా! తాతగారు పెళ్ళయిన మొదటి ఏడాది 'మేరేజీ డే' సందర్భంగా ఇచ్చిన ప్రేమకానుకట ఈ ఉంగరం.. ఈ మామ్మగారే చెప్పారు. ఉండుండి.. ఈ ఉంగరం కోసం వలవలా ఏడుస్తుంటే, నేనే కబురు పంపించాను. బెంగుళూరు పోయే ముందు వాళ్ళ పనమ్మాయి ద్వారా ఇప్పించే ఏర్పాటు చేసారు విమలమ్మగారు!"***

సుబ్బరాజు గారింట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదొస్తే విచారించటానికని వెళ్ళాం.

పోయింది ఒక ఉంగరమే. కాని, దాని ఖరీదు 'ఐదు లక్షలు'!

"విలువ సంగతి అట్లా ఉంచి, అది మా కుటుంబానికి అచ్చొచ్చిన ఉంగరం! పిల్ల పెళ్ళి పెట్టుకున్నాం. ఇప్పుడిట్లా జరగడం ఏదో అశుభంగా తోస్తోంది!" అన్నాడు సుబ్బరాజుగారు మధన పడుతూ!

ఇంట్లోని ఇంతకన్నా విలువయిన వస్తువులన్నీ అట్లాగే ఉన్నాయి. ఈ ఒక్క ఉంగరమే మాయమయి పోవడానికి ఏదో బలమైన కారణమే ఉండుంటుంది. అది కనుక్కోవడమే పోలీసులుగా మా పని!

సుబ్బరాజుగారు ప్రముఖ ఆరక్ కాంట్రాక్టర్! జీడిమెట్ల ఏరియాలో ఇంకేదో పరిశ్రమా ఉంది. సినిమా నిర్మాణంతో సంబంధాలున్నాయి. రాజకీయంగా ఎంతో పలుకుబడి కూడా ఉన్న పెద్దమనిషి! ఫిర్యాదుని తేలిగ్గా తీసుకోలేం గదా!

సుబ్బరాజుగారు కుటుంబ సమేతంగా బెంగుళూరు వెళ్ళినప్పుడే ఇంట్లో ఈ దొంగతనం జరిగింది. సహజంగానే ముందు అనుమానం ఇంటి పనిమనిషుల మీదకు మళ్ళింది.


"ఆ రెండు రోజులూ పనివాళ్ళనెవర్నీ రావద్దన్నాం. బైట వాచ్‌మేన్, కేర్‌టేకర్ వెంకటేశ్వరావుగారూ, ఇంట్లో ఉండే మంగమ్మా తప్ప ఎవరూ లేరు!" అన్నాడు సుబ్బరాజుగారు.

వెంకటేశ్వరావు గారుండేది అవుట్‌హౌస్‌లో! కుటుంబం లేదాయనకు. అయినా అక్కడా గాలించాము. అనుమానించదగిందేమీ కనిపించలేదు.

పెద్దవాళ్ళ ఇళ్ళల్లో సి.సి. కెమెరాలు వాడతారు.. దొంగల భయాలు ఎక్కువైపోయి! సుబ్బరాజు గారింట్లో కూడా అట్లాంటి ఏర్పాటు ఉండటం వల్ల, ఆ రెండు రోజుల్లో ఆ ఇంటికి జరిగిన రాకపోకల్ని గమనించడానికి వీలైంది.

మొదటి రోజు ఉదయం పనమ్మాయి ఇల్లు శుభ్రం చేస్తున్నప్పుడు, బైట నుంచీ ఏదో పద్యం వినిపించింది కాసేపు. భాగవతంలోని గజేంద్ర మోక్షంలోని పద్యం అది. రాగయుక్తంగా శ్రావ్యంగా పాడుతున్నారెవరో!

“లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్! ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్ ...’



ఇంతలో పద్యాన్ని మాటేదో మింగేసింది. ఆ గొంతు గూర్ఖాది. పనమ్మాయిల దోసిట్లో ఏదో పట్టుకుని బైటికి వెళ్ళి రావడం కనిపించింది. తిరిగొచ్చేటప్పుడు ఆమె చేతులు ఖాళీగా ఉన్నాయి!

“శుక్రవారం, శుక్రవారం ‘హైదరాబాదు హరిదాసు’ వస్తాడయ్యా! ఆ దాసు వచ్చినప్పుడల్లా, అమ్మగారింట్లో ఉన్నా లేకపోయినా, ఓ దోసెడు బియ్యం అక్షయ పాత్రలో ఎయ్యడం ఎప్పుడూ చేసేదే, అందుకే ఏసాను. అదీ తప్పే!” అంటూ దీర్ఘాలు తీసింది పనమ్మాయి.

'హైదరాబాదు హరిదాసా'! ఈ పేరే ఏదో విచిత్రంగా ఉంది వినటానికి. అయినా ఇదేమీ సంక్రాంతి సీజను కూడా కాదే! ఇప్పుడు హరిదాసు రావడమేంటి?'

ముందు ఈ హైదరాబాద్ హరిదాసు సంగతేంటో కనుక్కోమని ఎస్సై హరినారాయణకు పురమాయించాను. రెండు రోజుల్లో ఓ సమాచారం కొంత వచ్చింది.

"'హైదరాబాద్ హరిదాసు' పెట్టుడు పేరు! అసలు పేరు కృష్ణ దాసు! అన్నీ కృష్ణుడికి సంబంధించిన పాటలూ, పద్యాలే పాడుతుంటాడు. అందుకూ ఆ పేరు! కమ్మటి గొంతు. పాడుతుంటే వినే వాళ్ళు ఆ భక్తి పారవశ్యానికి ఎంత అర్జంటు పనిలో ఉన్నా, ఒక్క క్షణం నిలబడి ఆలకించాల్సిందేట.. తెల్సిన వాళ్ళు చెప్పారు సార్" అన్నాడు హరినారాయణ.

"ఓ.. ఆ దాసా!" అన్నాడు అక్కడే ఉన్న హెడ్ కానిస్టేబుల్ రాములు. స్టేషన్లో కూడా ఒక నైటు సెల్ లో ఉన్నాడు రెండేళ్ళ క్రిందట! విద్యానగర్ ప్రొఫెసర్‌గారి పాప కనిపించకుండా పోయిన కేసులో, తెచ్చి విచారించాం సార్! లాకప్పులో కూర్చుని రాత్రంతా ఏవేవో పాటలూ పద్యాలూ పాడాడు సార్! అప్పటి ఎస్సై పాండురంగారావుగారికి కూడా పద్యాల పిచ్చి! ఇద్దరూ కలిసి నైటంతా మాకు 'శ్రీకృష్ణ రాయబారం' నాటకం చూపించారు."

"మరప్పుడా పంతులు అనుపానులు కనుక్కోలేదా?" అనడిగాను.

"లేదు సార్. వట్టి గంగిగోవు లాగున్నాడు. తెల్లారి తలా ఒక పది రూపాయలేసుకుని సంభావనిచ్చి పంపించాం!" అన్నాడు రాములు.

"ఆ హరిదాసు హైదరాబాదులోనే తిరుగుతుంటాడు సార్! వారాల వంతుల ప్రకారం కాలనీల కొచ్చి పోతుంటాట్ట! నిన్న విజయనగర్ కాలనీలో పురాణం చదివాట్ట! రమణమూర్తి అని ఇదివరకు టీవీల్లో, సినిమాల్లో వేషాలు వేసిన ఆర్టిస్ట్.. ఆయన తల్లి ఆఖరి దశలో ఉందంటే వచ్చి, పోతన భాగవతం చదివి పోయాట్ట! "అన్నాడు ఎస్సై హరినారాయణ.

"నిజమే సార్| మంచి విద్వత్తూ సంగీత జ్ఞానం. ఆ రాగాలూ తాళాలూ తప్పుల్లేకుండా పాడే పద్ధతి చూస్తే, నిజంగా ఏ దేవలోకం నుంచో దిగొచ్చిన నారదుడు... తుంబురుడు లాగా అనిపిస్తాడు. టీవీల్లో రేడియోలో పాడతే రాణించేవాడు. ఎందుకో మరి ఇట్లా ఇళ్ళ గేట్లు పట్టుకుని వేలాడుతుంటాడు!" అన్నాడు రాములు.

రమణమూర్తిని ఫోన్లో విచారించినప్పుడు "మేం అతన్ని ఎక్కడ పట్టుకోవచ్చు?" అనడిగాను.

ఇంకా నా అనుమానం హరిదాసు మీద నుంచీ పూర్తిగా తొలగిపోలేదు. "ఆ దాసు భగవద్గీత శ్లోకాలు ఆలపిస్తుంటే మా అమ్మ మొహంలో కనిపించిన ప్రశాంతతను మర్చిపోలేను. అందుకే పెద్ద కర్మ రోజుకు రమ్మని పిలిచా. వస్తాడనుకుంటా!" అన్నాడు రమణమూర్తి.

మూర్తిగారి తల్లి పెద్ద కర్మ ఎప్పుడో ఎక్కడో కనుక్కుని, హరిదాసు మీదో కన్నేసి ఉంచే పని రాములుకు అప్పగించాను.

రాములు తెచ్చిన రిపోర్టు వింతగా ఉంది. "ఆ దాసు వచ్చాడు సార్! పొద్దుట్నుంచీ ఒహటే పురాణ పఠనం. ఏదో గరుడ పురాణంట... అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు, చెపుతున్నాడందులోని విశేషాలు! ఆ టైములో ఎట్లా డిస్టర్బ్ చెయ్యాలో తెలీలేదు. చివర్లో మాత్రం మీ ఇంటి అడ్రసు ఇచ్చి ఒకసారి కలిసిపొమ్మని చెప్పి వచ్చాం!" అన్నాడు రాములు.

"నువ్విచ్చిన అడ్రస్ ఒక పోలీసాఫీసరుదని తెలిస్తే వస్తాడా! నువ్వే అతన్ని దగ్గరుండి తీసుకురావాల్సింది!" అన్నాను అసంతృప్తిగా.

"అమ్మగారికి అన్నమాచార్యుల వారి కీర్తనలంటే చాలా ఇష్టంగా సార్! ఆయన జయంతి రోజు రేపే గదా! ఒకసారి వచ్చి అమ్మగారిని కలిసి మెప్పిస్తే, మంచి సంభావన ఇప్పిస్తానని మాట ఇచ్చాను సార్!" అన్నాడు రాములు.

రాములు వయసులో చాలా పెద్దవాడు. మా ఇంటి సంగతులు బాగా తెలిసినవాడు. ఆ ఆదివారం హరిదాసు మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చాడు.

రాములు చెప్పిన మాట నిజమే! చూడగానే ఆకర్షించే విగ్రహం. నిలువు నామాలు, పట్టు వస్త్రాలు, పైన శాలువా, మెళ్లో మరువం దండ, నెత్తి మీద అక్షయపాత్ర! మగ్గిన కమలాపండు రంగులో ఉన్నాడు. వాచికంలో స్పష్టత, గొంతులో మాధుర్యం. అతని సంగీత ప్రావీణ్యానికి మా శ్రీమతి బాగా ఇంప్రెస్ అయిపోయింది.

'ఎంత మాత్రము ఎవ్వరు దలచిన అంత మాత్రమే నీవు| అంతరాంతరము లెంచి చూడు పిండంతే నిప్పటి యన్నట్లు...' అని హరిదాసు భక్తి పారవశ్యంతో పాడుతుంటే, పక్క ప్లాట్ల వాళ్ళు కూడా వచ్చి కూర్చున్నారు. అడిగిందే తడవుగా, తడుముకోకుండా అడిగిన కీర్తనలను పాడేస్తుంటే అన్నమాచార్యులవారే మా నట్టింట్లో కొలువైనట్లనిపించింది.

'ఈ మనిషిని అనుమానించడం సబబేనా?' అన్న మధన మొదలయింది నాలో! ఏమైనా డ్యూటీ డ్యూటీనే!!

సుబ్బరాజుగారు ఇంట్లో లేనప్పుడు ఆ ఇంటికి పిలిపించింది ఎవరు? పనిమనిషి నిజంగానే ఎప్పటిలాగే గుప్పెడు బియ్యంతో సరిపెట్టిందా? మామూలుగా ఇంటి యజమానులు ఇంట్లో లేనప్పుడు, బిచ్చగాళ్ళకి అంత చొరవగా దానాలు చేసే ఆసక్తి పని మనుషులు చూపించరు. సుబ్బరాజుగారు పోయిందంటున్న ఉంగరం.. పూజాగదిలో దేవుడి ముందు ఉండేది. ఊరికి వెళ్ళేముందు ఆ గదికి తాళం వేసుకొని వెళ్ళామని సుబ్బరాజుగారు చెబుతున్నారు. వేసిన తాళం వేసినట్లే ఉన్నప్పుడు, లోపలి వస్తువుకి మరి రెక్కలు ఎలా మొలిచినట్లు?

హఠాత్తుగా పాట ఆగిపోవడంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. ఎదుటి మనుషుల్లో ఏ మాత్రం అనాసక్తి పసిగట్టినా వెంటనే పాట ఆపేస్తాడుట ఈ హరిదాసుగారు. అన్నీ వింత అలవాట్లే!

సుమారు గంటన్నర సేపు సాగింది మా ఇంట్లో దాసుగారి గాన కచేరి! మామూలుగా దానధర్మాలంటే అంతగా ఆసక్తి చూపించని మా అర్ధాంగి, నా చేత అర్ధ వెయ్యి నూటపదహార్లు, పంచెల చాపు ఇప్పించింది పంతులుగారికి!

యథాలాప సంభాషణలో, హరిదాసుగారి నోటి నుంచి కొంత సమాచారం రాబట్టగలిగాను.. నా పోలీసు తెలివి చూపించి!

ఈ హరిదాసుది మంగళగిరి దగ్గర ఏదో చిన్న పల్లెటూరు. చిన్నప్పుడు వాళ్ళ ఊళ్ళో 'భక్త ప్రహ్లాద' నాటకంలో బాల ప్రహ్లాదుడి వేషం కట్టాడుట! నాటకాల పిచ్చిలో పడి, చదువుని అటకెక్కించేసాడు. పదో తరగతి పోయినా... పద్యాలూ పాటలూ ఒక్కసారి వింటే చాలు, ఇట్టే పట్టేసే కళ మాత్రం అట్లాగే ఉందిట! తొమ్మిదో తరగతిలో తెలుగు వాచకంలోని 'రుక్మిణీ కళ్యాణం'లోని, 'భూషణములు చెవులకు బుధ తోషణములు' పద్యం బిగ్గరగా చదువుతుంటే, పక్క క్లాసులోని ఇంగ్లీషు టీచరు శోభారాణిగారు పిలిపించుకుని అందరి ముందు తన తలలోని పువ్వు తీసి ఇచ్చిందని ఇప్పుడు చెప్పుకుని మురిసిపోయాడు పిచ్చి బ్రాహ్మడు!

"మీ అసలు పేరేంట" ని అడిగితే 'కనకయ్య' అని చెప్పాడు. "నాటకాల్లో తను ఎక్కువగా వేసిన కృష్ణుడి వేషం పాపులర్ అయిపోవడం వల్ల అందరూ 'కృష్ణదాసు' అంటారు సార్" అన్నాడు హరిదాసు.

"మరి ఈ హరిదాసు వేషం ఏమిటి?" అనడిగాను అసలు విషయం రాబట్టటానికి.

చాలా విషయాలే చెప్పుకొచ్చాడప్పుడు.

"మా నాయన పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటులో ప్యూను సార్. క్షయవ్యాధి వచ్చి, తగ్గించుకునే డబ్బు లేక చచ్చిపోయాడు. మా అమ్మ పోరు భరించలేక, నేనాయన ఉద్యోగంలో చేరాను. అప్పుడే పెళ్ళయింది. నాటకాల పిచ్చి మరీ ముదిరింది. విజయవాడ దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో జరిగే ఊరేగింపులో ప్రతి ఏటా నేనే కృష్ణుడి వేషం కట్టేది. అన్యమతస్తుడు నా పై అధికారి! నా మీద కక్ష గట్టాడు. నన్ను ఉద్యోగంలో నుంచి వూడబెరికించిందాకా నిద్రపోలేదు. నాకు ఏడేళ్ళ పాప. ఇల్లు పట్టకుండా తిరుగుతున్నానని అలిగి పిల్లతో ఎటో వెళ్ళిపోయింది మా ఆవిడ! అమ్మే నన్ను చివరి దాకా కనిపెట్టుకుని ఉన్నది. అందుకే అమ్మంటే నాకు చాలా ఇష్టం. ఆమె పోయిన తరువాత ఆ భారమూ వదిలిపోయింది. తెగిన గాలిపటంలా ఎటో ఎటో తిరుగుతూ చివరికి ఇక్కడ ఇట్లా తేలాను సార్!"

"అది సరే! ఈ హరిదాసు వేషం?"

"నాకు వచ్చిన విద్య.. పాటలూ పద్యాలూ పాడటం! ఈ వేషం పిడికెడు కూడు పెట్టడానికి! ఇప్పటి జనం పాత పాటలూ పద్యాలూ ఇష్టపడుతున్నారు. ఒకసారి ఇట్లాగే రైల్లో పోతూ, ఉంఛ వృత్తి సౌందర్యాన్ని గురించి శ్రీత్యాగరాజస్వామి వారు ఆలపించిన దివ్య నామ సంకీర్తన 'హరిదాసు వెడలె ముచ్చట ఆనందమాయె దయాళో' అని పాడుకుంటుంటే, ఎదుటి సీట్లోని సాహెబుగారొకాయన లేచి వచ్చి, అమాంతం నన్ను ఆలింగనం చేసుకొని, చేతిలో ఓ యాభై రూపాయల నోటు పెట్టాడు. అప్పటి నుంచి ఇట్లా పాడుకుంటూ జీవనం గడుపుకోవటమే వృత్తిగా ఎంచుకున్నా!" అన్నాడు హరిదాసు.

"అది సరే! సీజనుతో సంబంధం లేకుండా ఇట్లా వేషం వేస్తే జనం నమ్ముతారా?" అని అడిగాను.

"సార్! ఈ కాలంలో జనాలకు అన్నిటిలో వెరైటీ కావాలి. చివరకు పాతకాలం నాటి పాటలలో కూడా కొత్తదనం కోరుకుంటున్నారు. మరీ మైకేల్ జాక్సన్ మోడల్‌లోనో, అద్నాన్ సామీ తరహాలోనో మోడ్రన్ బీట్స్ నా వయసుకీ, తాహతుకూ సరిపడేవి కాదు. పల్లెటూళ్లో కనిపించే హరిదాసు మే మాసం ఎండల్లో కూడా సిటీలో కనిపిస్తే, ఎంత బిజీగా ఉన్న వాళ్ళైనా, ఒకసారి ఇటు చూపు సారిస్తారు. హరిదాసు వేషంలో ఉన్న మనిషి సత్యహరిశ్చంద్రుడి నాటకం కాటి సీను పద్యాలు చదివితే, బంజారా హిల్స్ లాంటి లొకాలిటీలోని పెద్దవాళ్లకు భలే నచ్చుతుంది. సికిందరాబాద్ వెస్ట్ మారేడుపల్లిలో పాతకాలం నాటి కన్నడ కుటుంబాలు ఇంకా కొన్ని ఉన్నాయి. వాళ్ళ కోసం పురందరదాసు పదాలు పాడుతుంటాను. 'ఈస బేకు ఇద్దు జయిస బేకు.. ఈదవలెను, ఈది నెగ్గవలెను' అని కన్నడ యాసతో పాడుతుంటే వాళ్ళకదో ఆనందం! కాచిగూడ సెంటర్లో ఒక ఫేమస్ బార్ ఉంది సార్! మీకు తెలిసే ఉంటుంది. దాని ముందొకసారి హరిదాసు వేషంలో నిలబడి ముద్దుకృష్ణ అనువాదం చేసిన ఉమర్ ఖయ్యాం గజల్స్ వినిపించా.. కాసులే కాసులు. మీరు నమ్ముతారో నమ్మరో గానీ.. ఒకసారి కోటీ ఉమెన్స్ కాలేజీ గేటు ముందు నిలబడి, కొనకళ్ల వెంకటరత్నంగారి 'రావోయి బంగారి మామ' అంటూ పాడితే... ఆడపిల్లలు చుట్టూతా మూగి గాల్లో ముద్దులు విసిరారు. ముద్దు మురిపాలతో కడుపు నిండే వయసా నాది! 'రెండు

ముద్దలు కడుపు నిండా తింటా.. ఒక పూటకు 'టాక్ టైము' తగ్గించుకుని పది రూపాయలు కనికరించమంటే, కరిగి నీరయి పోయారు సార్ ధర్మతల్లులు!" అంటూ చాలా సంగతులు ఎమోషనల్‌గా చెప్పుకొచ్చాడు హైదరాబాద్ హరిదాసు!

పోతూ పోతూ మా ఆవిడ ఇప్పించిన 'పంచెల చాపు' మడతల మధ్య, నేను దాచి ఉంచిన రెండు వేల నోటు తిరిగిచ్చేశాడు. దాసు బుద్ధి బయటపడుతుందని నేనే మా ఆవిడకు కూడా తెలీకుండా ఆ నోటు అక్కడ పెట్టించింది.

ఇలాంటి మనిషి మీద ఇంకా అనుమానం పెట్టుకుని తిరగటం.. టైమ్ వేస్ట్ అని ఆ క్షణంలోనే నిర్ధారణ కొచ్చేసాను.

కానీ మర్నాడు రాములు తెచ్చిన సమాచారంతో వ్యవహారమంతా తలకిందులయి పోయినట్లయింది.

"సార్! మీరు చెప్పినట్లు, నిన్న ఆ హరిదాసుని రోజంతా ఫాలో చేసాం. సాయంకాలం సికింద్రాబాదులో లోకల్‌ట్రైన్ ఎక్కినవాడు.. చీకటి పడే వేళకి చర్లపల్లి శివార్లో దిగిపోయాడు. అక్కడ ఏ ఊరూ లేదు. డొంకలో పడి ఆయన పోయిన దిక్కున.. ఉన్నది ఒక హరిజన వాడేనంట! అక్కడికి ఈ బాపనాయన ఎందుకు వెళ్ళనట్లో కనుక్కుందామనుకుని వెళదామనకుంటే.. ఇంతలోనే ఎస్సై గారు తిరిగి రమ్మన్నారు!" అన్నాడు రాములు.

"మీ దగ్గర్నుంచి సరైన ఇన్‌స్ట్రక్షన్స్ లేకుండా ముందుకు పోవడం మంచిది కాదనుకున్నా సార్!" అన్నాడు ఎస్సై హరినారాయణ సంజాయిషీగా .

మర్నాడు తెల్లారుజామునే రాముల్ని తీసుకొని, నేనే స్టేషన్ వెహికల్ మీద బయలుదేరాను.

రాములు చెప్పింది నిజం! ఆ ముళ్ళూ, రాళ్ళలో బండి నడపడానికి వీలు కాకుండా ఉంది. జీపుని ఒక ఇంటి ముందు నీడలో నిలిపించి, కాలి నడకన బయలుదేరాం నేనూ రాములూ! పరగడుపున జనాలు ఉపయోగించే బహిర్భూమి లాగా ఉంది ఆ ప్రాంతమంతా! రెండు మురుగు కాలువలు దాటిం తరువాత గాని.. రాలేదు హరిదాసు ఉన్నాడని చెప్పిన ఇల్లు!

నిజానికి అది ఇల్లు కాదు. తాటాకులు కప్పిన ఒక చుట్టుపాక!

బయట బావి దగ్గర హరిదాసు వంటికి నీళ్ళు పోసుకుంటూ ఎంకి పాటలు పాడుకుంటూ కనిపించాడు. "ఎంకి వంటి పిల్ల లేదోయి లేదోయి / ఎంకి నా వంకింక రాదోయి రాదోయి / మెళ్ళో పూసల పేరు / తల్లో పూవులు సేరు / కన్నెత్తితే చాలు కనకాభిషేకాలు.." ఇలా సాగిపోతుంది హరిదాసుగారి ఎంకి నాయుడు బావ పాట!

మధ్యలో కళ్ళెత్తి చూడగానే మేం.. కంగారు పడ్డాడు! కానీ వెంటనే తేరుకున్నాడు హరిదాసు. గబగబ తుండు మొలకు బిగించుకొని, నా ఎదుటకు వచ్చి నిలబడ్డాడు.

నిన్న అతన్ని చూసిన ఆకారానికి.. ఇప్పుడు చూస్తున్న రూపానికీ ఎంతో తేడా! పాక లోపలి నుంచి ఒక ఆడమనిషి గొంతు.

'ఏ తీరుగ నను దయతలచెదవో / ఇల వంశోత్తమ రామా॥ నా తరమా భవసాగర మీదను! నళిన దళేక్షణ రామా'.. ఆర్ద్రత మిళితమైన ఆ రాగం ఉదయపు తేట గాలిలో పాకలో నుంచి తెరలు తెరలుగ తేలి వస్తూన్నది. అర్థంకాక హరిదాసు వంక గుడ్లురిమి చూశాను. అర్థం చేసుకొన్నట్లున్నాడు.. నిశ్శబ్దంగా పాకలోకి దారి తీశాడు. వెనకనే నేనూ రాములూ!

పాకంతా చీకటి. చీకు వాసనతో డోకు వచ్చేటట్లుంది లోపల. ఒక మూల గుడ్డి దీపం. రాత్రంతా బలహీనంగా వెలిగినందుకు గుర్తుగా పొగచూరి ఉంది.

ఆ మసక వెలుతురులోనే, మూలనున్న కుక్కి మంచంలోని శాల్తీ నుంచి ఇందాకటి రామదాసు కీర్తన తేలి వస్తున్నది!

మా రాకను ఏ మాత్రం పట్టించుకున్నట్లు లేదా ఆకారం! రాములు అటు వైపు టార్చి లైట్ ఫోకస్ చేశాడు. ఆ వెలుతురుల్లో ఆమెను చూసి షాకయ్యాను. సుబ్బరాజుగారి ఇంట్లో గోడ మీది ఫోటోలో చూపినట్లుంది.. ఆ ఆకారం!

“ఎవరీమె?” అనడిగాను హరిదాసును గద్దించి.. అనుమానం నిర్ధారించుకోవాలిగా! హరిదాసు నుంచి బదులులేదు.

“సుబ్బరాజుగారి తల్లి కదూ?” నేనే అడిగాను అనుమాన నివృత్తి కోసం!

“కాదు సార్! ఆయన అత్తగారు. ఆయన భార్య విమలమ్మగారి తల్లి!” హరిదాసు సమాధానంలో బెదురే మాత్రం లేదు.

“అలాగా! అయితే అంత పెద్దాయన అత్తగారు ఇక్కడెందుకున్నట్లో? నువ్వు గానీ ఎత్తుకొచ్చావా?” అనరిచాను అసహనంగా.

“లేదు సార్! సుబ్బరాజుగారే పంపించారు స్వయంగా!”

“ఎందుకు? నమ్మే కహానీయేనా ఇది?'' నా సహనం అంతకంతకూ నశించిపోతోంది.

“నమ్మండి.. నమ్మకపోండి.. మీ ఇష్టం! జరిగింది చెబుతా.. వినండి కాస్త ఓపిగ్గా!” అంటూ ఆమె వంటి మీద కప్పిన దుప్పటిని తొలగించాడు హరిదాసు.

వళ్ళంతా పుళ్లు.. కుష్టు పుళ్లు!

ఆ వాసనే ఇందాకట్నుంచీ పాకంతా ఆక్రమించి ఉంది.

హరిదాసు ఆ ముసలమ్మ పక్కలో కూర్చుని, అనునయంగా ఆమె చేతులు చూపిస్తూ.. చెప్పుకొచ్చాడు.

“ఈ తల్లికి కుష్ఠు వ్యాధి. చూశారుగా వేళ్ళన్నీ ఎలా కరిగిపోయాయో! ఇట్లాంటి మనిషిని వాళ్ళ ఇంట్లో పెట్టుకోడానికి ఇష్టపడలేదు సుబ్బరాజుగారు. కూతురికి సంబంధాలు చూస్తున్నారు. అమ్మమ్మకు ఇట్లాంటి రోగముందని తెలిస్తే సంబంధాలొస్తాయా!”

“అందుకని నీ దగ్గర దింపి పోయారా.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ట్రీట్మెంట్ ఇప్పిస్తారు గానీ!”

“సుబ్బరాజుగారేమన్నా చిన్నా చితకా మనిషా సార్! ఇవాళ మీడియా ఎంత ప్రో యాక్టివ్‌గా ఉందో మీకు తెలీంది కాదు. గుట్టు కోసం ఈ ఏర్పాటు చేసుకున్నారు!”

హరిదాసు వాదన తెలివిగానే ఉంది గానీ.. ఎందుకో నమ్మ బుద్ధి కావడంలేదు.

“పిల్ల పెళ్ళి అయిందాకా ఇక్కడ అట్టే పెట్టే ఏర్పాటు చేసింది సుబ్బరాజుగారే! నేను కేవలం కాపలా మనిషిని మాత్రమే సార్! కావాలంటే క్రాస్ వెరిఫై చేసుకోవచ్చు!”

"ఐదు లక్షలు ఖరీదు చేసే ఈ ఉంగరం కూడా ఇచ్చి పంపించారా?" నా మాటల్లో సాధ్యమైనంత వెటకారం చొప్పించి అడిగాను.. ముసలమ్మ మిగిలున్న ఎడంచేతి ఒక వేలుకూ ఉన్న ఉంగరాన్ని చూపిస్తూ!

"ఓ.. ఇదా! అంత ఖరీదైందా? నాకు తెలిదే! ఇది విమలమ్మగారు ఇచ్చి పంపించారు. మామ్మగారి కండిషన్ చూస్తున్నారుగా! మన లోకంలో లేరు.. వారం రోజులుగా! తాతగారు పెళ్ళయిన మొదటి ఏడాది 'మేరేజీ డే' సందర్భంగా ఇచ్చిన ప్రేమ కానుకట ఈ ఉంగరం.. ఈ మామ్మగారే చెప్పారు. ఉండుండి.. ఈ ఉంగరం కోసం వలవలా ఏడుస్తుంటే, నేనే కబురు పంపించాను. బెంగుళూరు పోయే ముందు వాళ్ళ పనమ్మాయి ద్వారా ఇప్పించే ఏర్పాటు చేసారు విమలమ్మగారు!"

సి.సి కెమేరాలో పనమ్మాయి బైటున్న హరిదాసు భిక్షకని తీసుకెళ్లిన దోసిలి బియ్యంలోనే ఈ ఉంగరం ఉందన్నమాట! క్లూ దొరికింది. కేసంతా తెలిమబ్బులా విడిపోయింది.. ఒక్క అనుమానం తప్ప!

మరి సుబ్బరాజుగారే స్వయంగా ఎందుకు కంప్లయింట్ ఇచ్చినట్లు?

"సుబ్బరాజుగారికీ సంగతులేవీ తెలిసుండక పోవచ్చు! అత్తగారంటే ఆయనకు మొదట్నించీ గిట్టదంటారు. ఇల్లరికపుటల్లుడంట గదా ఈయన!" అన్న హరిదాసు మాటల్లో నిజాయితీ కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

ఇక ఉంగరం గురించి ముందుకు పోకూడదని ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాను.

చిత్రంగా సుబ్బరాజగారూ తర్వాత ఆ ఉంగరం గురించి వాకబు చేయనేలేదు. అసలు విషయం ఎస్సై ద్వారా తరువాత తెలిసింది. "మీరు అక్కడికి వెళ్లొచ్చిన మర్నాడే ముసలమ్మ పోయారు సార్! హైదరాబాదు హరిదాసు ఆ ఖరీదైన ఉంగరం తిరిగి సుబ్బరాజుగారి భార్యకు భద్రంగా చేరేసాట్ట!"

"అన్యాయంగా ఒక సద్బ్రాహ్మణుణ్ణి అనుమానించారు మీరు. ఇంటికి పిలిచి భోజనం పెడితే గాని, పాప పరిహారం కాదు!" అంది మా శ్రీమతి కథంతా విని నిష్టూరంగా.

ఇందులో అభ్యంతరం చెప్పాల్సిందేముంది?! కానీ, ఆ హైదరాబాదు హరిదాసు అసలు దాసరి బ్రాహ్మడే కాదుట!

"ఇవాళే తెలిసింది సార్. భాగవతం పద్యాలూ పాటలూ పాడుకుంటూ, తరతరాలుగా పొట్ట పోసుకునే బుడగ జంగాలంట సార్!" అన్నాడు మర్నాడు ఎస్సై హరినారాయణ.

అయినా సరే, హైదరాబాదు హరిదాసుగారికి మేము ఇచ్చే ఆతిథ్యం ఆపదలుచుకోలేదు. కులానిదేముంది? గుణం ప్రధానం కానీ!

సుబ్బ 'రాజు' గారు.. హైదరాబాదు హరి'దాసు'.. ఈ ఇద్దరూ ఇందుకు ఉదాహరణే!

# పొగడపూలు

## శ్రీ పోరంకి దక్షిణామూర్తి

**కథామార్గదర్శి కథ**

***ఇక్కడివాళ్లు కొంతమంది యుద్ధం పేరు పెట్టి లాభాలు చేసుకుంటున్నారు. ఇదేం న్యాయం చెప్పు అన్నయ్యా! వీళ్లకెప్పుడు బుద్ధొస్తుంది చెప్పు? పోనీలే, ఇవన్నీ రాశానని నువ్వు బాధపడకు! ఇలా రాశానని తెలిస్తే అమ్మ నన్ను చంపేస్తుంది. డబ్బు విషయం కూడా ఊరికేనే రాశాను. నువ్వేం ఇబ్బంది పడి పంపవద్దు! ఇక్కడ మనవాళ్లు చాలామంది ఉన్నారు. ఎల్లాగో సర్దుకుంటాం. నీకు ఇంకా ఏమేం కావాలో అన్ని రాయి. పంపుతాను.***

విశాలాక్షి పంచలో కూర్చుని పొగడపూల దండ కడుతోంది. దండ కడుతూ కడుతూ, మధ్య మధ్య వాసన చూసుకుంటూ, పొడుగు కొలుచుకుంటూ దారం చుట్లు తిప్పుతూ ఉంది. తన మనస్సంతా దండలోనే కూరుస్తున్నట్టుగా కళ్లు విప్పార్చుకుంటూ, అప్పుడప్పు డొకసారి తల పైకెత్తి బయటి గేటు వైపు చూస్తోంది. తన వెర్రి కాని, ఆయనగారు వస్తూనే ఉంటే గేటు చప్పుడు వినిపించకుండా ఉంటుందా? అలాగని చూడకుండానూ ఉంటుందా? ఈ దండ పూర్తవకుండానే ఆయన వచ్చేస్తారేమో అన్న కంగారు విశాలాక్షి కళ్లల్లో విలవిల్లాడుతోంది! ఎందుకంటే... పువ్వులమ్మే పున్నమ్మ ఉందా... అదెప్పుడూ ఏ పిచ్చి పువ్వులో, గడ్డిపువ్వులో తెస్తూంటుంది కాని ఒక పున్నాగం, ఒక పారిజాతం, ఒక విరజాజి, ఒక దవనం, ఒక మరువం ఏదీలేదు. తను చెప్పను సైతం చెప్పింది, 'నువ్వు పిచ్చి పువ్వులు తెచ్చేటట్టయితే మావారు పుచ్చుకోవద్దన్నా'రని! అది వినిపించుకుంటుందా? దానికి దొరికినవేవో అది తెస్తూనూ ఉంటుంది, తను కొంటూనూ ఉంటుంది. తను ఏవి కొన్నా, ఏవి తురుముకున్నా ఆయనగారి కంత పట్టింపుల్లేవు. అయినా ఆయన వాటిని చూసి ఒకసారి తలనిమిరితే చాలు, అన్నీ పారిజాత పుష్పాలే పరిమళించినట్టనిపిస్తుంది. ఒళ్లు పరవశించిపోతుంది! పువ్వులంటే తనకంత పిచ్చి!

చిన్నతనంలో అయితే పొద్దస్తమానమూ ఆ పూలచెట్లలోనే పసరికపాములా తిరగాడుతూ ఉండేది. అత్తయ్యగారి కమలా, తనూ రోజూ తెల్లారగట్టే లేచి, జనార్దనస్వామి కోవెలకి వెళ్లి, అక్కడ కళ్యాణమంటపానికి అవతలి వెంపున, గన్నేరు చెట్లున్నాయే, వాటిమధ్య నిటారుగా ఉండే పొగడచెట్టుందే, ఆ చెట్టు క్రిందకి చేరి, పరికిణీ జోలి పట్టి, పొగడపువ్వు లేరుకుంటూ ఉండేవారు. ఆ చెట్టుకింద రాలి, మంచులో తడిసిన ఆ పొగడపూలు ఎన్ని ఏరుకుంటే మట్టుకు చాలనిపిస్తుంది? గుళ్లో పూజారిగారి కూతుళ్లు, ఆ పువ్వులన్నీ ఎక్కడ ఏరేసుకుంటారో అని వాళెవళ్లూ నిద్దర్లు లేవకముందే వెళ్లిపోయి ఒడినిండా పూలు నింపుకుని తెచ్చుకుంటూ ఉండేవారు.



ఏమిటో, ఆ సంగతులన్నీ తల్చుకుంటూంటే ఇప్పుడు నవ్వొస్తుంది... అనుకుంటూ విశాలాక్షి ఒకసారి తల పైకెత్తి మళ్లీ గేటు వేపు చూసింది. తనకి తెలీనేలేదు, ఆయనగారు అప్పుడే గేటు కిర్రుమనిపించడమూ, వెనక్కి తిరిగి గేటు వెయ్యడమూ, మెట్లెక్కుతూండడమూ జరిగిపోయాయి. విశాలాక్షి ముందేమనుకుందంటే, ఆయనగారు రాకముందే పొగడపూలన్నీ పెద్ద దండ కట్టి దాచేసి, ఆయన్ని కాస్త ఊరించి ఊరించి, అప్పుడు చూపించి తల్లో పెట్టుకోవాలనుకుంది. కాని అప్పుడే మెట్టెక్కేస్తున్నారు. అందుకని, పువ్వులన్నీ గుచ్చేత్తేసి సజ్జలోకి ఎత్తేసింది. అతనూ సరిగ్గా పై మెట్టు మీద అడుగు పెట్టేసరికి తనూ చటుక్కుని లేచి, నవ్వుతూ ఎదురొచ్చింది.

"ఒక్క నవ్వేసాలు ఒజ్జిర వైడూర్యాలు" అని ఈవేళ అతను అనలేదు. అతననగా విశాలాక్షుడు. అనగా విశాలాక్షికి ఆయనగారు. అంటే రామారావన్నమాట. అంటే ఇప్పుడొచ్చినతనే!

ఆ రామారావు ఈవేళ మామూలుగా రాలేదు. ఏమిటో నీరసంగానూ, బెంగగానూ ఉన్నట్టొచ్చాడు. చేతిలో కూరల సంచీ విశాలాక్షికి అందించి, బూట్లోంచి కాళ్లు లాగి పారేసుకుని లోపలికి వెళ్లిపోయాడు.

తనకి నవ్వు బాకీపడ్డ ఆయనగారు, కనీసం అర నవ్వయినా బాకీ తీర్చకుండానే బిగుసుకుపోయి, లోపలికి వెళ్లి పోవడం విశాలాక్షికేం బాగుండలేదు. అయినా, ఆ బాకీ తనకిప్పుడు ఎలాగా వసూలు కాదని నిరుకు చేసుకున్నదై, కాలదోషం పట్టేలోపున వెనక పీఠీని చెల్లు రాయించుకోగలనన్న 'ధీమాతిరేకం' కలదై, అతనికి సబ్బూ, తువ్వాలు అందించేందుకు వెనకాలే వెళ్లిపోయింది.

అ అతను బట్టలు మార్చుకుని, పంచలో వాలుకుర్చీలో కూచునే సమయానికి, అమృతంలాంటి కాఫీ.. అంటే పంచదార ఎక్కువ ఒంపేసిందని అర్థం కాదు. వారానికి అర్ధకిలో మించి అడిగినా దొరకటంలేదు కనుక, తన అమృత హస్తం ప్రభావమే కాఫీకి కూడా ప్రసరింపజేసి, ఆయనగారికి అందించింది. అందించి, 'ఏఁవండి! మీరివేళ ఏవిటోలా ఉన్నారు!" అంది.

సదరు రామారావుకి, అడపా, తడపా అలా ఏమిటోలా ఉంటూండడం కద్దు... అంటే మనస్సు బాగోనప్పుడూ, ఒంట్లో బాగోనప్పుడూ, ఊళ్లో బాగోనప్పుడూ, ఉద్యోగం బాగోనప్పుడూనూ! ఎప్పుడో కాని, మొదటి మూడూ బాగోకుండా ఉండవు. చివరిదే అస్తమానూ బాగోకుండా ఉంటుంది. ఎందుకంటే, రామారావు బస్సు కండక్టరు. విశాలాక్షిలాంటి పిల్లకి, ఆయన అయినవాడు. అల్లాంటి ఉద్యోగం చెయ్యలేదని అతని నమ్మకం. అయినా తను చెయ్యగలుగుతున్నాడంటే విశాలాక్షిని చూసుకునేవని కూడా అతని నమ్మకమే. ఎంచేతంటే, మనిషి కాస్త మెత్తనివాడు. ఒకళ్లకి ఇబ్బంది కలుగుతుంటే చూస్తూ ఊరుకోలేడు. తనకి ఒచ్చే ఇబ్బందిని ఓర్చుకోనూలేడు. ఇట్టే అలసిపోతూంటాడు. ఇట్టే చిరాకు పడిపోతుంటాడు. ఇట్టే దిగాలు పడతాడు. అయినా ఎవర్నీ విసుక్కోలేదు. కసురుకోలేదు. తన్లోతనే సరిపెట్టుకుని పనిచేసుకు పోతూంటాడు. ఉద్యోగంలో చేరిన కొత్తలో, ఇక్కడి కెందుకొచ్చి పడ్డానా దేవుఁడా.. అనుకున్నవాడే! రాను రాను కాస్తంత సాత్వికత అలవరచుకున్నాడు. రోజూ రకరకాల మనుషులు ఎందరెందరో బస్సుల్లో ప్రయాణాలు చేస్తుంటారు. రకరకాల మనస్తత్వాల వాళ్లు. కొందరు పొగరుబోతులుంటారు. కొందరు పెద్ద మనుష్యులుంటారు. కొందరు జబర్దస్తీగా నిలబడతారు. కొందరు ఒదిగొదిగి తప్పుకుంటారు. కొందరు టికెట్టు కొనకుండానే తప్పించుకుంటారు. కొందరు తనను పిలిచి డబ్బులు చేతిలో పెట్టి టిక్కెట్టు అడుగుతారు. విలువైన వస్తువులు సంగ్రహించేందుకు, కొందరు బస్సుల్లో విహారాలు చేస్తుంటారు. కొందరు పాపం... విలువైన వస్తువులు, జీవితంలో విలువైన వస్తువులు కూడా బస్సుల్లోనే పోగొట్టుకుంటారు. జీవితంలో ఎంత వైవిధ్యం ఉంటుందో, ఎన్నిరకాల అనుభవాలుంటాయో, అన్నీ ఈ బస్సు ప్రయాణంలో అగుపిస్తూనే ఉంటాయి. ఇవన్నీ తను రోజూ చూస్తూ ఉండాలి. తరువాత రామారావు అనుకున్నాడు... 'అవును ఈ ఉద్యోగం తప్పించుకుంటే మాత్రం ఈ ప్రపంచాన్ని తప్పించుకోగల్నా?' అని. ఈ ప్రశ్న వేసుకున్న తరవాత రామారావు దిగులుపడ్డం మానేశాడు. పపంచంలో ఉన్న వైవిధ్యాన్నంతనీ ఇలా చూస్తూ, తనకేమీ అంటి అంటనివాడిలా, తథాగతుడిలా చూస్తూ, జీవితాన్ని తిలకిస్తూ ఉండడం కూడా అందమైన అనుభవమేనని గ్రహించాడు.

ఇలా తృప్తి పడిన రామారావుకి, మనస్సు ఈ వేళెంతో వికలంగా అయింది. అందుకు కారణం ఒక వస్తువు. అది తనకి బస్సులో దొరికింది. దాన్ని గురించే తను ఆలోచిస్తున్నాడు. అందుకే దిగులుగా కనిపిస్తున్నాడు. అందుకే విశాలాక్షి అంది, 'ఏవండి, మీరివేళ ఏమిటోలా ఉన్నారు' అని!

రామారావు కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్లాడు. విశాలాక్షి ఆశ్చర్యంగా చూస్తోంది. రామారావు ఒక ప్యాకెట్టు తెచ్చాడు. విశాలాక్షికిచ్చాడు. ఆమె విప్పింది. అందులో ఒక స్వెట్టరు ఉంది. దాంతోబాటు ఒక ఉత్తరమూ ఉంది. విశాలాక్షి కాయితం విప్పింది. 'చదువు!' అన్నాడు రామారావు. విశాలాక్షి చదువుతోంది..

"ప్రియమైన చిన్నన్నయ్యకి,

నీ చెల్లెలు కమల నమస్కరించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. అక్కడ నువ్వు క్షేమంగా ఉన్నావని తలుస్తాను. ఈ మధ్య నీ దగ్గర్నించి ఉత్తరం వచ్చి చాలా రోజులైంది. ఎందుకు రాయలేదో తెలీటంలేదు. అమ్మకి ఏమీ తోచటంలేదు. నాకూ ఎంతో బెంగగా ఉంది. ఎప్పుడూ నెలకోసారైనా రాస్తూ ఉండేవాడివి, ఇప్పుడు ఎందుకు రాయడం లేదో అర్థం కావడం లేదు. ఏరా అన్నయ్యా... నీకు ఒంట్లో బాగోడంలేదా? జరమొస్తే మందివ్వడానికి, అక్కడ డాక్టర్లు ఉన్నారా, లేదా? అలా లేకపోతే నాకు వెంటనే రాయి. ఇక్కడ చలపతిరావుగారి దగ్గిర మందు తీసుకుని పంపిస్తాను. ఇంకా నీకు ఏం కావాలో రాయి... అన్నీ కొని పంపిస్తాను. ఇక్కడ మాట్లాడుకోడానికి నేనూ. అమ్మా అయినా ఉన్నాం. అక్కడ నీకు, పాపం,

మాట్లాడానికి మనవాళ్లెవళ్లూ ఉండరని బాధపడుతూ ఉంటాం. పోని, ఒకసారి సెలవు పెట్టి రాకోడదా చిన్నన్నయ్యా? మీకసలు సెలవులియ్యరా? నిన్నసలు ఇంక ఇంటికే పంపించరా? మమ్మల్ని చూడనియ్యరా? 'అన్నయ్యని ఒచ్చేసెయ్యమని రాసేస్తానమ్మా!' అని అమ్మతో అంటే, 'నీ వెర్రిగాని, వాడిప్పుడు అర్ధాంతరంగా ఒచ్చేస్తే ఎలాగమ్మా' అంటుంది. నాకింకేం అనడానికి తోచలేదన్నయ్యా ! తరవాత, నేను రోజూ బడికి పోతున్నాను. ఈ నెల నేను క్లాసులో ఫస్టు రాంకులో వచ్చాను. నన్ను మొదటి బెంచీమీద కూర్చోపెట్టి అందరూ చప్పట్లు కొట్టారు. అన్నట్లు ఈ నెల బడికి జీతం కట్టడం చాలా ఆలస్యం అయిపోయింది. ఇక్కడ ఎక్కడా అప్పు దొరకడంలేదు. బియ్యం ధర పెరిగి పోయింది. ఇంటికి అద్దె కూడా అయిదు రూపాయలు ఒక్కసారి పెంచేశారు. పంచదార దొరక్క చాలా బాధపడుతున్నాం. పప్పులూ, ఉప్పులూ దగ్గర్నుంచి అన్నీ పెరిగిపోతూ ఉంటే, 'మనలాంటి వాళ్లం ఈ ఊళ్లల్లో బతకడమెలాగో తెలీడంలేదని' అమ్మ అస్తమానూ అంటూ ఉంటుంది. నువ్వు మిలట్రీలో చేరడానికి వెళ్ళిన తరవాత, ఈ ఊరు చాలా మారిపోయింది.

అన్నయ్యా, ఇక్కడ ఆశిగొట్టు మనుషులు ఎక్కువైపోయారు. నీలాంటివాళ్లు దేశం కోసం మిలట్రీలో చేరితే, ఇక్కడివాళ్లు కొంతమంది యుద్ధం పేరు పెట్టి లాభాలు చేసుకుంటున్నారు. ఇదేం న్యాయం చెప్పు అన్నయ్యా! వీళ్లకెప్పుడు బుద్ధొస్తుంది చెప్పు? పోనీలే, ఇవన్నీ రాశానని నువ్వు బాధపడకు! ఇలా రాశానని తెలిస్తే అమ్మ నన్ను చంపేస్తుంది. డబ్బు విషయం కూడా ఊరికేనే రాశాను. నువ్వేం ఇబ్బంది పడి పంపవద్దు! ఇక్కడ మనవాళ్లు చాలామంది ఉన్నారు. ఎల్లాగో సర్దుకుంటాం. నీకు ఇంకా ఏమేం కావాలో అన్ని రాయి. పంపుతాను. అన్నట్టు నువ్వుంటున్న చోట చలి ఎక్కువని రాశావు కదూ, అందుకని నేను ఈ మధ్య స్వెట్టరొకటి నీ కోసం అల్లాను. రోజూ రాత్రిళ్లు తొడుక్కుంటూ ఉండు. మంచులో తిరగొద్దని అమ్మ మరీ మరీ రాయమంది. అంతగా తప్పకపోతే, దుప్పటి కప్పుకుని వెళ్లమంది. మన పక్కవారింట్లో పొగడచెట్టు మొన్న గాలి వానకి విరిగిపడిపోయింది. నీకు పొగడపువ్వులంటే ఇష్టం కదూ, అందుకోసం నీకు పంపుదామనుకున్నాను. ఏం చెయ్యను చెప్పు! ఎంత దేవుళ్లాడినా ఎక్కడా దొరకలేదు. ఏమీ అనుకోవని తలుస్తాను.

చిత్తగించవలయును!

ఇట్లు

నీ చెల్లెలు, కమల వ్రాలు.

విశాలాక్షి ఉత్తరం చదువుతూంటే రామారావు కళ్లు మూసుకుని విన్నాడు. వింటున్నంతసేపూ అతని మనస్సు దిగాలుపడిపోయింది. "ఈ ప్యాకెట్టు ఈ వేళ బస్సులో దొరికింది. పాపం ఆ అమ్మాయి ఎవరో పారేసుకుంది. పంపుదామంటే ఎడ్రస్సులేదు. బస్సు యజమానులికిస్తే, అది ఆ అమ్మాయికి అందుతుందని నమ్మకం లేదు. అందుకని తెచ్చేశాను" అన్నాడు.

ఉత్తరం చదివిన కాస్సేపటిదాకా విశాలాక్షి తేరుకోలేదు. అప్పుడు లోపలికి వెళొచ్చి, పొగడపూలు తెచ్చి ఆ ప్యాకెట్టులో పోసి రామారావు చేతికిచ్చింది. అతను దాన్ని జాగ్రత్తగా కుట్టి మిలటరీ హెడ్ క్వార్టర్సు పేర పంపుతూ, దాని మీద "కమల అనే చెల్లెలు గల చిన్నన్నయ్యకి ఇవ్వవలసింది" అని రాశాడు.

విశాలాక్షి తృప్తిగా నవ్వుకుంది.

*(భారతి, 1.10.1964 సంచిక నుంచి పునర్ముద్రణ)*



మీ మొబైల్ ఫోనులోనో, లాప్‌టాప్‌లోనో
మీ ఇంట్లో నలుగురూ కలిసి కథలు చదువుకోవడం,
అదీ ఉచితంగా, ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందీ?!
ప్రతి నెలా కథామంజరి మీ కోసం అందించే
చక్కటి కథల సంచికను ఉచితంగా పొందడానికి

ఇక్కడ నొక్కండి